జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 151 | శుక్రవారం | 01-05-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



శ్రమే జీవితం... శ్రమే లక్ష్యం..
శ్రమతోనే భవిష్యత్తు...
శ్రమే మన ఇలవేల్పు..

**శ్రమజీవులకు మేడే శుభాకాంక్షలు**

## ‘మీ చట్టాలు సవరించండి’

అత్యాచార బాధితుల గర్భవిచ్ఛిత్తిపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** ఓ మైనర్ బాలిక (15ఏళ్లు) గర్భవిచ్ఛిత్తి కేసులో అత్యున్నత న్యాయ స్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. మైనర్ బాలికను గర్భం దాల్చమని బలవంతం చేయకూడదని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అత్యాచార బాధితులు 20 వారాలు దాటిన తర్వాత కూడా అవాంఛిత గర్భాలను తొలగించుకోవడానికి వీలుగా చట్టాన్ని సవరించాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్రాన్ని గట్టిగా కోరింది. ఇటీవలి ఈ కేసులో వైద్యపరంగా 30 వారాల తరువాయి 8లో

# విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి

- జవాబుదారీ పెంచేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం
- సకాలంలో పుస్తకాలు, ఇతర సామగ్రి అందేలా చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

విద్యార్థులకు అవసరమైన సామగ్రి సరఫరాలో జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నామని, సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని, ఇందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. విద్యా శాఖతో పాటు బిసి, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్‌సి డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తరువాయి 8లో




కార్మిక వర్గానికి సిఎం మేడే శుభాకాంక్షలు 12

## ఇరాన్‌పై పుతిన్ ప్రతిపాదనకు ట్రంప్ తిరస్కృతి

మళ్ళీ యుద్ధం వస్తే ప్రమాదమని పుతిన్ హెచ్చరిక

గంటన్నరసేపు ఫోన్ సంభాషణ



**వాషింగ్టన్:** ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని పరిష్కరించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన ప్రతిపాదనలను తిరస్కరించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తామిద్దరి మధ్యా గంటన్నరసేపు ఫోన్ సంభాషణ జరిగిందని చెప్పారు. పుతిన్ చేసిన ప్రతిపాదనలను తాను తిరస్కరించానన్నారు. అందుకు బదులుగా, ఇరాన్‌లో ఉన్న శుద్ధి చేసిన యురేనియం, దాని అవశేషాలను నేరుగా రష్యాకు స్వాధీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా తరువాయి 12లో



ప్రధాని పర్యటనలో...

## పాలమూరు–రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి

పెట్రో కొరతపై 4న రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన హామీలు నెరవేర్చాలి
- లేనిపక్షంలో తెలంగాణ పట్ల ప్రధానికి ద్వేషం ఉందన్న అనుమానం నిజమవుతుంది
- ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వ్యాఖ్యలు
- పిఎసిఎస్ పాలకమండళ్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రధాని మోదీ ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్నారని, అయితే కేవలం వచ్చి వెళ్లడం కాకుండా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చి వెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేణ శంకర్, వి.ఎస్.బోస్ పాల్గొన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ ప్రధాని రాష్ట్ర పర్యటన నేపథ్యంలో సాధారణ అభివృద్ధి పనులు కాకుండా పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలన్నారు. లేకపోతే ప్రధానికి తెలంగాణ పట్ల ఇక్కడి ప్రజల పట్ల ద్వేషం ఉందన్న అనుమానం నిజం అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో తరువాయి 8లో



## డిజిపి శివధర్‌రెడ్డి పదవీ విరమణ

ఘనంగా వీడ్కోలు పలికిన అధికారులు, సిబ్బంది

రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర డిజిపి బి.శివధర్‌రెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ మేరకు తెలంగాణ పోలీసు శాఖ ఆయనకు పోలీసు అకాడమీలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ముందుగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ఇప్పుడు పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. అందుకు తామంతా ప్రత్యక్ష సాక్షులమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తరువాయి 8లో




గౌ॥ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిచే శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డుల ప్రదానం

భవన నిర్మాణ కార్మికులకు మరియు ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు

నమోదు చేసుకున్న వారికి సహాయం
- ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు
- ప్రమాదవశాత్తు పాక్షిక/శాశ్వత శారీరక అంగవైకల్యానికి రూ.4 లక్షలు
- పూర్తి శాశ్వత అంగవైకల్యానికి రూ. 5 లక్షలు
- ప్రమాదం వలన అంగవైకల్యం కలిగితే కృత్రిమ అవయవాలు మరియు చక్రాల ఖర్చులు
- సహజ మరణానికి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు
- మహిళా కార్మికురాలి వివాహం/కార్మికుల కుమార్తెల వివాహానికి ఒక్కొక్కరికి రూ.30 వేలు
- మహిళా కార్మికురాలికి/కార్మికుని భార్యకు మరియు కార్మికుల కుమార్తెలకు ప్రసూతి సాయం రూ.30 వేల

నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు
- అడ్వాన్స్‌ట్రైనింగ్ సెంటర్లలో ప్రవేశాలు
- 19 రకాల వైద్య పరీక్షలు మరియు వైద్యుడి సలహాతో ఆరోగ్య పరీక్షలు రూ. 3,256/- విలువైన సేవలు కార్మికులకు ఉచితం.
- ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ. 5 లక్షలు వరకు ఆరోగ్య బీమా

నమోదు చేసుకోని కార్మికులకు
. పనిలో ప్రమాదవశాత్తు మరణిస్తే, కుటుంబ సభ్యులకు రూ.50,000/-
. 50% కన్నా ఎక్కువ వైకల్యానికి రూ. 20,000/- మరియు 50% కన్న తక్కువ వైకల్యానికి రూ. 10,000/-
. ఆన్‌లైన్ ద్వారా అన్ని సేవలు

సమస్యల పరిష్కారానికి
టోల్ ఫ్రీ నెం. 080 69434343



జారీ చేసిన వారు: సమాచార, పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

# మీడియాను ఇజ్రాయెల్ అనుమతించేనా?

పాలస్తీనాలోని గాజాలో జరుగుతున్న పరిణామాలను స్వతంత్రంగా పరిశీలించి, వార్తలు రాసేందుకు అనుమతించాలని ఇజ్రాయెల్‌కు ప్రముఖ మీడియా సంస్థలు విజ్ఞప్తి చేశాయి. అసలు అక్కడేమి జరుగుతుందో తెలుసుకునేందుకు వీలుగా విదేశీ జర్నలిస్టులను గాజాలో స్వేచ్ఛగా ప్రవేశించేందుకు అనుమతించాలని కోరుతూ అసోసియేటెడ్ ప్రెస్, సిఎన్ఎన్, రాయిటర్స్, బిబిసి వంటి దిగ్గజ అంతర్జాతీయ మీడియా సంస్థలు ఉమ్మడిగా లేఖ రాసాయి. క్షేత్రంలో దిగి, వాస్తవాలను అన్ని కోణాలలో పరిశీలించి నిష్పాక్షికంగా వార్తలు అందించడమనేది జర్నలిస్టుల ప్రాథమిక విధి. అయితే, గాజాలో మాత్రం అది సాధ్యపడడం లేదు. అక్కడ యుద్ధం మొదలైన 2023 నుంచి విదేశీ జర్నలిస్టులను స్వతంత్రంగా కవరేజికి వెళ్లడంపై ఇజ్రాయెల్ నిషేధం విధించింది. ఇందుకు ఇజ్రాయెల్ సైనికులు మోహరించిన ప్రదేశాలు తెలిసి, వారు ప్రమాదంలో పడే అవకాశం ఉందనే సాకు చూపింది. యుద్ధభూమికి వెళ్లడం ప్రమాదకరమని, కాబట్టి అప్పుడప్పుడు ఇజ్రాయిల్ సైన్యం నీడలో కొంత మంది విదేశీ జర్నలిస్టులు విడతల వారీగా గాజాకు వెళ్లేవారు. నియంత్రిత వాతావరణంలో వారు వాస్తవాలు తెలుసుకోలేక, ఒకే కోణంలో వార్తలు ఇవ్వాల్సి వస్తుందని ఫిర్యాదు.

ఇప్పుడు కాల్పుల విరమణ అమలులోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ తమను స్వేచ్ఛగా గాజాకు అనుమతించకపోవడంపై ప్రశ్నిస్తున్నాయి విదేశీ మీడియా సంస్థలు. అందుకే ప్రఖ్యాత మీడియా సంస్థల ఎడిటర్లు ఉమ్మడిగా ఇజ్రాయెల్‌కు లేఖ రాశారు. బంధీలు ఇప్పటికే ఇళ్ళకు చేరుకున్నందున ఇజ్రాయెల్ సైనికులకు జర్నలిస్టుల కారణంగా ముప్పేమి ఏర్పడబోదని, సహాయ సామాగ్రి తీసుకువచ్చే సిబ్బందిని అనుమతిస్తుండగా జర్నలిస్టులను అనుమతించడంలో అభ్యంతరమేమిటనే సహేతుక ప్రశ్న లేవనెత్తారు. అంతకుముందే ఫారిన్ ప్రెస్ అసోసియేషన్ రెండేళ్ళ క్రితం గాజాలో అనుమతించాలంటూ ఇజ్రాయెల్ కోర్టులో వేసిన పిటిషన్‌పై తీర్పు తీవ్ర జాప్యం జరుగుతోంది.

వాస్తవాలు ప్రపంచం ముందుకు వస్తాయనే ఉద్దేశ్యంతో వారి దుష్కృత్యాలు వెలుగు చూడకుండా ఉండేందుకు గాజాలో స్వేచ్ఛగా తిరగాడేందుకు జర్నలిస్టులను అనమతించడం లేదు. అక్కడ జరుగుతున్నది మారణహోమం. యుద్ధం మొదలైనప్పటి నుంచి సుమారు 73 వేల మంది చనిపోయినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెబుతోంది. అనధికారికంగా అంతకంటే ఎక్కువే ఉండొచ్చని భోగట్టా. అందులో అధికులు మహిళలు, చిన్నపిల్లలే. నగరాలను, పట్టణాలలోని బంగళాలను నేలమట్టం చేసి, మట్టిదిబ్బలుగా మార్చేశారు. ఆసుపత్రులపై, కాలే కడుపులు పట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ ఆహారం కోసం సహాయ శిబిరాలకు వెళ్తున్న పాలస్తీనావాసులపై అమానుషంగా జరిపిన కాల్పుల్లో అనేక మంది హతమయ్యారు. ఇంతటి భయానక దృశ్యాలు, వాస్తవాలను కప్పిపుచ్చేందుకే అంతర్జాతీయ మీడియాను స్వతంత్రంగా సంచరించేందుకు పాలస్తీనాకు అనుమతిచడం లేదు.

ఇన్ని ఆటంకాల నడుమ కూడా అనేక మంది పాలస్తీనా, అల్ జజీరా వంటి ఛానల్ జర్నలిస్టులు ప్రాణాలు పణంగా పెట్టి గాజాలో తిరగాడుతూ మానవ హననాన్ని అత్యంత సాహసోపేతంగా వార్తలు, వీడియోల రూపంలో ప్రపంచం దృష్టికి తీసుకురాగలిగారు.దురదృష్టవశాత్తు ఈ ప్రక్రియలో భాగస్వాములైన 200కు పైగా జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. తాజాగా ఏప్రిల్ మాసం తొలినాళ్ళలో కారుపై డ్రోన్ దాడి జరగగా ఒక జర్నలిస్టు ప్రాణాలు విడిచారు. విదేశీ జర్నలిస్టులను అనుమతించాలని కోరడం ఇదే మొదటిసారి కాదు. 2024, 2025లో కూడా అంతర్జాతీయ మీడియా సంస్థలు స్వేచ్ఛగా వార్తలు రాసేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశాయి. అయినా పెడచెవిన పెట్టింది ఇజ్రాయెల్. ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న తరుణంలో జర్నలిస్టులను అనుమతించడం ఇజ్రాయెల్ దృష్టిలో అత్యాశేనేమో!



## లడాఖ్ ప్రజల గొంతులు అణచివేస్తున్నారు....

లడాఖ్ ప్రజల గొంతులను అణచివేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారు. వారి భూమిని, సున్నితమైన పర్యావరణాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'బిలియనీర్ మిత్రులకు' అప్పగిస్తున్నారు. లడాఖ్ ప్రజలు అభివృద్ధికి వ్యతిరేకం కాదు. అయితే స్థానికులకు ప్రయోజనం చేకూర్చే అభివృద్ధిని కోరుకుంటున్నారు.

- లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ



# మానవుల దుఃఖ విముక్తి ప్రదాత గౌతమ బుద్ధుడు

విశ్వ మానవాళి నాగరికత పరిణామంలో అద్భుతమైన ఘట్టం గౌతమ బుద్ధుడి జననం. ఎందుకంటే మానవ చరిత్ర గురించి మాట్లాడుకోవాల్సి వస్తే బుద్ధుడికి ముందు బుద్ధుడి తర్వాత చర్చించుకోవాల్సిన అనివార్య చారిత్రక సత్యం దాగి ఉన్నది. బుద్ధుడు ప్రపంచానికి శాంతి, అహింస, కరుణ అనే సందేశాలను అందించిన గొప్ప జ్ఞాని. బౌద్ధమతాన్ని స్థాపించిన ఆయనను 'ఆసియా జ్యోతి' (Light of Asia) అని పిలుస్తారు. ఆయన జీవితం, బోధనల గురించి ముఖ్యమైన అంశాలు ఇక్కడ ఉన్నాయి:

**బుద్ధుడి జననం మరియు బాల్యం**

గౌతమ బుద్ధుడు క్రీ.పూ.563 ప్రాంతంలో నేపాల్‌లోని(అఖండ భారత్) లుంబినీ వనంలో జన్మించారు. ఆయన అసలు పేరు సిద్ధార్థుడు. తండ్రి శుద్ధోధనుడు శాక్య వంశపు రాజు, తల్లి మాయాదేవి. సిద్ధార్థుడు పుట్టిన కొద్ది రోజులకే తల్లి మరణించడంతో, పినతల్లి గౌతమి ఆయనను పెంచి పెద్ద చేసింది. అందుకే ఆయనకు 'గౌతముడు' అనే పేరు వచ్చింది. రాజభోగాల మధ్య పెరుగుతున్న సిద్ధార్థుడిని బయటి ప్రపంచంలోని దుఃఖం తాకకుండా తండ్రి జాగ్రత్త పడ్డారు. కానీ ఒకరోజు నగరం బయటకు వెళ్ళినప్పుడు ఆయన నాలుగు దృశ్యాలను చూశారు. అవి 1.ఒక ముసలివాడు 2.ఒక రోగి 3.ఒక శవం 4.ఒక ప్రశాంతమైన సన్యాసి...ఈ దృశ్యాలు సిద్ధార్థుడిని తీవ్రంగా కలిచివేశాయి. మానవ జీవితంలో అంతిమంగా ముసలితనం, వ్యాధి, మరణం తప్పవని గ్రహించి, శాశ్వతమైన ఆనందం కోసం తన 29 వ ఏట భార్య యశోధరను, కుమారుడు రాహులుని, రాజ్యాన్ని వదిలి, తన రథసారధి అయినా చేన్నడు సహాయంతో అడవికి వెళ్ళిపోయారు. దీనినే మహాభినిష్క్రమణం అంటారు.

**బుద్ధుడి ముఖ్య బోధనలు (ధర్మం)**

బుద్ధుడు తన మొదటి బోధనను వారణాసి సమీపంలోని సారనాథ్‌లో ఐదుగురు శిష్యులకు అందించారు. దీనిని 'ధర్మచక్ర పరివర్తన' అంటారు. ప్రపంచమంతా దుఃఖమయం అవడానికి కారణం మానవాళి కోరికలు. ఆ కోరికలను అంతమొందించుకుంటే మానవ జీవితం దుఃఖరహితంగా ఉంటుంది. అయితే నాడు గౌతమ బుద్ధుడు మానవ జీవితం లో దుఃఖం లేకుండా ఉండడానికి విపరీతమైన అంతులేని అదుపులేని కోరికలు కలిగి ఉండకూడదు అని క్షత్రియలకు హితబోధ చేయగా, నేడు ఆధునిక ప్రపంచంలో అగ్రకులాల చేత సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా పీడిత కులాలైన 90% బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు బ్రతకడానికి ఉండాల్సిన సహజమైన కోరికలు కాకుండా అతిగా కోరికలు ఉండటంతో ఆధునిక ప్రపంచంలో కూడా అంతులేని దుఃఖాన్ని అనుభవిస్తున్నారు. అంతిమంగా మానవ నాగరికత ఎంత అభివృద్ధి చెందిన బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి అనేటి సూత్రాలఅమలుతో మానవాళి జీవనం విధానం కొనసాగినప్పుడే మానవాళి మనుగడకు శ్రేయస్కరం. ఈ విషయాన్ని మేధావులు విద్యావంతులు, సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

పుల్లెంల గణేష్, 9553041549

## పశ్చిమాసియా యుద్ధంతో

# వలస కార్మికులకు మళ్ళీ కష్టాలు



కృష్ణ ఝా

యుద్ధం అనేది పరిణామం యొక్క ప్రతికూల ఫలితం. గల్ఫ్ యుద్ధం దీనిని మరోసారి నిరూపించింది. ఇంధనం, ముడి పదార్థాల లభ్యత తగ్గడంతో ఏర్పడిన సంక్షోభం కారణంగా ఉత్పత్తి తీవ్రంగా పడిపోయింది. ఈ సంక్షోభం కొనసాగితే, గల్ఫ్ ఇంధనం సులభంగా లభిస్తుందనే భావన ఒక కలగానే మిగిలిపోవచ్చు.

ఫ్యాక్టరీలు మూతపడటం పెరగడంతో, నిరుద్యోగ సమస్య మళ్లీ తలెత్తింది. పశ్చిమ ఆసియా యుద్ధాన్ని ఇరుపక్షాలు తమకు అనుకూలంగా మలచుకున్నాయి. ఆర్థిక రంగంలో, పరిశ్రమలు మూతపడుతుండటంతో ఉత్పత్తి కనిష్ట స్థాయికి పడిపోయింది. ధరల పెరుగుదల ఈ నిరాశాజనక పరిస్థితిని మరింత పెంచుతూ, జీవితాన్ని దుర్భరం చేస్తోంది.

పరిస్థితి అత్యంత విషమంగా మారిన వస్త్ర పరిశ్రమ ఇందుకు ఒక ఉదాహరణ. ఈ సంక్షోభం ప్రధాన ఉత్పత్తిదారులను సైతం కబళిస్తోంది. ఉదాహరణకు పెట్రో–కెమికల్ పరిశ్రమలో ముడి చమురు, సహజ వాయువుల శుద్ధి నుండి ఉప ఉత్పత్తిగా లభించే పెల్లెట్లను పాలిస్టర్ వంటి నిర్దిష్ట ఫైబర్ తయారీలో ఉపయోగిస్తారు. ఈ ప్రాథమిక ముడి పదార్థాల లభ్యత తగ్గడం వల్ల భారీస్థాయిలో ఉత్పత్తి తగ్గిపోయి, నిరంతరాయంగా కొనసాగడంలో అంతరాలు ఏర్పడ్డాయి.

ఇంధన రంగం ప్రపంచీకరణ చెందుతున్నప్పుడు సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందని అంచనా వేస్తున్నారు, కానీ ప్రపంచీకరణ ప్రతికూల సంబంధిత చర్యలు స్పష్టమవుతుండటంతో, ప్రపంచీకరణ దీర్ఘకాలం నిలుస్తుందనే ఆశలు చెదిరిపోవడం ప్రారంభించాయి.

సంఘర్షణతో ప్రభావితమైన ఇరుకైన, కీలకమైన నౌకా రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిని ఎప్పుడైనా మూసివేస్తారని ఊహల్లో కూడా భావించలేదు. హోర్ముజ్ జలసంధిలోని ఈ కీలక ప్రదేశంలో భారత జెండాతో నౌక కదలడం చాలా అరుదుగా కనిపిస్తుంది. 'దేశీయంగా ఉత్పత్తి అయ్యే ప్రతి చుక్క చమురు, గ్యాస్, బొగ్గును మనం పరిరక్షించుకోవాలి..' అని ముడి చమురు, సహజ వాయువులను అత్యధికంగా ఉత్పత్తి చేసే ఒఎన్‌జిసి అధిపతి అన్నారు. చివరి తమ ఇళ్లను వదిలి వచ్చిన కార్మికుల కొరత కు లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) సిలిండర్ల సరఫరాలో సంక్షోభానికి కారణమవుతోంది.

వంటగ్యాస్ సరఫరా ఇతర సమస్యలను కూడా ఎదుర్కొంటోంది. మధ్యప్రాచ్య యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్త రవాణాకు అంతరాయం కలగడంతో భారతదేశంలో వంటగ్యాస్ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దేశంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే వంట ఇంధనమైన ఎల్‌పిజి సిలిండర్లను పొందడంలో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

భారతదేశం ఎల్‌పిజి దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది, వీటిలో అధిక భాగం హోర్ముజ్ జలసంధి ద్వారా దేశానికి చేరుతుంది. ఇరాన్ ఇప్పుడు భారతీయ నౌకలను వెళ్ళడానికి అనుమతిస్తున్నప్పటికీ, పరిస్థితి ఇంకా అనిశ్చితంగానే ఉంది. అనేక నౌకలు జలసంధి గుండా వెళ్ళడానికి సమీపంలో వేచి ఉన్నాయి. ఎల్‌జిపి కొరత లేదు, అది దేశీయ ఉత్పత్తిని పెంచుతోందని, అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా వంటి దేశాల నుండి మరింత సరఫరాను పొందుతోందని ప్రభుత్వం చెబుతోంది. గ్యాస్ సిలిండర్ల కోసం 'ఆందోళనతో ఆర్డర్లు' చేయడం ఆపమని కూడా ప్రజలను కోరింది.

కానీ పెద్ద నగరాల్లోని వలస కార్మికులు, వీరిలో చాలామంది వంట గ్యాస్ కొనడానికి అనధికారిక నెట్‌వర్క్‌లపై ఆధారపడి ఉంటారు. వారు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఏదీ చెప్పుకున్నప్పటికీ, ఎల్‌పిజి అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఎందుకంటే మొత్తం వినియోగంలో 88 శాతం దిగుమతులే. అందులో సుమారు 40 శాతం హోర్ముజ్ జలసంధి గుండా వెళ్ళే రవాణా ద్వారానే తీరుతోంది.



కొత్త సంక్షోభం కారణంగా వలస కార్మికుల సంఖ్య తగ్గడంతో, ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింది. ఈ కార్మికులు ఎక్కువగా బిహార్‌కు చెందిన వారే అయినప్పటికీ, వీరిలో గణనీయమైన సంఖ్యలో బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ నుండి కూడా ఉన్నారు. వీరు స్థానిక కార్మికుల స్థానంలో తక్కువ వేతనానికి పనిచేస్తూ, శ్రమ మిగులును సృష్టిస్తున్నారు. వీరు కాలానుగుణంగా లభించే ఉద్యోగాలను బట్టి ఒక చోట స్థిరంగా ఉండలేని జనాభాలో భాగం. వీరికి సాధారణంగా కార్మికులుగా తమ హక్కుల గురించి తెలియదు. వారికి అందించే వేతనం ఎంతైనా, పని పరిస్థితులనైనా అంగీకరిస్తారు.

ఈ యుద్ధం ముఖ్యంగా అసంఘటిత కార్మికులపై తనదైన ప్రభావాలను చూపుతోంది. వారు సంపాదించడానికి వచ్చి తిరిగి వెళ్ళిపోతారు. తమ కుటుంబాలతో అనుబంధం ఉండటం వల్ల, సాధారణంగా వారు డబ్బు పంపడానికి ఆసక్తి చూపుతారు. కానీ ఉపాధి కోల్పోవడం వల్ల, వారు ఇక్కడే ఉండటానికి గల హేతుబద్ధమైన కారణం లేకుండా పోతుంది. ఈ యుద్ధం రెండు వైపులా పదునున్న కత్తిలాంటి ప్రభావాన్ని కలిగి ఉంది. పెరుగుతున్న ముడిసరుకుల ధరలు ఉత్పత్తితో పాటు డిమాండ్‌ను కూడా దెబ్బతీయగా, ఎల్‌పిజి సంక్షోభం సుమారు 40 శాతం వలస కార్మికులను తమ ఇళ్లకు తిరిగి వెళ్ళేలా చేసింది. వాస్తవానికి, కోవిడ్–19తో పోలిస్తే పరిస్థితి మరింత విషాదకరంగా ఉంది. ఎందుకంటే, ప్రజల జీవనోపాధిని లాగేసుకుంటున్నారు. ముఖ్యంగా నగరానికి వెన్నెముకగా ఉన్న వారిని వలస వెళ్ళేలా బలవంతం చేస్తున్నారు.

తమ సొంత రాష్ట్రాల్లోకి తిరిగి వచ్చిన ఈ వలసకార్మికులు, చౌక శ్రమ కోసం చూస్తున్న స్థానిక పారిశ్రామిక, వ్యాపార సంస్థల బారిన పడుతున్నారు. వలస కార్మికులను నియమించుకోవడం వల్ల, ఇక్కడే ఉండిపోయిన వారిని నియమించుకున్నప్పుడు యజమానులు ఎదుర్కొనే అనేక బాధ్యతల నుండి వారికి విముక్తి లభిస్తుంది. వలస కార్మికుల నివాసం సాధారణంగా తాత్కాలికం కాబట్టి, యజమానులకు వారి పట్ల ఎటువంటి బాధ్యత ఉండదు. శ్రమ స్వభావమే తాత్కాలికం కాబట్టి, ఉద్యోగ దశలో గానీ లేదా పదవీ విరమణ దశలో గానీ శ్రామిక శక్తి పునరుత్పత్తికి యజమానులు ఏర్పాట్లు చేయాల్సిన అవసరం లేదు.

ఇదిలా ఉండగా, ఆశాకిరణంలా మినుకుమినుకుమనే వెలుగుగా కనిపించిన ఆ సొరంగం చివర వెలుగు మళ్లీ మసకబారింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా, ఇరాన్‌ల మధ్య జరిగిన అత్యున్నత స్థాయి చర్చలు విఫలమవ్వడంతో, ప్రపంచం మరోసారి ఈ సంక్షోభానికి ముఖాముఖిగా నిలబడింది. చర్చలు విఫలమవడంతో ప్రతిష్టంభన మళ్లీ మొదలైంది. ఏప్రిల్ 22న కాల్పుల విరమణ గడువు ముగిసిన తర్వాత ఏమి జరుగుతుందో అమెరికా గానీ, ఇరాన్ గానీ సూచించడం లేదు.

ఈ అనిశ్చితి మధ్య, చర్చలు విఫలమైన అనంతరం, హోర్ముజ్ జలసంధిలోకి నౌకలు ప్రవేశించకుండా లేదా బయటకు వెళ్లకుండా నిరోధించడానికి అమెరికా నౌకాదళం దిగ్బంధనాన్ని ప్రారంభిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ హెచ్చరించారు. గల్ఫ్ యుద్ధం ప్రారంభమయ్యేంత వరకు ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతాన్ని రవాణా చేసిన ఈ జల మార్గంపై, అమెరికా వ్యూహాత్మక నియంత్రణ సాధించడానికి ప్రయత్నించడం ఇదే మొదటిసారి.

ఈ పరిణామం భారతదేశానికి, అలాగే ప్రపంచంలోని మిగిలిన దేశాలకు శుభసూచకం కాదు.

# మే డే స్ఫూర్తి... సింగరేణి కార్మికుల చైతన్య దీప్తి

ప్రపంచవ్యాప్తంగా మే 1ను జరుపుకునే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం కేవలం భారతదేశంలోనే కాకుండ ప్రపంచంలోని అన్ని దేశాల కార్మికులు జరుపుకుంటారు. ఇది కార్మికుల రక్తం, చెమట, పోరాటాలతో సాధించిన హక్కుల చిహ్నం. 1886 మే 1న అమెరికాలోని షికాగో నగరంలో హే మార్కెట్ వద్ద వెట్టి చాకిరీకి నిరసనగా అధిక పనిగంటలకు వ్యతిరేకంగా 8గంటల పనివిధానం కొరకు నిరసన కార్యక్రమం కోసం కార్మికులు సమావేశం జరుపుకున్నారు. ఈ సమావేశాన్ని చెదరకొట్టడానికై పోలీసుల కాల్పు ల్లో 4 గురు కార్మికులు మరణించారు. చాలామంది గాయపడగా రక్తం ఏరులైపారింది. ఆ రక్తంలో తడిసిన చొక్కాలను పైకి ఎత్తి 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని నినదించిన రోజు. ఇటువంటి సంఘటనలు కార్మికుల జీవన గాథలో ఒక మలుపు తీసుకువచ్చాయి. రోజుకు 8 గంటల పని సమయం కోసం జరిగిన ఆ పోరాటం ప్రపంచ కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచింది.

భారతదేశంలో కూడా మే డే ఒక గొప్ప చరిత్రను కలిగి ఉంది. 1923 మే 1న లో చెన్నైలో సింగరవేలు చెట్టియార్ ప్రారంభించిన ఈ దినోత్సవం, కార్మికుల ఐక్యతకు ప్రతీకగా మారింది. అప్పటి నుంచి కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉంది. సింగరేణి బొగ్గు గనులలో వెట్టి చాకిరీకి నిరసనగా, గాలి, నీరు, ఇంటి వసతుల గురించి తదితర కనీస సౌకర్యాల కోసం డి.శేషగిరి చేసిన పోరాటం నేటికి స్ఫూర్తి దాయకం. 1942 సంవత్సరంలో సింగరేణి కార్మికుల సమస్యలపై మనుబోతుల కొమురయ్య ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)స్థాపించబడింది. ఆనాడు నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో కె.ఎల్. మహేంద్ర, బి.విఠల్ రావు లాంటి ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బోనస్ సాధించిన ఘనత సింగరేణి కార్మికులదే, వేజ్ బోర్డ్ సాధన, లాభాల వాటా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాడిన సింగరేణి కార్మికులు దేశానికే ఆదర్శవంతులు. సమ్మెలు, పోరాటాలు చేసి సాధించుకున్న పెన్షన్ ఫండ్ ప్రభుత్వాల సహకారం అందించకపోవడంతో భవిష్యత్తులో పెన్షన్ ఫండ్ ప్రశ్నగా మిగిలుతుందోమోనని ఆందోళన చెందుతున్నారు కరువు భత్యంతో కూడిన పెన్షన్ లేకపోవడంతో రాను రాను విశ్రాంత కార్మికుల జీవనం దిగజరుతుంది. పెరిగిన జీవన వ్యయం, వైద్య ఖర్చులు భరించలేక తల్లడిల్లుతున్నారు.. ప్రకృతి విరుద్ధంగా ఊపిరి ఆడని, గాలి, వెలుతురు లేని స్థితి లో విషవాయువులు ప్రసరిస్తున్నను పనిచేసి దేశానికి వెలుగు నిచ్చిన సింగరేణి కార్మికులు త్యాగధనులు. అయితే, నేటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, టెక్నాలజీ విప్లవం కార్మికరంగాన్ని కొత్త దిశ లో



నడిపిస్తున్నాయి. స్థిర ఉద్యోగాలు తగ్గిపోతూ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గిపోవడం, ఎక్కువ పనిగంటలు, తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లోపం వంటి సమస్యలు కార్మికుల జీవితాలను సంక్లిష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్స్ ఒక కీలక మలుపు. పాత 29 కార్మిక చట్టాలను కలిపి రూపొందించిన ఈ నాలుగు కోడ్స్ — వేతన కోడ్ పరిశ్రమ సంబంధాల కోడ్ సామాజిక భద్రత కోడ్ వృత్తి భద్రత కోడ్ — కార్మిక రంగాన్ని సరళీకృతం చేయాలనే లక్ష్యంతో తీసుకొచ్చారు. కాగితాలపై చూస్తే ఇవి సంస్కరణలుగా కనిపిస్తున్నాయి. పరిశ్రమ సంబంధాల కోడ్ ప్రకారం కంపెనీలకు ఉద్యోగులను తొలగించే స్వేచ్ఛ పెరగ డం, సమ్మెలపై కఠిన నియంత్రణలు విధించడం కార్మిక హక్కులకు ముప్పుగా భావిస్తున్నారు. సమ్మె చేయడానికి ముందుగా అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి, కార్మికుల స్వరాన్ని బలహీనపరుస్తోంది. అలాగే, వృత్తి భద్రత కోడ్ అమలు విషయంలో స్పష్టత లేకపోవడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కార్మికుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే – కార్మిక చట్టాలు కేవలం యాజమాన్యాల సౌలభ్యం కల్పించడానికే కాకుండా, కార్మికుల గౌరవప్రద జీవనానికి హామీ ఇవ్వాలి. అభివృద్ధి అనే పేరుతో కార్మిక హక్కులను బలహీనపరిస్తే, అది సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది. మే డే మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది: హక్కులు ఎప్పుడూ ఇచ్చేది కాదు, సాధించేది. నేటి నూతన లేబర్ కోడ్స్ నేపథ్యంలో, కార్మిక సంఘాలు మరింత అప్రమత్తంగా ఉండాలి. అదే సమయంలో ప్రభుత్వం కూడా అభివృద్ధి, కార్మిక సంక్షేమం మధ్య సమతుల్యతను పాటించాలి. సింగరేణిలో నూతన భూగర్భ గనులు రాక పోవడం, నూతన ఉద్యోగాల కల్పన తగ్గిపోవడం, మెడికల్ బోర్డ్ నిర్వహించక, వారసత్వ ఉద్యోగాలకు తిలోదకాలు పలికే దిశలో యాజమాన్యం ఆలోచించడం చూస్తే సింగరేణి కార్మికులు అంధకారంలో నెట్టివేయబడుతున్నారు. రిటైర్డ్ కార్మికులకు కనీస అవసరాలు తీర్చే పెన్షన్, మెరుగైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రిటైర్డ్ కార్మికుల అవసాన దశలో వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించే బాధ్యత ప్రభుత్వాలు, యాజమాన్యాలదే. చివరగా, దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం అయిన కార్మికుడి గౌరవం కాపాడబడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. మే డే స్ఫూర్తి మనకు ఇదే నేర్పుతుంది.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752,

## శ్రమైక జీవనం



పసిపాప పాఠశాలకు బదులు
ఇటుక బట్టీల వైపు నడిచింది.
చిన్ని చేతులపై యంత్రాల నీడ,
పగబట్టిన త్రాచులా వెంటాడింది!

ఎంగిలి అంట్లతో నాట్యం చేసిన
చిన్నారి చేతులు, రాతల బదులు
రాళ్లు మోస్తున్నాయి.
ఆ చిన్ని గుండె ఎప్పుడో గాయపడింది!
మా అడుగుల ప్రతి సవ్వడిలో
ధూళి ఈల పాట పాడింది.
అంధకారంలో వెలిగే దీపం
శ్రామికుడి శ్వాసను ఆశగా మార్చింది!

గుండెల్లో ఎగసిన దుఃఖం
చరిత్రగా మిగిలిపోయింది.
సొంత జీవితం మరిపించి
పరులకై జీవించడం నేర్పింది!
చిందిన మా స్వేద బిందువుల శ్రమను
గుర్తించేవారెవరు?
నవ్వులు పంచే వేడుకల వెనుక
ఆవేదనను అర్థం చేసుకునేదెవరు?
'మేడే'లు వస్తున్నాయి, పోతున్నాయి,
మెరుగైన జీవితాలకు
హామీ ఇస్తున్నాయి.

పరిష్కారాల దిశగా,
పరివర్తనే లక్ష్యంగా...
సమసమాజ స్థాపన సిద్ధించేదాకా
ఎత్తిన పతాక దించకు.
చెమటే నీ పౌరుషం,
మేడే... నీ సంస్కృతి!!

ఎండి.ఉస్మాన్ ఖాన్, 9912580645

## శ్రామిక శక్తి

వస్తువుల ఉత్పత్తికై కాలంతో పోటీ
భౌతిక కష్టం, మానసిక సంఘర్షణలతో
శ్రామికుల జీవనం ప్రజా అవసరాలకై
కర్మాగారాలలో నలుగుతూ మిషన్ లతో
స్నేహం చేస్తున్న కార్మిక సోదరులు...

శ్రామికుల హక్కులకై పోరాడుతున్న
కార్మిక సంఘాలు, యూనియన్లు
పెట్టుబడి వర్గం నుండి కార్మికులకు
రావాల్సిన బోనస్‌లకై పోరాటం...

పారిశ్రామికవాడలో కార్మికులు
దుర్భరమైన జీవనం సాగిస్తూ
స్వంతింటికై తాపత్రయ పడుతూ
పాలకుల హామీలు నీటి బుడగలులా
అభివృద్ధికి ఆమడ దూరంలో కార్మికులు...

పరిశ్రమలలో కార్మికుల బ్రతుకులు
రెక్కాడితే డొక్కాడని కుటుంబాలు ఎన్నో
శ్రామికుల ఆర్థిక స్థితిగతులు కడు
పేదరికానికి అద్దం పడుతున్నాయి...
శ్రామికుల దీర్ఘకాలిక సంక్షేమానికై
ప్రణాళికలు రూపొందించాలి ప్రభుత్వాలు...

కారల్ మార్క్స్, ఏంగెల్స్ ఆశయాలకై
కలిసికట్టుగా ఏకమై పోరాడుదాం
కార్మికుల హక్కులను సాధించుకుందాం.

మిద్దె సురేష్,
9701209355

# నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరాపై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసిలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు, అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు డిప్యూటీ సిఎంకు హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్‌కో సిఎండి హరీష్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సదుపాయాల కల్పనకు ప్రణాళికలు

దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ

నేటి నుంచి జిల్లాల్లో అక్రిడిటేషన్ల పంపిణీకి కలెక్టర్లకు ఆదేశం

రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పాత్రికేయులకు వైద్య సదుపాయంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ పూర్తై సంఖ్య తేలిన అనంతరం జర్నలిస్టులకు వైద్యం, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చని, ఈ దిశగా ఇప్పటికే సిఎం రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియ కొనసాగుతున్నదని, జర్నలిస్టుల సూచనల మేరకు జిఒలలో మార్పులు, చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో హిమయత్‌నగర్‌లోని రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ కార్యాయలంలో గురువారం జర్నలిస్టులకు 2026–28 సంవత్సరాలకు కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని, త్వరలో పాత్రికేయుల సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు.



గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన కొనసాగిందని, అందువల్లే కార్డుల జారీలో ఆలస్యం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందని, తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చే విధంగా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించినట్లు వివరించారు. జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరంలేదని మంత్రి స్పష్టం చేశారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి వెల్లడించారు.

జనగణలో బిసిల కాలం లేకపోవడంపై

# రాష్ట్ర బిసి కమిషన్ అభ్యంతరం

రాష్ట్ర జనగణన డెరెక్టర్ భారతి హోళీకేరికి

బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఏప్రిల్ 26న ప్రారంభమైన మొదటి విడత జనాభా లెక్కల సేకరణలో బిసి జనాభా సేకరణను విస్మరించడం బిసిలను నిరుత్సాహపరిచిందని బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ గురువారం తెలంగాణ రాష్ట్ర జనగణన డెరెక్టర్ భారతి హోళీకేరికి రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రాజకీయ వ్యవహారాల కెబినేట్ సబ్ కమిటి 30 ఏప్రిల్ , 2025న జరిగిన సమావేశంలో 2027 జనగణనలో బిసిల కుల డాటా సేకరించడానికి నిర్ణయం చేసిందని నిరంజన్ తెలిపారు. కాగా, ఈ అంశంతో వివరణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం 2వ విడత జనాభా సేకరణలో బిసి వివరాలను సేకరిస్తుందని భారతి హోళీకేరి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బిసి కులాల జాబితాను డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్‌కు పంపిస్తూ ఆయా కులాల వారి వివరాలను ఏవిధంగా 2వ విడత జాబితాలో నమోదు చేస్తారో స్పష్టంగా వివరించాలని బిసి కమిషన్ కోరడం జరిగిందని, ఈ విషయమై సవివరమైన వివరణను త్వరలో ఇవ్వాల్సిందిగా డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్‌ను కోరడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

# సాంఘిక సంక్షేమ గురుకులాల విజయ దుందుభి

40 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా

99.22 శాతం పాస్ పర్సంటేజ్

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు 2026 పదవ తరగతి ఫలితాల్లో 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మొత్తం 17,071 మంది పరీక్షలకు హాజరుకాగా 16,921 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ ఫలితాలు సాధించడం గురుకులాల విద్యా ప్రమాణాలను మరింత బలపరిచిందన్నారు. డిఎస్ఎస్ భవన్‌లోని టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు మొత్తం 235 ఇనిస్టిట్యూషన్లలో 163 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత, 9 జిల్లాల్లోని అన్ని గురుకులాల్లో 100 శాతం ఫలితాలు సాధించడంతో పాటు ఇంటర్, జెఇఇ, ఐఐటి, నీట్ వంటి పరీక్షల్లో సైతం మెరుగైన ఫలితాలు సాధించారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గురుకులాలను నూతన దిశగా తీసుకెళ్తున్నామని వెల్లడించారు. ప్రతిపక్షాల విమర్శలు ఉన్నప్పటికీ సాంఘిక గిరిజన, సంక్షేమ గురుకులాలపై తల్లిదండ్రుల నమ్మకం మరింత పెరిగిందని, ఈ ఏడాది అడ్మిషన్లు రికార్డు స్థాయిలో పెరగడం ఇందుకు నిదర్శనమన్నారు. గురుకులాలను దేశంలోనే ఉత్తమ విద్యా నమూనాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం, పేద పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తూ గ్లోబల్ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, గిరిజన శాఖ డైరెక్టర్, ఇంచార్జ్ కమిషనర్ సంతోష్, వై.జె.విజయ్ కుమార్, బానోతు గీత, సక్కు నాయక్, సర్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## టెట్ పోటీ పరీక్షకు టి-సాట్ స్పెషల్ లైవ్

టిసాట్ సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలలో నిర్వహించబోయే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పై అవగాహన కల్పించేందుకు టిసాట్ నెట్‌వర్క్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం(టి.సాట్‌సాఫ్ట్ నెట్)ద్వారా ఏర్పాటు చేసినట్లు సిఇఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల ఒకటవ తేది శుక్రవారం ఉదయం 11 గంటలకు మ్యాథమెటిక్స్, ఎన్విరాన్ మెంటల్ స్టడీస్, చైల్డ్ డెవెలప్ మెంట్ అండ్ పెడగాజి, సోషల్ స్టడీస్ వంటి నాలుగు సబ్జెక్టులపై అనుభవం కలిగిన ఉపన్యాసకులచే స్పెషల్ లైవ్ ఏర్పాటు చేశామని, టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు లైవ్ కార్యక్రమం ద్వారా తమ సందేహాలు తీర్చుకుని సమాధానాలు పొందవచ్చన్నారు.

ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి..

# 2న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ధాన్యంకొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ నెల 2వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రకటించారు. వరి కోతలు ఊపందుకున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో రైతుల నుంచి 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ఆ దిశగా కొనుగోళ్ళు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గడిచిన 15 రోజుల్లో కేవలం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ స్వయంగా ప్రకటించడం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏవిధంగా కొనసాగుతుందో స్పష్టమవుతుందన్నారు. మే నెలకూడా మొదలు కాగా ఈ నెల రోజుల కాలంలో మిగిలిన 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఏలా సేకరిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని వారు డిమాండ్ చేశారు.

**మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలి:**
మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు రూ.4 వేల కోట్లు బ్యాంకు నుండి రుణం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామమని బాగం హేమంతరావు, పశ్య పద్మ అన్నారు. అయితే సగటున ఎకరాకు 40 నుంచి 45 క్వింటాల్ దిగుమతి రాగా ఇందులో కేవలం 26 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు.
రైతు పండించిన మొక్కజొన్న పంటను మద్దతు ధర క్వింటాకు రూ.2400 ప్రకారం పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అధిక విషపూరిత పురుగుమందులను

# ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో విక్రయించొద్దు

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ,

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన మానవ ఆరోగ్యానికి హానికరమైన, అధిక విషపూరిత పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో విక్రయించరాదని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి ఆదేశించారు. బిఆర్‌కెఆర్ భవన్‌లో వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో గురువారం ఆన్‌లైన్‌లో ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులతో సమావేశం జరిగింది. సమావేశంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ విక్రయాలు రైతులకు సౌలభ్యంగా ఉన్నప్పటికీ, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ, అమెజాన్ వంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అమెజాన్ ప్రతినిధులు స్పందిస్తూ, వ్యవసాయ కమిషన్ సూచనలను పూర్తిగా పాటిస్తామని, రైతుల క్షేమమే తమ ప్రాధాన్యత అని తెలిపారు. నిషేధిత పురుగు మందులను వెంటనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నుండి తొలగిస్తామని వెల్లడించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, భూమి సునీల్, మరికంటి భవాని, వ్యవసాయ శాఖ అధికారులు జెడిఎ బాలు, ఎఒ శైలజ, వ్యవసాయ కమిషన్ అధికారులు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కె.కేశవులు, ఎడిఎ సంధ్యారాణి, హెచ్ఒ స్రవంతి, ఎఇఒలు రజిత, శ్రావణి, శ్రావ్య పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టాలి

నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వానాకాలం (ఖరీఫ్ సీజన్) 2026 నేపథ్యంలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో గురువారం వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ సాగు సన్నాహకంలో భాగంగా సీజన్‌కు సంబంధించి విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా నుండి మండల స్థాయి వరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి, అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీపడకూడదని, సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాల తయారీ, విక్రయాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గతంలో సబ్ స్టాండర్డ్ విత్తనాలపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు తమ స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని, సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాల వల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని సూచించారు. వరి సన్నరకాల ఎంపికలో రైతులు, మిల్లర్లు, వినియోగదారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, అంతర్జాతీయ ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా లూస్ కాటన్ విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు లైసెన్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని మంత్రి పేర్కొన్నారు. కోమార్కెటింగ్ విధానంలో ఏ కంపెనీ విత్తనాన్ని, ఏ కంపెనీ, ఏ పేరుతో అమ్ముతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని, సీడ్ యాక్ట్‌లో ఉన్న కొన్ని లోపాలను కంపెనీలు అవకాశంగా మార్చుకుని రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే కోమార్కెటింగ్ పూర్తిగా రద్దుచేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు అధికారులు వానాకాలం 2026లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముందని, దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, పత్తి సాగుకు సంబంధించి సుమారు 52 లక్షల ఎకరాల సాగుకు కాను రైతులకు 104 లక్షల ప్యాకెట్లు అవసరం కాగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మట్టిసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. వానాకాలం 2026లో 1.95 లక్షల క్వింటాళ్ల పంపిణీకి రూ.134 కోట్లు వ్యయం చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి స్పందిస్తూ గత ఏడాది వినియోగంతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక నిల్వలు రైతులకు విశ్వాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమశాఖ అభివృద్ధి సలహాదారునిగా వి.హనుమంతరావు నియామకం

రాష్ట్ర మంత్రి సమాన హోదాతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి వి.హనుమంతరావు (విహెచ్)కు తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. బిసి వర్గాల గళంగా గుర్తింపు పొందిన హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ సలహాదారునిగా నియమించింది. రాష్ట్ర మంత్రి హోదాతో ఈ పదవిలో వి.హనుమంతరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా బిసి హక్కుల కోసం పోరాడుతున్న హనుమంతరావు అపారమైన అనుభవం, ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు దిశానిర్దేశం చేయడంలో కీలకం కానుంది. ముఖ్యంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలలో ఆయన సలహాలు ఇప్పుడు అధికారిక ముద్ర వేయనున్నాయి.

## కూనంనేనిపై కేసు కొట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన కూనంనేని సాంబశివరావు తన అనుచరుడు మహ్మద్ ఫరుద్దీన్ ద్వారా ప్రయత్నించారని కొత్తగూడెం 3వ టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసు విచారణకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని, రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతో నిబంధనలకు విరుద్ధంగా కేసు రిజిస్టర్ చేసి, కోర్టులో దాఖలు చేసిన ఫైనల్ రిపోర్టును రద్దు చేయాలని ముద్దాయిలు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు మహ్మద్ ఫరుద్దీన్, కూనంనేని సాంబశివరావుపై విచారణ జరిపేందుకు ఎలాంటి అర్హత లేదని చార్జిషీట్ అభియోగ పత్రాన్ని రద్దు చేస్తూ గురువారం తీర్పు వెలువరించింది. పిటిషనర్ కూనంనేని సాంబశివరావు, మహ్మద్ ఫరుద్దీన్ తరపున హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు వాదించారు.

# కవిత పార్టీకి కొత్త పేరు ‘తెలంగాణ రక్షణ సేన’

ఆ పేరుతో దరఖాస్తునకు ఇసి అనుమతి

నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ

ఆ తరువాతే పార్టీ పేరు ఖరారు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ‘తెలంగాణ రక్షణ సేన’ పేరుతో రాజకీయ పార్టీ నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుకు కల్వకుంట్ల కవితకు భారత ఎన్నికల సంఘం అనుమతించింది. రెండు జాతీయ, రెండు స్థానిక పత్రికల్లో పార్టీ పేరుపై అభ్యంతరాలు ఉంటే నెల రోజుల్లోగా తెలియజేయాలని కోరుతూ వరుసగా బహిరంగ ప్రకటన జారీ చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం కొనసాగుతున్న పార్టీలు లేదా ఇతరులు ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, వాటిపై నిర్ణయం తీసుకున్న తరువాతే పార్టీ పేరుపై తుది ఆమోదం లభిస్తుందని ఇసి స్పష్టం చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 28వ తేదీన కవితకు ఎన్నికల సంఘం అండర్ సెక్రెటరీ మనీశ్ కుమార్ రాశారు. కాగా, తొలుత ‘తెలంగాణ ప్రజా జాగృతి’ పేరుతో పార్టీ నమోదుకు కవిత దరఖాస్తు చేసుకున్నారు. అయితే, దానికి ప్రత్యామ్నాయంగా ఐదు పేర్లను పరిశీలించాలని కోరుతూ ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రజా జాగృతి అధ్యక్షురాలి హోదాలో కవిత ఏప్రిల్




23వ తేదీన ప్రతిపాదించారు. వాటిలో తెలంగాణ ప్రజా జాగృతితో పాటు, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి పేర్లు ఉన్నాయి. వాటిల్లో తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించింది. కాగా, ఈ నెల ఏప్రిల్ 25వ తేదీన కవిత మేడ్చెల్‌లో బహిరంగ సభను ఏర్పాటు చేసి, తమ పార్టీ పేరును ‘తెలంగాణ రాష్ట్ర సేన’ అని, టిఆర్ఎస్ అని ప్రకటించారు. అయితే, ఆ పేరు ఎన్నికల సంఘానికి పంపిన ఐదు పేర్లలో లేదు. తమ ప్రత్యర్థులను గందరగోళాన్ని గురిచేసేందుకే ఆ విధంగా ప్రకటించారని పరిశీలకులు భావిస్తున్నారు. ఎట్టకేలకు ‘తెలంగాణ రక్షణ సేన’, అది కూడా పొడి అక్షరాల్లో టిఆర్ఎస్ అని వచ్చే పేరుతో పార్టీ నమోదు కోసం దరఖాస్తు చేసుకునేందుక ఇసి అనుమతించింది. ఈ పేరుతో కొత్త దరఖాస్తును, పార్టీ నిబంధనావళిని ఎన్నికల సంఘానికి పంపాలని, అలాగే పత్రికల్లో ఇచ్చిన ప్రకటనను కూడా అందజేయాలని కవితకు రాసిన లేఖలో ఇసి సూచించింది.

**టిఆర్ఎస్ నాకు రాసి పెట్టుందేమో : కవిత**
‘టిఆర్ఎస్ నాకు రాసిపెట్టుందేమో’ అని కవిత హర్షం చేస్తూ ఎక్స్‌లో స్పందించారు. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం తాను చేసిన కృషిని కొనసాగిస్తానని తెలిపారు. తెలంగాణ అస్థిత్వ పరిరక్షణే తన పార్టీ ప్రధాన ధ్యేయమన్నారు. తెలంగాణ రక్షణ సేనకు ఎన్నికల సంఘం ఆమోదం లభించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


**పురపాలక సంఘ కార్యాలయము, జగిత్యాల, జిల్లా: జగిత్యాల**
NOTICE INVITING EXPRESSION OF INTERESET
File No. 1018/MCJ/F1/SWM/2026 Date: 29-04-2026
జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో చికెన్, మటన్ మరియు చేపల సెంటర్ల నుండి వెలువడే జీవవ్యర్థాల సేకరణ, సురక్షిత రవాణా మరియు శాస్త్రీయ నిర్వహణ కొరకు అనుభవం గల అర్హత కలిగిన ఏజెన్సీలు / ట్రాన్స్‌పోర్టర్ల నుండి EO లు ఆహ్వానించబడుచున్నవి. పనికాలం: 01-05-2026 నుండి 31-03-2029 వరకు జీవవ్యర్థాల శుద్ధీకరణ యూనిట్ స్వంతంగా కలిగి ఉండాలి లేదా చెల్లుబాటు అయ్యే Authorization / Tie-up ఉండాలి. రూ. 10,000/- డిమాండ్ డ్రాఫ్ట్ (Commissioner, Jagtial Municipality పేరిట) తో కూడిన దరఖాస్తులను తేది: 04-05-2026 సా. 5:00 గంటలలోపు జగిత్యాల పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం యందు సమర్పించవలెను. సంప్రదించవలసిన వారు: Commissioner - 9849905877
సం/- కమిషనర్, పురపాలక సంఘం, జగిత్యాల.
DIPR R.O. No. : 1711-PP/CL/ADVT/2026-27, Date: 30-04-2026

## రైతుకు ఎటువంటి ఇబ్బంది కలుగనీయం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతును అన్ని విధాలా ఆదుకుంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నరేందర్ రెడ్డి రైతులతో ముచ్చటించారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, గత ప్రభుత్వంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా రుణమాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ ఇలా అనేక రకాలుగా రైతులను ఆదుకోవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ సర్కారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రమేష్, కార్పోరేటర్లు గాదె రూప శ్రీనివాస్, మేకల వెంకటేష్, నాయకులు కాంరెడ్డి రాంరెడ్డి, బీరం ఆంజనేయులు, కపిల్ మాధవ్, శ్రీధర్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, సాయిని తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగుపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని ఎల్లాపూర్ రైతు వేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ స్వాతి, డాక్టర్ దీపిక రైతులతో ముఖాముఖి నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగు,యూరియా వాడకాన్ని తగ్గించడం,పంటల మార్పిడి ,ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. పురుగు మందులు,కలుపు నివారణలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పచ్చిరొట్ట పంటల సాగు అవసరమని, వరి కోసిన తర్వాత పంట అవశేషాలను కాల్చకుండా నేలలోనే కలియదున్నాలని శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు.అనంతరం మండల వ్యవసాయ అధికారి ఓ. శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న వివిధ రకాల సబ్సిడీ పథకాలను వివరించారు. ఆయిల్‌పామ్ పంట సాగు వల్ల కలిగే లాభాలను,ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అక్షయ్ కుమార్ తో పాటు గ్రామ సర్పంచులు రాచకొండ ఆనంద్, పులి రాజేశం, కాశ వేణి కుమార్,ఇస్లావత్ రమేష్ నాయక్,ఉపసర్పంచ్ అంజి,ప్రజాప్రతినిధులు, క్లస్టర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## నరసింహుడి సన్నిధిలో మంత్రి అడ్లూరి పూజలు



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారిని గురువారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.క్షేత్రంలో జరుగుతున్న నృసింహ నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి ప్రదానాలయం,అనుబంధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు మంత్రికి ఘనంగా ఆశీర్వచనం అందించారు.కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్,దేవస్థాన పాలకమండలి మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్ పాల్గొన్నారు.

## ప్రజల్లో న్యాయ అవగాహన పొందేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** ప్రజలకు న్యాయం పై అవగాహన పెంపొందించి, అందరికీ సులభంగా న్యాయం అందించాలనే లక్ష్యంతో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, డిఎల్ఎస్ఏ పి లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ అవగాహన ప్రతి పౌరుడికి అత్యవసరమని, చట్టాల గురించి తెలిసి ఉంటేనే వ్యక్తి తన హక్కులను రక్షించుకోగలడని తెలిపారు. సమాజంలో బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తమ హక్కులను వినియోగించుకునేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు తవుటు మధుసూధన్, గ్రామ సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఉప సర్పంచ్ జక్కుల నరేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా పోలీసు అధికారుల పదవీవిరమణ సన్మానం




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు విశేష సేవలందించిన ఏడుగురు పోలీసు అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై ఏ.సత్యనారాయణ, సిఎస్‌బి నుంచి ఎస్సై డి.శ్రీనివాస్, ఏఆర్ విభాగం నుంచి సర్దార్ భగవాన్ సింగ్, మానకొండూర్ పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్సై ఖాజా జమాలుద్దీన్, ఏఆర్ విభాగం నుంచి ఏఆర్ ఎస్సై పి.లక్ష్మయ్య, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్సై సిహెచ్ వెంకటరమణ, ఏఆర్ అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల రంగస్వామిలు పదవీ విరమణ పొందారు. కరీంనగర్ అడిషనల్ డిసిపి వెంకటరమణ హాజరై పదవీ విరమణ పొందిన అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్, కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఆర్ఎస్సై తిరుపతి తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో
# సర్కారు పూర్తిగా విఫలం



తక్షణమే మద్దతు ధరతో కొనుగోళ్లు జరపాలి* రైతు ప్రజాసంఘాల జెఏసి జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు

**ప్రజాపక్షం/మానకొండూర్:** ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు దాన్యపు విక్రయించుకునే సమయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని, కొనుగోలు కేంద్రాలకు కుప్పలు తెప్పలుగా దాన్యం వస్తున్నా ఇంకా ఎందుకు కొనుగోళ్లు మొదలు పెట్టడం లేదని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆరోపించారు. గురువారం మానకొండూర్ నియోజకవర్గం లోని శంకరపట్నం మండలంలోని తాడికల్, ఏరడపల్లి, ముత్తారం, మొలంగూరు, గద్దపాక, కాచాపూర్, మానకొండూర్ మండలంలోని శేంషాబాద్, గంగిపల్లి కొండపల్కల, మద్దికుంట రంగపేట గ్రామాల్లో రామారావు పర్యటించి రైతుల తో సమావేశం అయ్యి రైతుల దాన్యపు విక్రయాల్లో, ప్రభుత్వ దాన్యపు కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంబించి వారం రోజులవుతున్నా కొనుగోళ్లు మాత్రం జరపడం లేదన్నారు. దీంతో అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీసం వారికి టార్పాలీన్ షీట్ కవర్లు,గన్నీ బ్యాగులు సరఫరా చేయడం లేదని దీంతో ప్రైవేట్ దళారులకు రైతులు తక్కువ ధరకు దాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఇందుకు ప్రభుత్వ పెద్దలు ప్రైవేట్ వ్యక్తుల మధ్య కుదిరిన బేర సారాల లోపాయికారీ ఒప్పందమేనని ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. కొన్ని కొనొగోలు కేంద్రాల కొద్ది మొత్తం కొనుగోళ్లలో క్వింటాల్‌కు తాలు మట్టి లేని, ఆరబెట్టి ఎండిన సూకా దాన్యానికి తూకం సమయంలో ఐదు కిలోల దాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని, మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆయన మండి పడ్డారు. సేకరించిన దాన్యాన్ని హమాలీలు లేరని మిల్లుల వాళ్ళు దాన్యం బస్తాలను తీసుకోక నిరాకరిస్తున్నారన్నారు. ఇప్పటికే 60 శాతం దాన్యం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయిందన్నారు. అలాగే 500 రూపాయల బోనస్ డబ్బులు మద్దతు ధర ఎగొట్టేందుకు, కావాలనే ప్రైవేట్ వాళ్లకు లబ్ది చేసేందుకే ఆలస్యంగా దాన్యపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దాన్యపు కొనుగోళ్లు జరపడం లేదన్నారు.దీంతో రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికే రెండు సార్లు రైతు భరోసా నిధులను ఎగొట్టిన ప్రభుత్వం,సాగు సమయంలో ఇవ్వాల్సిన రైతు భరోసా నిధులను ఇప్పుడు పంటల కోత సమయంలో అర కొరగా విడతల వారీగా ఇవ్వడం దారుణమన్నారు.సన్న వడ్లకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ ను వెంటనే దాన్యపు డబ్బుల తో పాటే ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి తరుగు లేకుండా మద్దతు ధరతో తక్షణమే దాన్యపు కొనుగోళ్లను జరపాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. పొద్దు తిరుగుడు, శనగ, మొక్క జొన్న రైతులు కూడా పడి కాపులు కాస్తున్నారని వారి దాన్యాన్ని తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో క్కనుగోళ్లు జరపాలని లేకుంటే రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటం చేస్తామని పోలాడి పేర్కొన్నారు. రైతుల పంటలు, వరి కోతలు పూర్తి కాక పోవడం తో రైతులుకు రావడం ఇబ్బంది అవుతుందని భావించి వివిధ వర్గాలు విద్యార్థుల విన్నపం మేరకు రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ లో రైతుల మహాగర్జన సమర భేరి సభను మే 30 వ తేదీకి మార్చినట్లు పోలాడి రామారావు తెలిపారు. మే 30 న రెండు లక్షల మంది తో రైతుల మహాగర్జన సభను పార్టీల కతీతంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు ప్రజా సంఘాల నాయకులు చింతిరెడ్డి మధుకర్ రెడ్డి, సామంతుల రాజయ్య,బాకారపు రాములు శ్రీనివాస్ రెడ్డి, మేరుగు సంపత్ ఉన్నారు.


## తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల :** తెలంగాణ రాష్టానికి కాళేశ్వరం ప్రా జెక్టు వరప్రదాయాణీ అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి జీవన్ రెడ్డి పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి,జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ దావ వసంత, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ హరి చరణ్ రావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఉత్తర తెలంగాణే కాకుండా,యావత్ తెలంగాణ రాష్ట్రానికి ప్రాణ హిత జలాలు వినియోగంలోకి తీసుకురావాలని కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు.మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగి పోతేతక్షణమే మరమత్తు చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వంకెసిఆర్ ను దోషిగా చూపాలననే దురుద్దేశంతో నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచి ఏడాది గడుస్తున్నప్పటికి నివేదికను కోల్డ్ స్టోరేజ్ లో పెట్టారని మండిపడ్డారు.ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ల లో మేడిగడ్డ మరమ్మతు కు ఎందుకు చర్యలు చేపట్టలేదో రైతులకు రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.ఈ ఏడాది ఎల్నినో ప్రభావంతో కరువు వచ్చే అవకాశం ఉందన్నారు.రెండున్నరేళ్ల జాప్యానికి కారణం వెతికేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంకొత్త కుట్ర తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు.ఎమ్మెల్సి నియామకాలను అమిత్ షాతో ఉన్న సత్ సంబంధాలతో రేవంత్ రెడ్డి పూర్తి చేసుకున్నారన్నారు. ప్రజలు మార్పు కోరుతున్నారని పేర్కొన్నారు. నేను నా కుటుంబం ఆర్థికంగా బాగుపడితే చాలు.. తెలంగాణ ఏమైనా పర్వాలేదు అన్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు.మేడిగడ్డ మరమ్మతులపై శ్రద్ధ చేపడితే ఇప్పటికే పూర్తి అయ్యేదని వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ చేపట్టిన ఎల్ అండ్ టి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ మరమ్మతుకు అంగీకారం తెలిపిందన్నారు.రెండున్నరేళ్ల ప్రభుత్వ వైఫల్యం,తుమ్మడి హేట్టి బ్యారేజ్ నిర్మాణం జాప్యాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.జగిత్యాల లో కెసిఆర్ సభ కు జంకి రేవంత్ రెడ్డి మేడిగడ్డ వద్దకు వెళ్ళి, నిర్మాణాత్మకమైన చర్యల చేపట్టకుండా విమర్శలతోనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు.ఎల్ నినో ప్రభావం తెలంగాణ పై ప్రభావం చూపితే రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు.ఈ సమావేశంలో నాయకులు సాగర్ రావు, రాజేందర్,ప్రవీణ్ ఉన్నారు.

## 'టెన్త్' ఫలితాల్లో సత్తా చాటిన ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల




**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా అత్యధిక మార్కులు సాధించి సత్తాచాటారు. పాఠశాలలో ఉన్న 42 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా అందరూ ఉత్తీర్ణులై పాఠశాలకు 100 శాతం ఫలితాలు సాధించారు. ఇందులో తుషాలపురం రమ్య 571 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం నిలువగా, టి.రమ్య 569, టి.రక్షిత 568, పి హరిక 546 మార్కులు సాధించిన ధూల్మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను మండల విద్యాధికారి మీనాంజనేయులు, గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు మండల విద్యావేత్తలు అభినందించారు. ఉపాధ్యాయుల అంకిత భావం, విద్యార్థుల కృషితో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి తెలిపారు. వరుసగా ఈ పాఠశాలలోని విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో చక్కని ప్రతిభను కనబరిచి, పలువురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఎచ్ ఎం తెలిపారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలకు ధీ టుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల జిల్లాకే ఆదర్శ ంగా నిలవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డితో పాటుగా ఉపాధ్యాయులను విద్యా కమిటీ చైర్మన్ నాచగోని పావని లక్ష్మి, కమిటీ సభ్యులు కొండూరి ఉమాదేవి విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు మండల విద్యావేత్తలు అభినందించారు. రానున్న విద్యా సంవత్సరంలోను ఇలాగే విద్యార్థుల మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## బిఆర్ఎస్ నేతలూ..చిల్లర రాజకీయాలు కట్టిపెట్టండి

జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చేతల్లో చూపిస్తూ అటు నాలుగు శాఖల మంత్రిగా అందరికీ ప్రభుత్వ ఫలాలు అందిస్తూ రాష్ట్ర ప్రజలను మెప్పిస్తున్న సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఏకవచనంతో సంబోదిస్తూ,సోషల్ మీడియాలో హైలెట్ అయ్యేందుకు నోటికొచ్చినట్లు మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేయడం బిఆర్ఎస్ నాయకులకు తగదని,అనుక్షణం ధర్మపురి ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్న మంత్రిపై బురద జల్లే సంస్కృతి వెంటనే మానుకోవాలని జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్ హితవు పలికారు.ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దినేష్ మాట్లాడుతూ..బిఆర్ఎస్ నాయకుడు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి బుధవారం ప్రెస్ మీట్ పెట్టి గడిచిన రెండున్నర ఏళ్లలో ధర్మపురిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని,అనుచరగణం అరాచకాలు చేస్తున్నారని ఇలా నోటికొచ్చినట్లుగా మాట్లాడిన మాటల్ని దినేష్ తీవ్రంగా ఖండించారు.తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనలో ధర్మపురిలో అన్నివర్గాలను భయభ్రాంతులకు గురిచేసి విచ్చలవిడిగా అధికార దుర్వినియోగం చేసింది మీరుకాదాని దినేష్ ప్రశ్నించారు.ధర్మపురిని గొప్ప టెంపుల్ సిటీగా మార్చే మహత్తరమైన యజ్ఞానికి పూనుకుని చాగంటి లాంటి వారిచే ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తే సర్వత్రా హర్షం వెల్లువెత్తగా బిఆర్ఎస్ నాయకులు మాత్రం తప్పుపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి అడ్లూరి ఏ ఒక్కనాడు బెదిరింపులకు పాల్పడ్డలేదని అది ఆయన నైజం కాదన్నారు.ఇక అవినీతి గురించి బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లిచ్చినట్లు వుందని ధ్వజమెత్తారు.ప్రస్తుతం ధర్మపురి గోదావరి తీరం నిండు ఇసుకతో గోవా బీచ్ ను తలపిస్తూ ఆహ్లాదకరంగా వుందని, గోదావరి ఇసుక అక్రమ రవాణా జరుగకుండా ఆదేశాలిచ్చింది మా మంత్రియేనని దినేష్ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్ మాట్లాడుతూ ధర్మపురి ఎమ్మెల్యేగా 876 రోజులుగా కొనసాగుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ నిత్యం ప్రజలమధ్య ఉంటూ సమస్యల్ని దగ్గరుండి పరిష్కరిస్తూ వుంటే దీన్ని ఓర్వలేని బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికికోసం ప్రెస్ మీట్లు పెట్టడం,దాన్ని సామాజిక మాధ్యమాలలో పెట్టి సంతోషపడుతున్నారని ఎద్దేవాచేశారు.తమ నాయకుడుమంత్రి అడ్లూరి ఓడినా గెలిచినా ప్రజలమధ్యనే ఉన్నారని మరి మీ నాయకుడు ప్రజల్లోకి ఎందుకు రావడంలేదని ప్రశ్నించారు. ధర్మపురిలో కౌన్సిలర్ గా కూడా గెలవని శ్రీకాంత్ రెడ్డి మంత్రి అడ్లూరిని విమర్శించే స్థాయి తనదికాదని గుర్తించుకోవాలన్నారు.ఇకముందు ఎలాంటి ఆధారాలు లేకుండా మంత్రి ని విమర్శించినా,ఆరోపణలు చేసినా ఊరుకోమని రాజేష్ హెచ్చరించారు.నాయకులు చీపిరిశెట్టి రాజేష్,జక్కు రవీందర్, చిలుముల లక్ష్మణ్, ఇందారపు రామయ్య,సొల్ల నరేష్, నర్సింహులు, సుముఖ్, లక్ష్మణ్,సాయికిరణ్,తిరుపతి, శ్రీధర్,షబ్బీర్,సాగర్,రమేష్ పాల్గొన్నారు.

## పది ఫలితాలలో వాణినికేతన్ విజయదుందుభి




**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** బుధవారం ప్రకటించిన ఎస్ఎస్‌సి ఫలితాలలో వాణినికేతన్ పాఠశాల విజయదుందుభి మోగించింది. 70 మంది విధ్యార్థుల లో 17 మంది విద్యార్థులకు 550 పైన మార్కులు 46 మంది విధ్యార్థులకు 550 పైన మార్కులు వచ్చాయి. సాయి అయేషా విధ్యార్థినికి 583 అత్యధిక మార్కులు, జే సహస్రకు 576, రిషికేష్, అక్షయ్ కుమార్‌లకు 571 మార్కులు వచ్చాయని, 100 శాతం ఉత్తీర్ణతతో పాఠశాల నిలిచిందని, పాఠశాల డైరెక్టర్ రేణుక తెలిపారు. అనంతరం ఆమె ఉపాధ్యాయ బృందాన్ని విధ్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ వాణినికేతన్ పాఠశాల ఎల్లప్పుడూ అత్యున్నత ఫలితాలు సాధిస్తూ నాణ్యత విషయంలో సరైన శ్రద్ద తీసుకుంటుందని తెలిపారు. మొదటి నుంచి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లామని, ఈ విషయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఉందని తెలిపారు. పాఠశాల సలహాదారు నీలకంఠం ఉపాధ్యాయ బృందాన్ని, విధ్యార్థులను అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన విధ్యార్థిని అయెషా మాట్లాడుతూ భవిష్యత్తులో డాక్టర్ అవుతానని, ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయ బృందానికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలి

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** విద్యార్థుల భవిష్యత్‌తో నాయకులు చెలగాటం ఆడడం సరికాదని, తక్షణమే కేంద్రీయ విద్యాలయంకు స్థలం కేటాయించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.జగిత్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నవోదయ,కేంద్రియ విద్యాలయాలను మంజూరు చేసిందన్నారు. కోరుట్ల లో ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయం ఏర్పడి, ఏడాది కాలం పూర్తయ్యిందని గుర్తు చేశారు. కానీ జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో వాలంతరిలో స్థలం 10 ఎకరాలు కేటాయించడం ఎందుకు ఇబ్బంది అవుతుందో స్థానిక ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. అభివృద్ధికి చిహ్నంగా నిలి చే కేంద్రీయ విద్యాలయంకు స్థలం కేటాయించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని శ్రావణి ప్రశ్నించారు. నిజామాబాద్‌లోని కలికోటలో ఎప్పుడో స్థలం కేటాయింపు జరిగిందని, వనపర్తిలో స్థలం కేటాయింపు జరిగిన జగిత్యాలలో ఎందుకు స్థల కేటాయింపునకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు స మాధానం చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడికి మంత్రి తలొగ్గారా? లేదా మంత్రి జగిత్యాల విషయంలో జోక్యం చేసుకోవడం లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు విషయంలో నిర్లక్ష్యంపై జిల్లా మంత్రి తక్షణమే స్పందించాలన్నారు. జిల్లా అభివృద్ధి గురించి గాని, జిల్లా ప్రజల గురించి గానీ, జిల్లా విద్యార్థుల భవిష్యత్ పై మంత్రికి కనీసం బాధ్యత లేదా అని శ్రావణి ప్రశ్నించారు. కేంద్రియ విద్యాలయం స్థలం కేటాయింపు విషయం పై నాయకుల చిత్త శుద్ధి లోపమా? లేదా లోపాయికారి ఒప్పందమా అనేది అనుమానం కలుగుతుందన్నారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయింపు చేయాలనీ, ఏ పార్టీలో ఉన్నాడో తెలియని ఎమ్మెల్యేని, జిల్లా మంత్రిని, ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నామని, మే 15 లోపు స్థలం కేటాయింపు జరగకపోతే, మే 15 న జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట కేంద్రీయ విద్యాలయం కు స్థలం కేటాయించాలని నిజామాబాద్ పార్లమె ంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి గారు నిరాహార దీక్ష చేపడతారు. విద్యార్థుల భవిష్యత్‌కు భారతీయ జనతా పార్టీ ఎంత దూరం అయినా వెళ్తామని హెచ్చరించారు. కేంద్రీయ విద్యాలయం రావడం కేవలం విద్యార్థుల భవిష్యత్ కోసం మాత్రమే కాదని, ఈ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. కాబట్టే కేంద్రీయ విద్యాలయం ప్రాధాన్యత, విద్యార్థుల భవిష్యత్, ప్రాంత అభివృద్ధికై తప్పనిసరిగా నిరాహార దీక్ష చేస్తామని స్పష్టం చేశారు.జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు,జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,42వ వార్డ్ కౌన్సిలర్ మిమ్మల నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు,జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్,జిల్లా కార్యదర్శి పాత రమేష్,పూదరి శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, గట్టిపల్లి జ్ఞానేశ్వర్,పవన్ సింగ్,రవితేజ,గంగరాజం మరియు తదితరులు పాల్గొన్నారు.

## 3న ఎఐటియుసి నగర 3వ మహాసభలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి రామగుండం నగర సమావేశం జరిగింది. ఈ సమావేశం లో మే 3 న ఏన్ టీ పి సి లో జరిగే నగర ఎఐటియుసి 3వ మహాసభను జయప్రదం చేయాలనీ ఎఐటియుసి నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్‌లు కోరారు.ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం,ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ వైవి రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కే సునీల్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కా మ్రేడ్ గోసిక మోహన్ ,సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే కనకరాజు,సిపిఐ 41 డివిజన్ కార్పొరేటర్ కామ్రేడ్ మార్కాపూరి సూర్య హాజరవుతున్నారనీ ఈ మహాసభ లో మధ్యాహ్న భోజనం వర్కర్స్,ప్రభుత్వ ప్రాంతీయ హాస్పిటల్ కాంట్రాక్టు వ ర్కర్స్,ఎన్ టీ పి సి కాంట్రాక్టు వర్కర్స్, ఆశ వర్కర్స్, ఆర్‌టిసి వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఎఐటియుసి నగర అ ధ్య క్ష,ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం,శనిగరపు చంద్రశేఖర్‌లు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో షేక్ మసూద్ ఈదునూరి రమేష్, యా సర్ల తిరుమల శనిగరపుమతినా మూర్సాలీన్, పాకాల పాటి నాగమణిశేఖర్ ఉ షాకోయిల రసజ్ఞ శేఖర్ రెడపాక లక్ష్మిన్,నామ్ సాని శంకర్,వైనాలా రవి,ఓదెలరమేష్,పులియాలారాధా,దుబాసిస్వరూప,తదితరులుపాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

**ప్రజాపక్షం/వెల్దుర్తి:**మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ ఘాతంతో తీవ్రంగా గాయపడిన గార్ల పోచయ్య (61) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు కొన్ని రోజుల క్రితం తన సొంత వ్యవసాయ పొలం వద్ద బోరు మోటర్ కు విద్యుత్ సరఫరా రాక పోవడంతో దగ్గర్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల చేస్తుండగా విద్యుత్ ఘాతం తలిగి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మృతుడికి భార్య పోచమ్మ ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు పోచయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎంపిడిఒ కార్యాలయంలో ఎంసిపిసి సమావేశం



**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మండల కేంద్రమైన మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ కృష్ణమూర్తి,తహసీల్దార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎంసిపిసి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని గ్రామాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు, అక్రమ రవాణా, అక్రమ దత్తత,చిన్నపిల్లలపై అఘాయిత్యాలు, బాల కార్మికులు, బాలికల పట్ల వివక్షత, లైంగిక వేధింపులు వంటి సమస్యలు ఏర్పడితే ఏ విధంగా పరిష్కరించాలో అని ఎంసిపిసి కమిటీలో చర్చించాము అన్నారు. బాల, బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సంతోష, తూప్రాన్ ఎస్ఐ జ్యోతి, ఎంపిఒశ్రీనివాస్ రెడ్డి, ఐటిసి ఎన్‌జిఒ మల్లేశం, విసిపిసి చైర్మన్, స్థానిక సర్పంచ్ అనూష, విసిపిసి బాలల కమిటీ, బాలలు, మండల వైద్యాధికారి, మండల సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం : హేమాభార్గవి

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లా పరిపాలన, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రంథాలయం సమన్వయంతో యువతకు మార్గదర్శకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమం మే 1న ఉదయం 10 గంటలకు మెదక్ జిల్లా గ్రంథాలయంలో నిర్వహించనున్నాట్లు శిశు సంక్షేమ శాఖ అధికారి హేమాభార్గవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో పాటు ''సే నో టు డ్రగ్స్'' వారంలో భాగంగా చేపడుతున్నామని వివరించారు. యువతలో పెరుగుతున్న అయోమయాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ అవకాశాలు, నైపుణ్యాధారిత రంగాలపై స్పష్టత ఇవ్వడం లక్ష్యంగా కార్యక్రమం ఉంటుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ పాల్గొని నిపుణులు విలువైన సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమం సుమారు 2 గంటలపాటు కొనసాగుతుందన్నారు. జిల్లా యువత, విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## మహిళలు, బాలల భద్రతపై షీ టీమ్స్ అవగాహన



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ప్రజా పాలన – ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా మహిళలు, చిన్నపిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పి నీతిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్ నగర్ సబ్ డివిజన్ పరిధిలోని వేంపల్లి గ్రామంలో షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. షీ టీమ్ ఇన్‌చార్జి సునీత మహిళలు, విద్యార్థులకు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. కొత్త చట్టం భారతీయ న్యాయ సంహిత గురించి వివరిస్తూ మహిళల రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నియంత్రణపై స్పష్టతనిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడితే 1930, పిల్లల సహాయం కోసం 1098 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి విఓఏ ఇన్‌చార్జి అంగాల సతీష్, అంగన్వాడి సిబ్బంది వినోద, షీ టీమ్ సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమగ్ర చర్యలు



**ప్రజాపక్షం/పెద్దశంకరంపేట :** బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, భద్రతపై గ్రామస్థాయిలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికరి జగదీష్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బాలలపై జరుగుతున్న అన్యాయాలను వెంటనే గుర్తించి స్పందించే విధంగా వ్యవస్థలు బలోపేతం కావాలని సూచించారు. ఎంపిడిఒ క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు కావాలంటే సంబంధిత శాఖల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. ఎస్సై ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ బా ల్య వివాహాలు, బాల కార్మికత్వం వంటి సమస్యలను అరికట్టేందుకు పో లీస్ శాఖ అప్రమత్తంగా ఉందన్నారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పేట సర్పంచ్ జంగం రేణుక, అంగన్‌వాడి సూపర్వైజర్స్ పుష్పలత, శ్రీశైల, హెచ్ సిఓ యాదయ్య, ఐకెపి వివోలు హెల్త్ సూపర్వైజర్లు, ఆర్ఐ రమేష్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్‌రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం 123.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఆర్డిఓ శ్రీనివాసరావుతో కలిసి ధరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన ధరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెడ్డిపల్లి అంగన్వాడీ సెంటర్ తనిఖీ



**ప్రజాపక్షం/నర్సాపూర్:**మెదక్ జిల్లాలో అంగన్వాడీల పనితీరు ఆదర్శంగా ఉందనీ మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ అన్నారు. గురువారం నర్సాపూర్ మండల పరిధిలో ని రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్ ను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ తనిఖీ చేసి అంగన్వాడి సెంటర్ ను పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లీబిడ్డలకు సంపూర్ణ పోషకాహారం అందించాలని సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రం ఆవరణలో సేంద్రియ ఎరువులతో పండిస్తున్న కూరగాయల తోటను చూసి సంతోషం వ్యక్తం చేసి అంగన్వాడి టీచర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి సూపర్వైజర్ సరళ గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, అంగన్వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

## 10 వరకు స్వీయ గణన : కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:**జనాభా గణన 2027లో భాగంగా మే 10వ తేదీ వరకు ప్రజలు తమ ఇంటి వివరాలను స్వీయ గణన ద్వారా నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్‌డిఓ లోకేశ్వర్ రావుతో కలిసి ఆమె మాట్లాడారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరిస్తారని, అంతకంటే ముందే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు ఆన్‌లైన్ ద్వారా 33 అంశాలతో కూడిన వివరాలను ప్రజలే స్వయంగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. జిల్లాలో 994 మంది ఎన్యుమరేటర్లు, 174 మంది సూపర్వైజర్లను ఈ ప్రక్రియ కోసం కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంధన కొరత లేదని, పెట్రోల్, డీజిల్ సరఫరాపై వచ్చే పుకార్లను నమ్మవద్దని కోరారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనుగోలు చేయవద్దని, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు 34 కేంద్రాలు ఏర్పాటు చేశామని, క్వింటా సన్న రకానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఒ వాసుదేవ రెడ్డి, వ్యవసాయ అధికారి వెంకటి, డిపిఆర్ఒ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై అటవీ శాఖ ఉక్కుపాదం

### ఎఫ్‌డిఒ రామ్మోహన్



**ప్రజాపక్షం / జన్నారం:**జన్నారం అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం తెల్లవారుజామున జన్నారం ఎఫ్‌డిఓ రామ్మోహన్‌కు అందిన ముందస్తు సమాచారం మేరకు ఇందన్పల్లి సెక్షన్ పరిధిలో దాడులు నిర్వహించి ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ను పట్టుకున్నారు. గత నాలుగు రోజుల వ్యవధిలో మొత్తం నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం కూడా ఎఫ్‌డిఓ ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకి వచ్చే అటవీ ప్రాంతం నుండి ఇసుకను తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకతో పాటు కలప అక్రమ రవాణా చేసినా, వన్యప్రాణులను వేటాడినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలని, అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఓ లక్ష్మీ నారాయణ, ఎఫ్ఎస్ఓలు రవి, రాజేశ్వర్, ఎఫ్‌బిఓ శ్రీనివాస్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## భర్తను చంపిన భార్య అరెస్ట్




**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:**భర్త వేధింపులు తట్టుకోలేక భార్య హత్య చేసిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని లోహార గ్రామంలో చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ కె. ఫణిధర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఉట్నూర్ హరిజనవాడకు చెందిన సోలంకి గణపతి, మధురాబాయి దంపతులు ఊరూరా తిరుగుతూ కమ్మరి పని చేస్తూ జీవిస్తున్నారు. పది రోజుల క్రితం లోహార గ్రామానికి వచ్చి రోడ్డు పక్కన డేరా వేసుకుని నివసిస్తున్నారు. గణపతి మద్యానికి బానిసై తరుచూ భార్యను శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. వేధింపులు భరంచలేక మధరాబాయి తన భర్తను చంపాలని నిర్ణయించుకుంది. ఈ నెల 28న రాత్రి గణపతి నిద్రిస్తున్న సమయంలో ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితురాలు మధరాబాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట ఎస్సై వి. విష్ణువర్ధన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఫొటోలతో బెదిరించి యువతిపై అత్యాచారం



**ప్రజాపక్షం /జన్నారం:**జన్నారం మండల కేంద్రంలో ఓ యువతిని ఫొటోలతో బెదిరించి అత్యాచారానికి పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన బాధితురాలు వేసవి సెలవుల కోసం జన్నారం మండలంలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో కవ్వాల్ గ్రామానికి చెందిన డోంగరి లక్ష్మణ్ ఆ యువతితో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. బాధితురాలితో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని, కుటుంబ సభ్యులకు చూపిస్తానని బెదిరింపులకు దిగాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిపై బలవంతంగా అత్యాచారం చేశాడు. బాధితురాలు ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలపగా వారు పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జన్నారం ఎస్ఐ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేశారు. లక్షెటిపేట సిఐ రమణమూర్తి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

## యువత వేసవి సెలవుల్లో యోగా నేర్చుకోవాలి...

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:**యువత వేసవి సెలవులను వృదా చేసుకోకుండా యోగా నేర్చుకోవాలని, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. గురువారం నిజామాబాద్‌లోని హరిచరణ్ పాఠశాలలో బారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన,యోగా శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ధ్యానం, సూర్య నమస్కారం నిత్య జీవనంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పూజ్య స్వామి డాక్టర్ పరమార్థ దేవ్ యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సాయన్న, పతంజలి యోగా సమితి అధ్యక్షులు బుచ్చన్నా, ఇంజనీర్ గంగాధర్, యోగరత్న ప్రభాకర్, పతంజలి యోగ రాష్ట్ర అధ్యక్షుడు శివుడు, బారత్ స్వాబిమాన్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాల నుండే రాష్ట్రవ్యాప్తంగా మత్స్య విత్తనాలు సరఫరా

### మంచిర్యాలకు ఇంటర్‌నేషనల్ ఫిష్ పాండ్: కొక్కిరాల



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** దేశంలో మొట్టమొదటి ఇంటర్ నేషనల్ ఫిష్ పాండ్ మంచిర్యాల నియోజకవర్గంకే వచ్చిందని మంచిర్యాల శాసన సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. గురువారం రాత్రి మంచిర్యాల పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇంటర్‌నేషనల్ ఫిష్ పాండ్ మంచిర్యాలకు రావడం వల్ల మత్స్య సంపద అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని చేపల విత్తన ఉత్పత్తి కూడా ఇక్కడనే చేయడం జరుగుతుందని రాష్ట్రంలోని వివిధ చెరువులకు మత్స్య విత్తనాలను ఇక్కడి నుండే సరఫరా చేయడం జరుగుతుంధని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కూడా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. అలాగే దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని 70 కోట్ల రూపాయలతో రెండవ అన్నవరంగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే ఈ పనులు ప్రారంభించి పుష్కరాల కన్నా ముందుగానే పూర్తి చేస్తామని చెప్పారు. గూడెం పైప్‌లైన్ మరమ్మత్తులు చేయించడం జరిగిందని మోటారు పది నిమిషాలు కూడా బంద్ కాలేదని వివరించారు. గత పాలకుల హయాంలో తరుచు ఈ పైప్‌లైన్ పగలేవని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాల సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయానికి పది కోట్లతో అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగానైనా ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు సరిపోయే కరెంటు ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. ఇంటర్ నేషనల్ షిప్ పాండ్, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి , మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్ర ఎనుముల రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంతుల బృందానికి ఎమ్మెల్యే ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ పాత్రికేయుల సమావేశంలో మంచిర్యాల మన్సిపల్ కార్పోరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పోరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్ళు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగణనలో స్వయంగా వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:**జనగణన 2027 ప్రక్రియలో భాగంగా సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. గురువారం కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ద్వారా ఎమ్మెల్యే తనతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లోపొందుపరిచారు. జాతి నిర్మాణంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ జనగణనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ మహా క్రతువును విజయవంతం చేయడంలో ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి, టిపిబిఒ ప్రీతం పాల్గొన్నారు.

## బస్సు షెల్టర్ నిర్మాణంలో ఉద్రిక్తత



**ప్రజాపక్షం/ముప్కాల్ :**మండల కేంద్రంలో బస్సు షెల్టర్ నిర్మాణం కోసం గ్రామస్తులకు ఒక అధికార పార్టీ నాయకుడి మధ్య వైరుధ్యం తారస్థాయికి చేరుకుంది. ఈ సందర్భంలో గురువారం ఉదయం ముప్కాల్ గ్రామస్తులు పాతబస్టాండ్ వద్ద ఆర్‌అండ్‌బి స్థలంలో ప్రయాణీకుల సౌకర్యార్థం తాత్కలికంగా బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టి మహిళా ప్రయాణీకుల సౌకర్యం కోసం పబ్లిక్ టాయిలెట్స్ మంచినీటి సౌకర్యం కల్పించాలని ఒక నిర్ణయంకు వచ్చారు. అట్టి నిర్ణయంకు వ్యతిరేకంగా అధికార పార్టీ నాయకులు అడ్డు వస్తున్నారని అతనికి పోలీసులు సైతం వత్తాసు పలుకుతున్నారని ఆందోళన చేపట్టారు. గ్రామస్తులు ఆందోళన చేపడుతున్నారని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు గ్రామస్తులకు పోలీసులకు వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామస్తులతో సిఐ జాన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న బస్ షెల్టర్ నిర్మాణంలో సదరు వ్యక్తికి సంబంధించిన గృహం ఉండేదని అట్టి గృహంను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కూలదోల్చరన్నారు. సదరు వ్యక్తి హైకోర్టును ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని గ్రామస్తులకు సూచించారు. ఒకవేళ అక్రమంగా నిర్మాణాలు చేపడితే అట్టి వ్యక్తులపై కేసులు నమో దు చేస్తామని హెచ్చరించారు.

**పోలీసులకు గ్రామస్తుల సమాధానం :**ఈ విషయంపై గ్రామస్తులు పోలీసులతో మాట్లాడుతూ మండల కేంద్రానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కావటంతో అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్డు వెడల్పు పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అంతకుముందు సదరు వ్యక్తి గృహం నేలకొరిగిన సందర్భంలో ఆర్‌అండ్‌బి అట్టి స్థలాన్ని తమ పరిధిలోకి తీసుకుతందని గుర్తు చేశారు. ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ సంయుక్తంగా ఇచ్చిన నివేదిక ఆధారంగా రోడ్డు వెడల్పు మధ్యలో డివైడర్ ప్రకృతి అందాలను ఒదిగిలే పచ్చని చెట్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణీకుల సౌకర్యం కోసం బస్సు షెల్టర్ తాత్కలికంగా నిర్మిస్తే అతనికి వచ్చే నష్టమేమిటని ప్రశ్నించారు. ఇదొక రాజకీయ కుట్ర జరుగుతోందని గ్రామస్తులు పోలీసులకు సమాధానమిచ్చారు.

**పోలీసుల సమక్షంలోనే బస్‌షెల్టర్ నిర్మాణం:**ఒకవైపు పోలీసులు మరోవైపు గ్రామస్తుల మధ్య ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో మహిళలు ఆగ్రహించి బస్సు షెల్టర్ పనులను పూర్తి చేశారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్ నిర్మాణం చేపడితే అడ్డుగా వచ్చిన పోలీసులను మహిళలు అడ్డుకున్నారు. పోలీసులు సైతం చట్టప్రకారం వెళుతామని కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్తులకు చెప్పిన పెడచెవిన పెట్టడం సరైంది కాదన్నారు. ఉన్నతాధికారులకు ఇట్టి తవిషయంను తెలియపరుస్తామన్నారు.

## బస్సు చార్జీల తగ్గింపు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**సత్తుపల్లి నుండి విజయవాడ ఎక్స్ ప్రెస్ బస్సు చార్జీల ను తగ్గించినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రాలో తిరిగే ఎక్స్ ప్రెస్ బస్సులకు ఆంధ్రా సెక్టార్ విసన్నపేట నుండి విజయవాడకు 15 శాతం వరకు రా యితీ కల్పిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సత్తుపల్లి నుండి వి జయవాడ వెళ్లే ఎక్స్ ప్రెస్ బస్సులలో విస్సన్నపేట నుండి విజయవాడ కే వలం 80 రూపాయలతో ప్రయాణించవచ్చునని ఆయన అన్నారు. 15% రాయితీ ప్రకటించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. గతంలో విసన్నపేట నుం డి విజయవాడ 90 రూపాయలు చార్జీ ఉండేది అని ఇప్పుడు 80 రూపాయ లుగా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. కావున సత్తుపల్లి డిపో పరి ధిలోని విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీ నారాయణ కోరారు.

## మండల వ్యాప్తంగా ఎర్రజెండా పండుగ నిర్వహించాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు



**ప్రజాపక్షం/ మధిర:** 141వ మేడే వేడుకలను మధిర మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు పిలుపునిచ్చారు. మేడే పండు గను పురస్కరించుకుని పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు ప్రతికూడలిలో ఎర్రజెండాను ఆవిష్క రించి కార్మిక ఐక్యతను చాటాలని కోరారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం వారి సంక్షేమం కోసం సిపిఐ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

## మాటూరులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం




**ప్రజాపక్షం/మధిర:** మండల పరిధిలోని మాటూరు గ్రామంలోని రైతు వేదిక నందు వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు, వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్ర వేత్త రుక్మిణిదేవి హాజరై మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి నిచ్చే వంగ డాలు వైపు మొగ్గు చూపాలని, యూరియా వాడకం తగ్గించి నేల ఆరో గ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. పంట మార్పిడి పద్ధతిని పాటించి అధిక ఆదాయాన్ని పొందాలని, మార్కెట్‌లో గిరాకీ ఉన్న రకాలను పండిం చాలని, సేంద్రీయ పద్దతులు పాటించి ఆరోగ్యకరమైన ఆహారం పొందా లని రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.విజ యచంద్ర మాట్లాడుతూ సాగునీటిని ఆదా చేసి ఎక్కువ దిగుబడులు ఆర్జించే విధంగా రైతులు వ్యవసాయం చేయాలని కోరారు. ప్రకృతి వ్యవ సాయం వైపు, అధిక దిగుబడి నిచ్చే పంటల వైపు మొగ్గు చూపాలని చెప్పారు. కిటక శాస్త్రవేత్త నాగస్వాతి మాట్లాడుతూ వివిధ సస్యసంరక్షణ చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.సాయి దీక్షిత్, వ్యవసాయ విస్తారణాధికారి నికిత, రైతులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ:**తల్లాడ మండలం ముద్దునూరు బిఆర్ఎస్ పార్టీ నాయ కులు అంబేద్కర్ ఇటీవల ముద్దునూరు నుంచి ఖమ్మం వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మంలోని టిఆర్ఆర్ హాస్పటల్‌లో చికిత్స పొందు తున్న విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాస్పటల్‌కు వెళ్లి పరామర్శించి తొందరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిన సంఘటనపై అంబేద్కర్‌ని వివ రాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## ఆరు నెలల్లో 100 శస్త్ర చికిత్సలు

- స్థానిక గిరిజనులకు వరంగా మారిన ఆస్పత్రి



**ప్రజాపక్షం/భద్రాచలం/చర్ల :** నియోజకవర్గ పరిధిలోని చర్ల మండలం లోని ప్రభుత్వాస్పత్రిలో ఆరు నెలల కాలంలో 100 ట్యూబెక్టమీ శస్త్ర చికి త్సలు నిర్వహించారు. ఈ ఆస్పత్రి చర్ల మండల పరిసర ప్రాంతాల ప్రజ లకు వరంగా మారింది. గతంలో చర్లలో ఆపరేషన్ థియేటర్ లేకపోవ డంతో ట్యూబెక్టమీ వంటి ఆపరేషన్లకు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి ప్రయాణించాల్సి వచ్చేది. దీంతో రోగులకు శారీరక ఇబ్బందులతో పాటు ఆర్థిక భారం పడేది. ప్రస్తుతం సిజేరియన్ వంటి ప్రధాన శస్త్రచికిత్సలతో పాటు అత్యాధునిక టిఫా స్కానింగ్ సేవలు కూడా అందుబాటులోనికి రావడం గమనార్హం. ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు సూచన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దృష్టి సారించి చర్ల ప్రభుత్వాస్పత్రిని ఆధునీకరించి అవసరమైన పరికరాలు సమకూర్చారు. మాతృసేవలకు అవ సరమైన ప్రసూతి, పిల్లల, మత్తు, వైద్య నిపుణులను కూడా నియమించారు. దీంతో స్థానికంగా అన్ని వైద్య సేవలు అందుబాటులోనికి రావడంతో గిరిజ నప్రాంతాల ప్రజలకు పెద్ద ఊరట లభించినట్లు అయింది. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గానూ కృషి చేస్తున్నట్లు డిసిహెచ్ఎస్ రవిబాబు ఈ సందర్భంగా తెలిపారు.

# ధిక్కార పతాక మేడే

### పోరాటాలతోనే లేబర్ కోడ్‌లకు చెక్



**ప్రజాపక్షం/ ఖమ్మం :**మేడే ధిక్కారానికి ప్రతీక. లక్షల గొంతుకలు ఒకటై నినదించి పోరాడి హక్కులను సాధించుకున్న రోజు ఇది మేడే చారిత్రాత్మకం, స్ఫూర్తిదాయకం, పని గంటల భారాన్ని తగ్గించాలని అమెరికా నడిబొడ్డు చికాగో నగరంలో జరిగిన ఆందోళన నాటి పరిస్థితులు పున రావృతమవుతున్నాయి. మోడీ పాలన మొత్తం కార్మిక హక్కులను హరించటం, పని గంటల పెంపు సహా శ్రమజీవుల వ్యతిరేక విధానాలతోనే సాగుతుంది. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను లేబర్ కోడ్స్‌తో తొలగించబడ్డాయి. కార్పొరేట్ సంస్థల కను సన్నల్లో పాలన సాగుతుండటంతో కార్పొరేట్ అనుకూల నిర్ణయాలలో భాగంగా యూనియన్ల రద్దు సహా పలు కీలక నిర్ణయాలు కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంది. ఈ క్రమంలోనే 12 గంటల పని విధానం తెరపైకి వచ్చి 100 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినాల కోసం పోరాటం చేశారో శతాబ్ద కాలం దాటిన తర్వాత తిరిగి ఎనిమిది గంటల పని దినాల కోసం పోరాటం చేయాల్సి రావటం అత్యంత బాధాకరం. తనకున్న అధికార బలంతో కార్మికుల వర్గ పోరాటాలను అణిచివేసే ప్రయత్నం చేస్తుంది. మోడీ, అమిత్‌షా ద్వయం దేశంలో తమను ప్రశ్నించే వారు ఉండకూడదన్న రీతిగా వ్యవహరిస్తున్నారు. రాజ్యహింస పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు 'అర్బన్ నక్సలైట్' అనే పదం చాలా మంది నోళ్లను మూసి వేయడానికి పనికి వస్తుంది. రాజ్యాంగేతర శక్తులుగా, హింసావాదులుగా, అభివృద్ధి నిరోధకులుగా ముద్ర వేసి మావోయిస్టులను కట్టడి చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అర్బన్ నక్సలైట్ పదాన్ని బహుళ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చింది. ఒక పక్క హక్కుల హననం, పెరిగిన పని గంటలతో పాటు మరో పక్క ఉద్యోగ భద్రత కరువైంది. ఏమి చేస్తే ఏమవుతుందో, ఎక్కడ ఉద్యోగం పోతుందోనని బిక్కుబిక్కు మంటూ బతకాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వ రంగం క్రమేపి ప్రైవేటుపరమై కార్పొరేట్ వశం కావడంతో ప్రభుత్వ రంగంలో రిటైర్‌మెంట్స్ తప్ప రిక్రూట్‌మెంట్స్ లేని పరిస్థితి. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పేరుతో శ్రమదోపిడీ పెరిగిపోయింది. వీటన్నింటి నడుమ 141వ మేడేను జరుపుకుంటున్నాం. గత పోరాటాలు, సాధించిన విజయాలు స్ఫూర్తిగా కార్మిక వర్గం పోరాటాలకు పునరంకితం కావాల్సిన సమయమిది. తెలంగాణ ఆర్టిసి కార్మికులు సమ్మెతో ఒక గొప్ప పోరాట విజయాన్ని అందుకున్నారు. ఇటీవల కాలంలో కార్మిక వర్గం సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన సమయమిది. 141వ మేడే సందర్భంగా భవిష్యత్ పోరాటాలకు పునరంకితం కావాలి. నిర్బంధాలను అధిగమించి ఈ దశాబ్దపు సమరశీల పోరాటాలకు 141వ మేడే నాంది పలకాలి.

## పుట్టకోట పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్:**ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని పుట్టకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో వరుసగా మూడవ సంవత్సరం నూరుశాతం ఉత్తీర్ణతతో హ్యాట్రిక్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎస్ జ్యోతి తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 14 మంది పదవ తరగతి పరీక్షలు వ్రాయగా వారిలో 14 మంది ఉత్తీర్ణత సాధించి నూరు శాతం ఫలితాలు సాధించినట్లు ఆమె తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించినట్లు ఆమె తెలిపారు. ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం అర్బన్ రఘునాథపాలెం మండలాల్లో మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా పుట్టకోట పాఠశాల నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థులను సహకరించిన తల్లిదండ్రులకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించి స్వీట్స్ తినిపించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, చెన్నారెడ్డి, పాపారావు, శ్రీనివాసరాజు, సుజాత, సుదర్శనాచారి, వసంతరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రవేట్ పాఠశాలకు దీటుగా నూరు శాతం ఫలితాలు సాధించడం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## బరువెత్తే హమాలీ.. ఇంకెప్పుడు గిట్టేది కూలీ!

### స్వేదం చిందించే హమాలీల జీవన పోరాటం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:**అన్నపురెడ్డిపల్లి మండలంలో రోజువారీ కూలీలైన హమాలీలు ఎన్నో సంవత్సరాలుగా కష్ట పడి జీవనం సాగిస్తున్నారు. ఎండనకా వాననకా ధూళిని ధుమ్మును సైతం లెక్క చేయకుండా రాత్రనకా పగలనకా వారి జీవనం సాగించుకొనేందుకు ఒక యోధుడిలా పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. పని ఉంటేనే పూట గడిచే పరిస్థితుల్లో, కుటుంబాలను పోషించేందుకు వారు నిరంతరం శ్రమిస్తున్నారు. వ్యవసాయం, నిర్మాణం, రోడ్డు పనులు వంటి కూలి పనులే ప్రధాన ఆధారం. రోజుకు రూ 300 నుండి రూ 500 వరకు వచ్చే కూలీ పెరుగుతున్న ధరల నడుమ సరిపోకపోవడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని లేని రోజుల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. పూట గడవడం కష్టతరపమవుతుంది. గ్రామాలలో అమాలి పాత్ర ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. వ్యవసాయం, వ్యాపారం, నిర్మాణం, వివిధ రకాల పనులు ముందుకు సాగాలంటే హమాలీ పాత్ర ఎంతైనా ఉంటుంది. ఆర్థిక సమస్యల కారణంగా కొంత మంది పిల్లలు చదువు మానేసి తల్లి దండ్రులకు తోడుగా కూలి పనులకు వెళ్తున్నారు. అయితే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు చదివి మంచి స్థాయికి చేరాలని ఆశతో కష్టపడుతున్నారు. మహిళలు కూడా కూలి పనుల్లో భాగస్వామ్యమవుతూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. పూర్తిగా ఇదే పనిపై ఆధారపడి జీవనం సాగించి వృద్ధాప్య దశకు చేరుకున్న ఎందరో హమాలీలు బతుకులు చిత్రమైపోతున్నాయి. అటు పని చేయలేక సంపాదన లేక ఆర్థిక సమస్యలు అనారోగ్యంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఇటు వంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తించి పెన్షన్ ప్రతి నెల రూ 5000లను అందించవలసిందిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వ్యక్తిగత కుటుంబ జీవిత భీమా, ప్రభుత్వం ద్వారా వ్యక్తిగత రుణాలు సబ్సిడీలో అందించే విధంగా పలు సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందే విధంగా ప్రభుత్వం ద్వారా అధికారులు కృషి చేసి ఆదుకోవాలని, అప్పుడే హమాలీల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. కష్టాల్లోనూ ఆశను కోల్పోకుండా, చెమటతో జీవితం ముందుకు నడిపిస్తున్న ఈ హమాలీలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద '163 బిఎన్ఎస్ఎస్' యాక్ట్ అమలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లా కేంద్రంలో ఈనెల 3వ తేదీన నిర్వహించనున్న నీట్ (యూజీ) ప్రవేశ పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందో బస్తుతో పాటు భారతీయ నాగరిక్ సురక్షా సహిత ( 163 బిఎన్ఎస్ఎస్) యాక్ట్ అమలులో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్ దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు రెండు వంద మీటర్ల వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఈ ఆంక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలైన ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రికళాశాల, యూనివర్శిటి పిజి కళాశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎన్‌ఎస్‌పి క్యాంప్‌లోని ప్రభుత్వ పాఠశాల, నిర్మల్ హృదయ్ హైస్కూల్, ప్రభుత్వ మహిళ డిగ్రికళాశాల, కరుణగిరి కేంద్రీయ విద్యాలయం సమీపంలోని జిరాక్స్, ఇంటర్ నెట్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలన్నారు. ఊరేగింపులు, ర్యాలీలు, సభలు, డీజేలు, లౌడ్ స్పికర్లు నిషేధమన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 163 యాక్ట్ అములు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందో బస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహారాతో పాటు నిఘా విభాగం పనిచేసుందన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమకు చేరవేస్తాయన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్ష ప్రశాంత వాతవరణంలో ముగిసేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## నెల్లిపాక బంజర ఉన్నత పాఠశాలలో 100శాతం ఉత్తీర్ణత

### పాఠశాల విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించిన సర్పంచ్ ముంద్రు రామకృష్ణ



**ప్రజాపక్షం/అశ్వాపురం:**పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అశ్వాపురం మండల పరిధిలోని నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100శాతం ఫలితాలు వచ్చినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్కా శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు అభినందన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నెల్లిపాక సర్పంచ్ ముంద్రు రామకృష్ణ మాట్లాడుతూ అశ్వాపురం మండలంలోనే 100శాతం ఫలితాలు సాధించిన పాఠశాలగా నెల్లిపాక బంజర ఉన్నత పాఠశాల అని చెప్పుకోవడానికి గర్వంగా ఉందని అన్నారు. ఇంత మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఉపాధ్యాయులు చెప్పిన విధంగా నడుచుకొని ఈ రోజు నెల్లిపాక పంచాయితీ పేరును మండల వ్యాప్తంగా గర్వించదగ్గ చేసిన పాఠశాల విద్యార్థులకు పేరు పేరున అభినందించి, రాబోయే రోజుల్లో మన నెల్లిపాక పంచాయితీకి కీర్తిప్రతిష్టలు తీసుకరావాలని ఆశీర్వదించడం జరిగింది. రాబోవు ముందు రోజుల్లో మంచిగా చదువుకొని వారి తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు, పుట్టిన ఊరుకు పేరు తెచ్చిపెట్టాలని చదువులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు 100శాతం ఫలితాలు సాధించడం మాకు, మా పాఠశాలకు గర్వంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలలో ప్రథమ, ద్వితీయ ఫలితాలు సాధించిన విద్యార్థులు తుపాకుల సాంకేత్ కుమార్ తండ్రి రాము, పర్స బోయిన తేజ శ్రీ తండ్రి రాధాకృష్ణలను ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సర్పంచ్ ముందు రామ కృష్ణ శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, నెల్లిపాక సెక్రటరీ, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెట్రో ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉంచాలి

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** పెట్రో ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం పెట్రోల్ బంకుల యజమానులు, ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చమురు కంపెనీలకు పెట్రోల్ ఉత్పత్తులపై సకాలంలో ఇండెంట్లు పెట్టి నిల్వలు ఉంచుకోవాలన్నారు. బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీల యజమానులు సమావేశానికి హాజరయ్యారు. హెచ్‌పి సిఎల్ సేల్స్ ఆఫీసర్ సమావేశానికి హాజరు కాకపోవడంతో కలెక్టర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా బంకుల నిర్వాహకులు మాట్లాడుతూ తాము ఇండెంట్లు పెట్టినప్పటికీ వాటిని రద్దు చేసి మరళా పెట్టాలని అంటున్నారని, తద్వారా ఉత్పత్తులు సకాలంలో అందడం లేదన్నారు. అనంతరం కలెక్టర్ మరోసారి మాట్లాడుతూ ఉన్న నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధిక ధరలకు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌గా ప్రజలకు సేవ చేయడం అదృష్టం



పోలీస్ అధికారులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :**పోలీసుగా బాధ్యయుత ప్రజా సేవ చేయడం అదృష్టమని డిసిఆర్‌బి డిఎస్‌పి మల్లయ్యస్వామి, ఏఆర్ డిఎస్‌పి సత్యనారాయణ అన్నారు. పోలీస్‌శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఐదుగురు ఏఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్ బి తాతారావు, టి వెంకట్రావు, టి వెంకట సుబ్బారావు, అబ్దుల్ ఘని, కొరసా నాగేశ్వరరావు, బి శ్రీరామ్ పదవీ విరమణ పొందడంతో వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అంకిత భావంతో ప్రజా సేవ చేసేందుకు ఎంపికైన పోలీసులు నిబంధతతో పనిచేసి పదవీ విరమణ పొందడం గర్వాకరణమని అన్నారు. పదవిలో ఉన్నప్పుడు చేసిన సేవలను ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని తెలిపారు. ప్రభుత్వం నుండి రావాల్సిన సొమ్ములను వీలైనంత త్వరగా వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మొద్దు నిద్రలో ఎక్సైజ్ శాఖ

### గంజాయి, బెల్ట్ షాపులు, నాటు సారాపై మౌనం - నియోజకవర్గంలో ఎక్సైజ్ శాఖ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి



పత్రికల్లో కథనాలపై స్పందన కరువు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంజాయి, కాపుసారా, బెల్ట్ షాపులు ఎక్కడపడితే అక్కడ లభిస్తుంటే ఎక్సైజ్ శాఖ ఎందుకు మౌనంగా ఉంటుందని, ఇకనైనా ఆ శాఖాధికారులు మొద్దు నిద్ర వీడాలని ప్రజలు కోరుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా పలు పత్రికలలో వరుస కథనాలు వస్తున్న ఆ శాఖ అధికారుల్లో స్పందన కరువైందని. కల్లూరు మండలం లో కాపుసారా కంపు కొడుతుందని, నియోజకవర్గంలో బెల్టు షాపులతో మద్యం, బెల్ట్ మాఫియా చెల రేగిపోతూ పలు కుటుంబాలను చిద్రం చేస్తుందని, గంజాయి యువతను మత్తులోకి నెట్టేస్తున్న ఆ శాఖ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రజా సంఘాలు నిలదీస్తున్నాయి. బెల్ట్ మాఫియా, గంజాయి, కాపుసారాలపై పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నా, ఎక్సైజ్ శాఖ మాత్రం ఆ వైపుగా కదిలిన దాఖలాలు కనిపించడం లేదని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. మత్తును చిత్తు చేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు ఇప్పటివరకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న దాఖలాలు ఒకటి రెండు మినహా అంతగా కనిపించలేదని, పోలీసులకు మాత్రం ప్రతి నెల రెండు, మూడు చోట్ల భారీగా గంజాయి పట్టుపడుతుందని, ఎక్సైజ్ శాఖ అధికారులు గంజాయి రావాణ చేస్తున్న వారిపై ఎందుకు నిఘా పెట్టటం లేదని, పోనీ గ్రామాల్లో పెరిగిపోతున్న బెల్ట్ మాఫియా, నాటుసారా భట్టీలపై ఏమైనా దాడులు చేశారా అంటే అది లేదని, ఈ దందా అంతా వారి కను సన్నలోనే జరుగుతుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కల్లూరు మండలంలోని ఓ గ్రామంలో నాటు సారా బట్టీ ఓ కుటీర పరిశ్రమగా వెలిగొందుతుందని ఆ గ్రామంలో కొందరు భహిరంగంగా చెప్పుకుంటున్నా ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖాధికారులకు ఎందుకు తెలియ లేదని, తెలిసినా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదా అని ప్రశ్నిస్తున్నారు కల్లూరు మండల ప్రజలు. సత్తుపల్లి నియోజకవర్గం ఆంధ్రాకు సరిహద్దు కావటం, భద్రాచలం టూ తిరువూరు వయా విజయవాడ, రాజమండ్రీ టూ ఖమ్మం వయా హైద్రాబాద్ పాల్వంచ టూ సత్తుపల్లి వయా చింతలపూడి మీదుగా ఏలూరు, కొత్తగూడెం టూ తల్లాడ వయా ఖమ్మం లేదా తల్లాడ వయా కల్లూరు మీదుగా తిరువూరు చేరుకునేందుకు రహదారులు ఉండటంతో ఈ దారులలో గంజాయి బారీగా రవాణా జరగటం పోలీసులుకు పట్టుబడుతున్నా ఎక్సైజ్ శాఖాధికారులకు మాత్రం ఎందుకు దొరకటం లేదని ఆ శాఖ పని చెయ్యక లేక చేసిన మనకెందుకు మన జీతాలు మనకు వస్తున్నాయని లేక మరేదైననా అనే అనుమానులు ప్రజలను తొలస్తున్న ప్రశ్నలు. బెల్ట్ షాపులపై దాడులు చెయ్యరు. నాటు సారాను అరికట్టరు. గంజాయి రవాణాను పట్టించుకోరు మరి ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. బడి పక్కన బెల్ట్ షాపు వీరికి కనిపించటం లేదని, గుడి ఎదురుగా బెల్ట్ షాపును పరిగణలోకి తీసుకోరని మరి ఎక్సైజ్ శాఖ విధులేంటని ప్రజలు అడుగుతున్నారు. ఇప్పటికైనా ఆ శాఖపై ప్రజల్లో ఉన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ అక్రమ బెల్ట్ షాపులను అరికట్టి, నాటుసారాపై ఉక్కుపాదం మోపి, గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉంచాలి.

# బెంగళూరులో వర్ష బీభత్సం

- వర్ష సంబంధిత ఘటనలకు పది మంది మృతి
- భారీ వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలులు

అనేక ప్రాంతాలు జలమయం, తీవ్రంగా ట్రాఫిక్‌కు అంతరాయం

- నేలకొరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు



**బెంగళూరు :** బెంగళూరులో బుధవారం సాయంత్రం కురిసిన వర్షాలు బీభత్సం సృష్టించాయి, ఈ ఘటనలో 10 మంది మరణించారని అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలుల కారణంగా చెట్లు కూలిపోయాయని, అనేక కీలక ప్రాంతాలు జలమయమయ్యాయని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందని వారు గురువారం తెలిపారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో దాదాపు గంటసేపు ఆకస్మికంగా, తీవ్రమైన వర్షం కురిసింది. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి, పార్క్ చేసిన వాహనాలు నుజ్జునుజ్జు అయ్యాయి, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అదే సమయంలో, అనేక రోడ్లు రాకపోకలకు వీలులేకుండా పోయాయి, దీంతో రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం మధ్య బౌరింగ్ అండ్ లేడీ కర్జాన్ ఆసుపత్రి ప్రహరీ గోడ కూలిపోవడంతో ఆరేళ్ల బాలికతో సహా ఏడుగురు మరణించారు. మృతులలో ఇద్దరు కేరళకు చెందినవారు, వారు స్టడీ టూర్‌లో ఉన్నారు. గోడ కూలిపోయినప్పుడు వారు దాని సమీపంలో ఆశ్రయం పొందారని వారు తెలిపారు. మరో ఘటనలో, వేగా సిటీ మాల్ సమీపంలోని బన్నేర్‌ఘట్ట రోడ్డుపై రఘు అనే 35 ఏళ్ల వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మరణించాడు. యారబ్ నగర్‌లో జరిగిన వేరొక కేసులో, వర్షంలో తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేసే ప్రయత్నంలో సయ్యద్ సుఫియాన్ అనే విద్యార్థి విద్యుత్ తీగను తాకి మరణించాడని పోలీసులు తెలిపారు. చామరాజపేటలో మరో మృతి నమోదైంది. తుఫాను సమయంలో ఒక సిమెంట్ దిమ్మె కూలి ఇంటి పైకప్పును చీల్చుకుని లోపలికి రావడంతో మంజునాథ్ అక్కడికక్కడే మరణించాడు. అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షాలు నగరం అంతటా తీవ్ర విధ్వంసం సృష్టించాయి. బెంగళూరులో వర్ష సంబంధిత ఘటనల కారణంగా ఇప్పటివరకు 10 మంది మరణించినట్లు పోలీసులు తెలిపారు. తుఫాను వల్ల గోడలు కూలిపోవడం, విద్యుదాఘాతం, నిర్మాణ నష్టం కారణంగా ఈ మరణాలు సంభవించాయని వారు పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా కనీసం 87 చెట్లు కూలిపోయాయని, 131 కొమ్మలు విరిగిపోయాయని, దీంతో జనజీవనానికి అంతరాయం కలిగిందని మున్సిపల్ అధికారులు తెలిపారు. వీటిలో 60 చెట్లను, 98 కొమ్మలను తొలగించారు, పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన అనేక కార్లు, ద్విచక్ర వాహనాలు కూలిపోయిన చెట్ల కింద నలిగిపోయాయి. ప్రధా న కూడళ్లు, అండర్‌పాస్‌లు జలమయమయ్యా యి. కెఆర్ సర్కిల్ అండర్‌పాస్ పూర్తిగా నీట మునిగిపోవడంతో, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో పో లీసులు ఆ మార్గాన్ని బారికేడ్లతో మూసివేయాల్సి వచ్చింది. కూలిపోయిన చెట్ల కొమ్మలు, నిలిచిపోయిన వాహనాల వల్ల ట్రాఫిక్ రద్దీ మరింత తీవ్ర మై, ప్రయాణికులు గంటల తరబడి చిక్కుకుపోయారు. పలు ప్రాంతాల్లో భవనాలు పాక్షికంగా దె బ్బతిన్నాయని, అలాగే ఈ తుఫాను ఆకస్మికంగా, అనూహ్యంగా రావడంతో చాలా మంది నివాసితులు అప్రమత్తం కాలేకపోయారని అధికారులు తెలిపారు. అధికారులు రాబోయే మూడు రోజుల పాటు వర్ష హెచ్చరిక జారీ చేశారు.

# పికప్ వ్యాన్, ఎస్‌యువి ఢీ

16 మంది మృత్యువాత

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఘటన

ప్రధాని మోదీ, సిఎం విచారం



**ధార్ :** మధ్యప్రదేశ్‌లో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ధార్ జిల్లాలో ఒక పికప్ వ్యాన్, ఎస్‌యువి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో 16 మంది మృత్యువాత పడినట్లు గురువారం అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి ఇండోర్–అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఉన్న చిక్లియా కూడలి వద్ద, కూలీలను తీసుకువెళ్తున్న వ్యాన్ బోల్తా అదుపుతప్పి పడి, ఎదురుగా వస్తున్న స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యువి)ను ఢీకొట్టిందని వారు పేర్కొన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రాథమికంగా 12 మంది మరణించినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత మరో నలుగురు వ్యక్తులు తమ గాయాల కారణంగా మరణించడంతో, మృతుల సంఖ్య 16కు చేరిందని అధికారులు తెలిపారు. 'ధార్‌లో ఒక అత్యంత విషాదకరమైన ఘటన జరిగింది. ఒక పికప్ వాహనంలో 46 మంది వ్యక్తులు (వీరిలో ఎక్కువ మంది కూలీలే) ప్రయాణిస్తున్నారని నాకు సమాచారం అందింది. ఆ వాహనం బోల్తా పడి ప్రమాదానికి కారణమైంది. 15 మంది మరణించినట్లు మాకు సమాచారం అందింది. ఇది చాలా దురదృష్టకరం' అని ఇండోర్ డివిజనల్ కమిషనర్ డాక్టర్ సుదామ్ పి. ఖాడే విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ఆ తర్వాత, మరో వ్యక్తి కూడా తన గాయాల కారణంగా మరణించారని ధార్ జిల్లా ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ముకుంద్ బర్మన్ తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందించేలా, ఎవరూ వైద్య సహాయం లేకుండా మిగిలిపోకుండా చూసేలా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఖాడే తెలిపారు. ప్రమాదం జరిగిన స్థలంలో సహాయక చర్యలను డివిజనల్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ అనురాగ్ పర్యవేక్షించారు. గాయపడిన ఏడుగురు వ్యక్తులను చికిత్స కోసం ఇండోర్‌కు తరలించామని, ఇక్కడ 15 మంది చికిత్స పొందుతున్నారని ఖాడే చెప్పారు. చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని, కానీ అవసరమైతే వారిని వేరే చోటికి తరలించడానికి (రెఫర్ చేయడానికి) అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఇండోర్‌లో కూడా వైద్యుల బృందాన్ని అందుబాటులో ఉంచామని, చికిత్సలో ఎటువంటి జాప్యం లేదా సమస్య తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఘటన బుధవారం రాత్రి 8:30 నుండి 9 గంటల మధ్య జరిగింది. ధార్ జిల్లాలోని బగ్గడ్ ప్రాంతం నుండి కూలీలు ఆ వ్యాన్‌లో తమ ఇళ్లకు తిరిగి వస్తుండగా, చిక్లియా కూడలి వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయారు. తిర్లా పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన పట్ల ప్రధానమంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పిఎంఎన్ఆర్ఎఫ్ నుండి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 లభించినట్లు పిఎం కార్యాలయం తెలిపింది. అదే విధంగా మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 1 లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ. 50,000 చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి యాదవ్ తెలిపారు. గాయపడిన వారికి సరైన చికిత్స అందేలా చూడాలని స్థానిక యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు ధార్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కైలాష్ విజయవర్గీయ తెలిపారు. ధార్ జిల్లాకు చెందిన ప్రతిపక్ష నాయకుడు ఉమంగ్ సింఘార్ కూడా ఈ ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# 226 కంటే ఎక్కువే గెలుస్తాం..

ఎగ్జిట్ పోల్స్‌పై నిప్పులు చెరిగిన మమతా బెనర్జీ..



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి) ఘన విజ యం సాధిస్తుందని ముఖ్యమ ంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 కంటే ఎక్కువ సీట్లను టిఎంసి గెలుస్తుందని స్పష్టం చేశారు. 'మామాటిమానుష్' స్ఫూర్తితో టిఎంసి ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నా రు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మమతా బెనర్జీ ఓ వీడియో సందేశం పోస్టు చేశారు. ఎన్నికల ఫలితం ఇప్పటికే తమ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు మమతా బెనర్జీ. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినా.. విజయం మాత్రం టీఎంసీదే అని తేల్చి చెప్పారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలపైనా మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. ఎగ్జిట్ పోల్ గణాంకాలను బిజెపి కార్యాలయం నుంచే విడుదల చేశారంటూ ఆరోపణలు గుప్పించారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతల్లో భయాందోళనలు సృష్టించేందుకు బిజెపి సంఖ్యలను తారుమారు చేసిందని మండిపడ్డారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తన మద్దతుదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నిక వేళ తన నియోజకవర్గం భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని మమతా ఆరోపించారు. ఓట్ల లెక్కింపు నాడు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపును నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వి జయం టిఎంసిదే అని మరోసారి స్పష్టం చే శారు మమతా బెనర్జీ. కాగా, బుధవారం సాయ ంత్రం పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిశాయి. దీంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదల అయ్యా యి. అందులో మెజారిటీ పోల్స్.. బిజెపినే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నాయి. దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు.

# కుల గణన జాప్యమే మోదీ ఉద్దేశం

గణనను ఎలా నిర్వహిస్తారనే దానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** కుల గణన అంశంపై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఈ గణనను ఎలా నిర్వహిస్తారనే దానిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి వివరాలు వెల్లడించలేదని మండిపడింది. ఈ ప్రక్రియను ఆలస్యం చేయాలనేదే ప్రధాని మోదీ ఉద్దేశమని కాంగ్రెస్ ఆరోపించింది. కుల గణనను ప్రభుత్వం 'కోల్డ్ స్టోరేజ్'లో పెట్టాలని చూస్తోందని ఇప్పటికే ఆ పార్టీ పేర్కొంది. సరిగ్గా ఏడాది క్రితం, రాబోయే కుల గణనలో మొత్తం జనాభా కుల గణనను చేర్చుతామని మోదీ ప్రభుత్వం ప్రకటించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. 'ప్రధానమంత్రి తీసుకున్న ఈ నాటకీయమైన యూటర్న్‌కు సంబంధించిన ఇటీవలి కాలక్రమం ఇది: 2021 జులై 21న, లోక్‌సభలో బిజెపి ఎంపి రక్షా నిఖిల్ ఖడ్సే (ప్రస్తుతం ఆమె స్వయంగా మంత్రిగా ఉన్నారు) అడిగిన ప్రశ్నకు హోంమంత్రి సమాధానమిస్తూ, కులాల వారీగా జనాభాను లెక్కించకూడదని భారత ప్రభుత్వం విధానపరంగా నిర్ణయించిందని చెప్పారు' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. 2021 సెప్టెంబర్ 21న, కులాల వారీగా జనాభాను లెక్కించాలని కోర్టు ఇచ్చే ఏ ఆదేశమైనా, మోదీ ప్రభుత్వం అప్పటికే తీసుకున్న విధాన నిర్ణయంలో జోక్యం చేసుకోవడంతో సమానమని పేర్కొంటూ మోదీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేసిందని ఆయన అన్నారు. 2023 ఏప్రిల్ 16న, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సాధారణ జనాభా లెక్కలలో భాగంగా తాజా కుల గణనను నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రికి లేఖ రాశారని రమేష్ గుర్తుచేశారు. '2024 ఏప్రిల్ 28న, న్యూస్18 నెట్‌వర్క్‌కు ఇచ్చిన ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో, కుల గణన జరపాలని కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్ 'అర్బన్ నక్సల్' భావజాలానికి సూచిక అని ప్రధానమంత్రి కాంగ్రెస్‌పై దాడి చేశారు' అని ఆయన అన్నారు. తన ఆరోపణకుగాను ప్రధానమంత్రి కాంగ్రెస్ నాయకత్వానికి క్షమాపణ చెప్పాలని రమేష్ అన్నారు. అంతకంటే ముఖ్యంగా, 2025 ఏప్రిల్ 30న కుల గణనను ప్రకటించినప్పుడు, 'అర్బన్ నక్సల్' భావజాలంతో తన మనసును ఎందుకు కలుషితం చేసుకోనిచ్చారో భారత ప్రజలకు ఆయన వివరణ ఇవ్వాలని రమేష్ అన్నారు. 'పూర్తిగా ఒక సంవత్సరం గడిచిపోయింది. ఈ కుల గణన ఎలా జరుగుతుందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయంలో నిపుణులతో మాట్లాడటం అటుంచితే, ప్రతిపక్ష పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా ఎలాంటి చర్చలు జరపలేదు' అని రమేష్ అన్నారు. కుల గణన విషయంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మే 5, 2025న ప్రధానికి మరోసారి లేఖ రాశారు. ఆ లేఖకు కనీసం స్పందన కూడా రాలేదు. ఆ లేఖలో లేవనెత్తిన అంశాలు ఇప్పటికీ చాలా చెల్లుబాటులో ఉన్నాయి' అని ఆయన అన్నారు. నిజానికి, ఇటీవల ముగిసిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశం తర్వాత అవి మరింత ప్రాసంగికంగా మారాయి, ఎందుకంటే కుల గణనను ఆలస్యం చేయాలనే సంపూర్ణ ఉద్దేశం ప్రధానికి ఉందని ఆ సమావేశంలో స్పష్టమైందని రమేష్ పేర్కొన్నారు. మే 5, 2025న మోదీకి ఖర్గే రాసిన లేఖ గురించి కూడా ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. ఆ లేఖలో కాంగ్రెస్ అధ్యక్షుడు మన సమాజంలోని వెనుకబడిన, అణగారిన, అట్టడుగు వర్గాలకు వారి హక్కులను అందించే కుల గణన వంటి ఏ ప్రక్రియనైనా నిర్వహించడాన్ని ఏ విధంగానూ విభజనవాదంగా పరిగణించకూడదని పేర్కొన్నారు. మన రాజ్యాంగ పీఠికలో వాగ్దానం చేసిన విధంగా సామాజిక, ఆర్థిక న్యాయం, హోదా, అవకాశాలలో సమానత్వాన్ని నిర్ధారించడానికి సమగ్ర పద్ధతిలో కుల గణనను నిర్వహించడం అత్యంత అవసరమని కాంగ్రెస్ విశ్వసిస్తుందని ఖర్గే ఆ లేఖలో పేర్కొన్నారు. కుల గణన విషయంపై త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని అభ్యర్థిస్తున్నానన్నారు.

## డిఎంకె ముఖ్యనేతలతో స్టాలిన్ భేటీ



**చెన్నై:** తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ డిఎంకె నాయకులతో ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను ఆయన సమీక్షించారు. కొడైకెనాల్‌లో నాలుగు రోజుల విహారయాత్ర ముగించుకుని బుధవారమే స్టాలిన్ రాష్ట్రానికి చేరుకున్నారు. రాష్ట్రంలో డిఎంకె తిరిగి అధికారంలోకి రానుందని వివిధ మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్న నేపథ్యంలో స్టాలిన్ డిఎంకె నేతలతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్‌తో పాటు, ఎం.ఆర్.కె. పన్నీర్‌సెల్వం, ఇ.వి. వేలు వంటి ఇతర మంత్రులు సహా పలువురు కీలక నాయకులు పాల్గొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరగనున్నందున, తుది వ్యూహాన్ని ఖరారు చేయడంపై, ఓట్ల లెక్కింపును పర్యవేక్షించే పార్టీ బూత్ ఏజెంట్లకు తగిన సూచనలు ఇవ్వడంపై స్టాలిన్ ప్రధానంగా దృష్టి సారించినట్లు డిఎంకె వర్గాలు తెలిపాయి. ప్రతి ఓటు సరిగ్గా లెక్కించబడేలా చూసుకోవడానికి, ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతున్నప్పుడు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23న జరిగాయి, ఓట్ల లెక్కింపు మే 4న ఉదయం 8 గంటల నుండి ప్రారంభం కానుంది.

## బెంగాల్‌లో 77 బూత్‌లలో రీపోలింగ్‌ను పరిశీలిస్తున్నాం

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో బుధవారం తుది దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. అయితే పోలింగ్ అనంతరం, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 77 బూత్‌లలో తిరిగి పోలింగ్ నిర్వహించాలన్న డిమాండ్లను ఎన్నికల సంఘం చురుకుగా పరిశీలిస్తోందని ఒక అధికారి గురువారం తెలిపారు. ఫల్తా నుంచి 32, ఆ తర్వాత డైమండ్ హార్బర్ (29), మగ్రాహట్ (13), బడ్జ్ బడ్జ్ నుంచి మూడు ఫిర్యాదులు రీపోలింగ్ కోసం ఎన్నికల సంఘానికి అందాయని ఆయన చెప్పారు. ఇవిఎంల పనిచేయకపోవడం, బూత్ క్యాప్చరింగ్, బెదిరింపులు, లేదా ఓటింగ్ గోప్యతకు భంగం కలగడం వంటి నిర్దిష్ట అవకతవకలను ఉటంకిస్తూ, సాధారణంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, పోలింగ్ ఏ జెంట్లు, లేదా పరిశీలకులు కూడా రీపోలింగ్ కోసం డిమాండ్లు చేస్తుంటారు. 'బుధవారం పోలింగ్ ముగిసిన వెంటనే వెలుగులోకి వచ్చిన ఈ ఫిర్యాదులలో ఇవిఎంలను ట్యాంపరింగ్ చేయడం, యంత్రాలపై పదార్థాలను ఉపయోగించడం, నిఘా కెమెరాలకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు వంటి ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుల సంఖ్య, స్వభావం దృష్ట్యా, కమిషన్ ఎలాంటి రిస్క్ తీసుకోవడం లేదు' అని ఒక సీనియర్ అధికారి పిటిఐకి తెలిపారు. అందిన నివేదికల ఆధారంగా, పునర్పోలింగ్‌పై తుది నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ ప్రత్యేక పరిశీలకుడు సుబ్రతా గుప్తాను ఆదేశించినట్లు అధికారి తెలిపారు. గుప్తా ప్రస్తుతం పలు బూత్‌లలో పునర్పోలింగ్ అవకాశాలపై నిర్ణయం తీసుకునేందుకు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తున్నారని, ఆయన ఇతర పరిశీలకులతో కూడా చర్చలు జరుపుతున్నారని ఆయన చెప్పారు. 'ఈ ప్రాంతాల్లోని ప్రతి చోటా పరిస్థితిని స్వయంగా పరిశీలించి, సవివరమైన నివేదిక సమర్పించాలని ఆయనను కోరారు' అని ఒక అధికారిక వర్గం తెలిపింది. సాధారణంగా మరుసటి రోజే జరిగే పరిశీలన ప్రక్రియకు ఇది భిన్నమైన చర్య అని కూడా ఆ వర్గం పేర్కొంది. గుప్తా తనిఖీ తర్వాత పునర్పోలింగ్‌పై కమిషన్ తుది నిర్ణయం తీసుకుంటుంది. అవసరమైతే, ప్రభావిత బూత్‌లలో శుక్రవారం నాటికే పునర్పోలింగ్ నిర్వహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. డైమండ హార్బర్ ప్రాంతంలోని మగ్రాహత్ పశ్చిమ్‌లో ఓటర్ల ఓటింగ్ ఎంపికలను గమనించేందుకు వారి చొక్కా జేబుల్లో స్పై కెమెరాలు పెట్టారనే ఒక తీవ్రమైన ఆరోపణ కూడా నమోదైంది.


## 56 పాఠశాలల భవనాలు కూల్చివేత



**డెహ్రాడూన్ :** విద్యార్థుల భద్రతే ధ్యేయంగా ఉత్తరాఖండ్ ప్రభుత్వం ముందుకెళ్తోంది. డెహ్రాడూన్‌లో శిథిలావస్థలో ఉన్న 56 పాఠశాల భవనాలను జిల్లా యంత్రాంగం కూల్చివేసిందని, మరో ఎనిమిదింటిని నెలలోగా కూల్చివేసే అవకాశం ఉందని అధికారులు గురువారం తెలిపారు. పాఠశాల విద్యార్థుల ప్రాణాలకు, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదేశించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. మొత్తం 64 శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించగా, వాటిలో ఇప్పటివరకు 56 భవనాలను కూల్చివేశారు. మిగిలిన ఎనిమిదింటి కూల్చివేత నెలలోగా పూర్తి కావచ్చని అధికారులు తెలిపారు. ప్రధాన విద్యాధికారి జిల్లా మేజిస్ట్రేట్‌కు సమర్పించిన నివేదిక ప్రకారం, కూల్చివేసిన నిర్మాణాలలో 52 ప్రాథమిక, నాలుగు మాధ్యమిక పాఠశాల భవనాలు ఉన్నాయి. అదనంగా, శిథిలావస్థలో ఉన్న 17 తరగతి గదులలో 14 కూల్చివేయగా, మిగిలిన మూడింటిని 30 రోజుల్లోగా కూల్చివేయనున్నారు. గుర్తించిన నిర్మాణాలలో 23 చక్రాట బ్లాక్‌లో, కల్సి, దోయివాలాలో చెరో 17, రాయ్‌పూర్‌లో 14, వికాస్‌నగర్‌లో ఎనిమిది, సహస్‌పూర్‌లో రెండు ఉన్నాయి. 'విద్యార్థుల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. సురక్షితమైన వాతావరణాన్ని కల్పించేందుకు శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను వెంటనే తొలగిస్తాం' అని ఒక అధికారి తెలిపారు. విద్యార్థుల తరగతులకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు. విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా నివారించేందుకు, అసురక్షిత భవనాల గుర్తింపును పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల కూల్చివేయలేని 11 పాక్షికంగా లేదా పూర్తిగా శిథిలమైన నిర్మాణాల కూల్చివేతకు ఒక నెల గడువు పొడిగింపు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి యంత్రాంగం ఒక ప్రతిపాదనను పంపినట్లు అధికారులు తెలిపారు.

# తమిళనాడు, కేరళలో తమా కూటములదే ఆధిక్యం

పుదుచ్చేరిలో గట్టి పోటీ ఇచ్చాం, పశ్చిమ బెంగాల్‌లో ఎదుగుదల కోసమే పోరాడాం : కాంగ్రెస్ చీఫ్ ఖర్గే



**కలబురగి :** అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో, కాంగ్రెస్ భాగస్వామ్యంగా ఉన్న కూటములకు స్పష్టమైన మెజారిటీ లభిస్తుందని ఎఐసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరిగిన అసోంలో, ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్న దానికంటే కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందని ఆయన పేర్కొన్నారు. పుదుచ్చేరిలో తమ పార్టీ గట్టి పోటీని ఇచ్చిందని, పశ్చిమ బెంగాల్‌లో మాత్రం పార్టీ ఎదుగుదల కోసమే తాము పోరాడామని ఆయన తెలిపారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం మరియు పుదుచ్చేరి అసెంబ్లీల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. గురువారం ఖర్గే కర్నాటకలోని కలబురగిలో మీడియాతో మాట్లాడారు. 'కొన్ని చోట్ల ఎగ్జిట్ పోల్ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి, కానీ మరికొన్ని ఫలితాలు గందరగోళాన్ని సృష్టించాయి. అయితే తమిళనాడులో డిఎంకె స్పష్టమైన మెజారిటీని సాధిస్తుందని నేను భావిస్తున్నాను; అక్కడి ప్రజలతో కూడా నేను మాట్లాడాను. అదే విధంగా కేరళలోనూ, (కాంగ్రెస్ నేతృత్వంలోని) యుడిఎఫ్ కూటమికి మెజారిటీ లభిస్తుందని మా పార్టీ శ్రేణులు నాకు తెలియజేశాయి' అని ఒక ప్రశ్నకు సమాధానంగా ఖర్గే అన్నారు. 'అసోంలో మాకు ఆశించినన్ని స్థానాలు రావడం లేదని ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి, కానీ అవి చూపిస్తున్న దానికంటే ఎక్కువ స్థానాలను మేము గెలుచుకుంటామనే నమ్మకం నాకు ఉంది. పుదుచ్చేరిలో మేము బిజెపి, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు సమానంగా గట్టి పోటీని ఇచ్చాము; అక్కడి ఫలితాలపై కూడా మాకు ఆశలు ఉన్నాయి. అక్కడ తీవ్రమైన పోటీ జరిగింది; మరికొన్ని రోజులు వేచి చూద్దాం' అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎగ్జిట్ పోల్స్ అంతర్గత సమాచారం ప్రకారం తీవ్రమైన పోటీ జరిగిందని పేర్కొన్న ఖర్గే, 'మాకు అందిన సమాచారం ప్రకారం, అక్కడ టిఎంసి ముందంజలో ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర బలగాలను మోహరించడం ద్వారా బిజెపి, ఎన్‌డిఎ కూటములు అణచివేత, భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడ్డాయని ఆరోపిస్తూ, ఆ విధంగా చేయడం ద్వారా, మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసికి గట్టి పోటీని ఇవ్వడానికి వారు ప్రయత్నించారని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ విషయానికి వస్తే, పశ్చిమ బెంగాల్‌లో మా పోరాటం మొదటి నుంచే కొనసాగుతోంది. అక్కడ మేము మొదటిసారిగా ఒంటరిగా పోటీ చేశాము. మా పోరాటం పార్టీ ప్రయోజనాల కోసమే, అలాగే అక్కడ పార్టీ ఎదుగుదల కోసమే జరిగింది' అని ఖర్గే అన్నారు. తమకు అందిన సమాచారం (ఫీడ్‌బ్యాక్) ప్రకారం, ఎన్నికల ఫలితాలు పార్టీ ఆశించిన విధంగానే ఉంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం వెలువడిన పలు ఎగ్జిట్ పోల్స్, అసోంలో బిజెపికి ఘన విజయం లభిస్తుందని, పశ్చిమ బెంగాల్‌లో అధికార టిఎంసిపై ఆ పార్టీకి స్పష్టమైన ఆధిక్యం ఉంటుందని అంచనా వేశాయి. అదే సమయంలో, తమిళనాడులో డిఎంకె ప్రభుత్వం తిరిగి వస్తుందని, కేరళలో 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని కూడా అంచనా వేశాయి. అయితే, కొన్ని పోల్స్ మాత్రం పశ్చిమ బెంగాల్‌లో టిఎంసికి భారీ విజయం లభిస్తుందని, తమిళనాడులో హంగ్ హౌస్ ఏర్పడుతుందని, నటుడురాజకీయవేత్త విజయ్ యొక్క టివికె పార్టీ టిఎంకెకు విఘాతం కలిగిస్తుందని అంచనా వేశాయి. పుదుచ్చేరిలో ఎఐఎన్ఆర్‌సి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని దాదాపు అన్నీ అంచనా వేశాయి.

## పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం కోర్టు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు తెలిపింది. అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ భార్య రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఆరోపించారు. దాంతో రిణికి భూయాన్.. పవన్ ఖేరాపై పరువు నష్టం కేసు వేశారు. దాంతో పవన్ ఖేరా ముందస్తు బెయిల్ కోసం గువాహటి హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఖేరా పిటిషన్‌ను కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఖేరా పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. పవన్ ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. ఈ కేసు విచారణ కోసం పవన్ ఖేరాను కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. నిర్బంధ విచారణతో అవమానించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇది పరువు నష్టానికి సంబంధించిన అంశమని గుర్తుచేశారు. ఈ కేసులో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తాను చట్టాలకు అతీతం అన్న రీతిలో స్పందించారని, ఆయన రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యల వల్లే పవన్ ఖేరా అరెస్టుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పవన్ ఖేరాపై నమోదైన కేసుకు సంబంధించి పలు సెక్షన్ల కింద బెయిల్ పొందే అవకాశం ఉందని, మరికొన్ని సెక్షన్ల కింద అసలు అరెస్టు చేయాల్సిన అవసరమే లేదని సింఘ్వి వాదించారు. అస్సాం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి భార్య పాస్ పోర్టులకు సంబంధించిన నకిలీ కాపీలను పవన్ ఖేరా చూపించారని ఆరోపించారు. ఆయన చూపించిన కాపీలన్నీ అవాస్తవమే అన్నారు. పరారీలో ఉండి వీడియోలు విడుదల చేస్తున్నారని కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

## పిచ్చి పరాకాష్ఠ... హోర్ముజ్‌కు ట్రంప్ పేరు!

# పాస్‌పోర్టులపై ట్రంప్ ఫోటో, కరెన్సీపై సంతకం

### యుద్ధనౌకకూ ట్రంప్ పేరు 250వ వార్షికోత్సవ సందర్భంగా నిర్ణయాలు




**వాషింగ్టన్:** పశ్చిమాసియాలో వివాదాస్పద హోర్ముజ్ జలసంధికి ట్రంప్ తన పేరు పెట్టుకున్నారు. హోర్ముజ్ జలసంధి పేరు మారుస్తూ ''స్ట్రెయిట్ ఆఫ్ ట్రంప్''గా నామకరణం చేశారు. అదే విధంగా బ్రిటన్ నుండి అమెరికా స్వాతంత్ర్యం పొంది జులై నాలుగో తేదీ నాటికి 250 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ట్రంప్ పాలనా యంత్రాంగం అనేక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా, పాస్‌పోర్టులపై ట్రంప్ ఫోటోను ముద్రిస్తారు. ఈ విధానం రాబోయే జూలై నాలుగోతేదీ నుండి అమలులోకి వస్తుంది. సజీవంగాఉన్న ప్రసుతం పదవిలో ఉన్న ఒక ఒక పేజీలో ఆయన ఫొటో, స్వాతంత్ర్య ప్రకటన కింద ఆయన సంతకం ఉటాయి. ఈ పాస్‌పోర్టులు పరిమితంగానే విడుదల చేస్తారు. దేశాధ్యక్షుడి ముఖ చిత్రం ఈ విధంగా పాస్‌పోర్టులపై ముద్రించడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారి. అదేవిధంగా పాస్‌పోర్టుపై బంగారం రంగులో ఆయన సంతకం కూడా ఉంటుంది. ఇంతేకాకుండా, అమెరికా బ్యాంకుల కరెన్సీపై కూడా ఇక మీదట ట్రంప్ సంతకం అమలులోకి వస్తుంది. ఒక యుద్ధ నౌకకు కూడా ట్రంప్ పేరు పెడుతున్నారు. గతంలో జార్జి వాషింగ్టన్, థామస్ జెఫర్సన్ వంటి గొప్ప అమెరికన్ నాయకుల పేర్లు, ముఖచిత్రాలు మాత్రమే కరెన్సీమీద, పాస్‌పోర్టులమీదా ఉండేవి. ఇప్పుడు మొదటిసారి అధికార పదవిలో ఉన్న సమయంలోనే ట్రంప్ ముఖచిత్రాలు, ఆయన సంతకాలు అమెరికా కరెన్సీమీద, వీసాలపైనా చేరుతున్నాయి. అమెరికాలో ఒక పెన్ స్టేషన్‌కు కూడా ట్రంప్ పేరు పెడుతున్నారు. అదేవిధంగా ఆయన పేరుతో ఒక ప్రభుత్వ పథకాన్ని అమలుచేస్తారు. ఇక అనేక ప్రభుత్వ భవనాలలో మనదేశంలో జాతి నేతలైన గాంధీ, నెహ్రూ,అంబేద్కర్ చిత్ర పటాలు పెట్టినవిధంగానే అమెరికా కార్యాలయాలలో కూడా ఆ జాతి ప్రముఖుల చిత్రాలకు బదులుగా ఎక్కడ పడితే అక్కడ ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ ఫోటోలు దర్శనమిస్తున్నాయి.

# హార్ట్ ఎటాక్ రప్పించే భయంకరాస్త్రంతో త్వరలో దాడి

### అమెరికాకు ఇరాన్ నౌకాదళాధికారి హెచ్చరిక



**టెహ్రాన్:** ఇరాన్‌పై మళ్ళీ దాడులు చేస్తే అమెరికా–ఇజ్రాయెల్ దేశాలకు గుండెపోటు రప్పించే భయంకరమైన సరికొత్త అస్త్రంతో దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళ మాండర్ రీర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ ప్రభుత్వ టీవీ ద్వారా ఈ విషయం చెప్పారు. ఐతే ఆ భయంకర అస్త్రం ఏమిటో ఆయన వివరించలేదు. ''శత్రు బలగాలు చాలా తీవ్రంగా భయపడే శక్తిమంతమైన ఆయుధంతో త్వరలోనే దాడి చేస్తాం, శత్రుబలగాలు భయపడి పారిపోయేంత బలమైన ఆయుధంతో ఎదుర్కొంటాం, ఈ ఆయుధం వారి పక్కనే ఉంది, ఈ దాడుల తర్వాత వారికి గుండెపోటు రాదని ఆశిసున్నాను'' అని షహ్రామ్ చెప్పారు. హోర్ముజ్ దిగ్బంధనం ద్వారా ఆర్థికంగా దెబ్బతీసి ఒత్తిడి చేసే రాజకీయాల ద్వారా ఇరాన్‌ను చర్చల బల్ల వద్దకు తీసుకురావాలనే ట్రంప్ ఎత్తుగడలను ఆయన హేళన చేశారు. అకారణ దురాక్రమణ ద్వారా సాధ్యమైనంత త్వరగా తాము కోరుకున్న ఫలితాలను సాధించగలమని శత్రుదేశాలు ఇరాన్‌ను తక్కువగా అంచనావేశాయని ఆయన అన్నారు. మా సైనిక అకాడమీలో కూడా ఇదొక హాస్యోక్తిగా మారిందని అన్నారు. శక్తిమంతమైన అమెరికా విమానవాహక యుద్ధనౌక అబ్రహాం లింకన్‌పై ఇరాన్ ఏడు క్షిపణులతో దాడులు చేసిందని,దీంతో ఆ నౌక చాలా రోజులు యుద్ధ దాడులకు విమానాలను ప్రయోగించడానికి అవకాశం లేకుండా చతికిలబడిపోయిందని, సైనిక కార్యకలాపాలుచేయడం అమెరికాకుసాధ్యపడలేదని గుర్తుచేశారు.

గడచిన వారం రోజులుగా ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి చాలా ముమ్మరంగా దౌత్య కార్యకలాపాలు నిర్వహించారు. 48 గంటల వ్యవధిలోనే మూడుసార్లు పాకిస్థాన్ వెళ్ళి షెహబాజ్ షరీఫ్, అసిమ్ మునీర్‌లతో సంభాషణలు జరిపారు. ఒమన్ వెళ్ళి ఆ దేశ రాజుతో చర్చలు జరిపారు. తర్వాత రష్యా వెళ్ళి అధ్యక్షుడు పుతిన్‌తో సంభాషణలు జరిపారు. ఈ పరిణామాల మధ్యలోనే మూడు అంశాల ప్రణాళికను సోమవారం పాకిస్థాన్ ద్వారా ఆయన ట్రంప్‌కు చేరవేశారు. కానీ అతి ముఖ్యమైన అణ్వాయుధం, అణుఒప్పందం, శుద్ధిచేసిన యురేనియంలపై చర్చలను బాగా వెనక్కు నెట్టేసి మొదట హోర్ముజ్ తెరవాలని, యుద్ధ విరమణ చేయాలని ఇరాన్ చేసిన ప్రతిపాదన తమకు నచ్చలేదని ట్రంప్ స్పష్టంగా చెప్పారు.

హోర్ముజ్ జలసంధితో అనేక నెలలపాటు దీర్ఘకాలిక దిగ్బంధనానికి అమెరికా సేనలు సిద్ధపడుతున్నాయి. దీంతో ఇరాన్ వైపు నుండి గడచిన ఐదు రోజులుగా ముమ్మరంగా కొనసాగిన దౌత్య చర్యలు ఆగిపోయాయి. ఇరాన్ సర్వాధినేత మొజ్తాబా ఖమేనీ, నావికాదళాధికారి రంగంలోకి దిగి హెచ్చరికల ప్రకటనలు చేయడం ప్రారంభించారు. దీంతో రెండువైపులా మళ్ళీ యుద్ధ మేఘాలు కమ్ముకునే పరిస్థితులు వచ్చాయి.

## నాణ్యమైన సామగ్రి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు అవసరమైన వస్తువులను గతంలో శాఖల వారిగా ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని, వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు.. ఇక మీదట ఏలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని సిఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని, అవన్నీ జూన్ 15 నాటికి విద్యార్థులకు అందాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ తర్వాతే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సిఎం తెలిపారు.

మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించి అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా చేసి ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యతతో కూడిన నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి అందిందా లేదా పరిశీలించివాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సిఎం సూచించారు. ఎస్సి, ఎస్టి,బిసి,మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సిఈఓ దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టిజిబిసిడబ్ల్యూఆర్ఐఇఎస్ కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- నాలుగేళ్ళ గరిష్ఠస్థాయికి పెరిగిన చమురు ధర
- బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ 126 డాలర్లు
- అమెరికా, ఇరాన్ పరస్పర హెచ్చరికలు



**దుబాయ్:**ఇరాన్–అమెరికా మధ్య పరస్పర హెచ్చరికలు,ఇరాన్‌పై కొత్త దాడుల ప్రతిపాదన, మళ్ళీ కమ్ముకుంటున్న యుద్ధ మేఘాల మధ్య ఊహలకు భిన్నంగా ఉద్రిక్తతలు పెరుగుతూ ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర యుద్ధకాలపు గరిష్ఠస్థాయికి పెరిగిపోయింది. గడచిన నాలుగు సంవత్సరాలలో ఎన్నడూలేని విధంగా గురువారంనాడు బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 126.79 డాలర్లకు చేరుకుంది. ఆ తర్వాత లాభాలు తగ్గించుకుని సెషన్ ముగిసేసరికి బ్యారెల్‌కు 121.56 డాలర్లకు తగ్గింది. అదేవిధంగా అమెరికాలో వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యుటిఐ) ధర కూడా 108.44 డాలర్లకు చేరింది. ఇరాన్‌పై చేపట్టే కొత్త దాడుల ప్రతిపాదనల గురించి అమెరికా సెంట్రల్ కమాండ్ సైనికాధికారులు ట్రంప్‌కు ఒక ప్రణాళికను వివరిస్తారని వార్తలు వెలువడటంతో ప్రీమియం బ్రెంట్ క్రూడ్ దర ఊహకు మంచి పెరిగిపోయింది. పశ్చిమాసియాలో ఆయుధ పోరాటం మరింత పెరుగుతుందన్న భయాలు విస్తరించాయి. హోర్ముజ్ జలసందిలో కూడా అప్రమత్తత పెరిగి ఉద్రిక్త వాతావరణం నెలకుంది. ఇరాన్ నౌకలను కదలనీయకుండా అమెరికా యుద్ధ నౌకల నిఘా తీవ్రతరమైందని ఆక్సియోస్ వెల్లడించింది.అణ్వాయుధం, యురేనియం శుద్ధి,అణు హక్కుల ప్రస్తావన లేకుండా హోర్ముజ్ జలసంధిని తెరవాలన్న ప్రతిపాదనతోపాటు మూడు దశల చర్చలపై ఇరాన్ ఏప్రిల్ 27న సోమవారం ప్రతిపాదించిన ప్రణాళికను ట్రంప్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అణు ఒప్పందం కుదిరేదాకా హోర్ముజ్‌లో దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టం చేయడంతో మళ్ళీ కొత్త దాడులు ప్రారంభమవుతాయన్న భయాలు పెరిగాయి.

యుద్ధం మొదలైన తర్వాత అతి ఎక్కువగా ధర పెరుగుదల ఇదే. యుద్ధం వల్ల ఫిబ్రవరి తర్వాత చమురు ధర 45 శాతం పైగా పెరిగింది. మంగళవారం 100 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ధర బుధవారంనాటికి 115 డాలర్లకు పెరిగింది. అణు ఒప్పందంపై ఒక సమగ్ర ఒప్పందం జరిగే వరకూ హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలపై సైనిక దిగ్బంధనాన్ని తొలగించేది లేదని ట్రంప్ తాజా హెచ్చరిక చేయడం, దానికి ప్రతిగా ఇరాన్ సైన్యాధికారి అమెరికా–ఇజ్రాయెల్‌లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేయడంతో ఒప్పందంపై ఆశలు సన్నగిల్లాయి. హోర్ముజ్ నుండి ఇప్పటికే నౌకా వాణిజ్యం ఆగిపోవడంతో ప్రపంచదేశాల్లో సంక్షోభం తాండవిస్తోంది. ఈ పరస్పర హెచ్చరికలతో సప్లయ్ చైన్‌ను ఇప్పుడప్పుడే పునరుద్ధరించే అవకాశాలు లేవన్న నిరాశా నిస్పృహ, చమురు కొరత మధ్య చమురు ధర ఊహకు మించినస్థాయిలో పెరిగింది.

**యుఎఇ నిర్ణయం వల్ల చమురు ధరలు తగ్గుతాయ్ : ట్రంప్**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీసుకున్న నిర్ణయం వల్ల ప్రపంచవ్యాప్తం గా చమురు ధరలు తగ్గుతాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. మే ఒకటో తేదీ నుండీ ఒపెక్ బంధనాలు తెంచుకుని స్వతంత్రంగా వ్యవహరించాలని యు.ఎ.ఇ తీసుకున్న నిర్ణయాన్ని ఒక ప్రకటనలో ట్రంప్ స్వాగతించారు. యుఎఇకి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ చమురు కార్టెల్ ఒపెక్ నుండి వైదొలగాలని యుఎఇ తీసుకున్న నిర్ణయానికి తాను గట్టి మద్దతు ఇస్తున్నానని అన్నారు. ఆర్టెమిస్–2 వ్యోమగాములతో సమావేశమై వారికి అభినందనలు తెలియజేసిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, యుఎఇ రాజు షేక్ మొహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ చాలా తెలివైనవారని, ఈ నిర్ణయం వల్ల చమురు ధరలు తగ్గుముఖం పడతాయని అన్నారు. ''ఆయన సొంత మార్గంలో వెళ్ళాలనుకుంటున్నారు, ఒపెక్‌లో ఉన్నవారు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు, గ్యాస్,చమురు సహా అన్ని ధరలు తగ్గించడానికి ఇది చాలా మంచి విషయం'' అన్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైనప్పటి నుండీ చమురు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ఆ తర్వాత సంక్షోభ పరిస్థితులమధ్య ఈనెల 28వ తేదీన ఒపెక్ నుండి వైదొలగుతున్నట్లు యుఎఇ ప్రకటించి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆరు దశాబ్దాలకుపైగా చమురు ధరలను, ఉత్పత్తి కోటాలను నియంత్రిస్తూ ప్రపంచ మార్కెట్‌ను శాసిస్తున్న ప్రస్తుతం ఒపెక్‌లో మిగిలిన 11 దేశాలకు ఈ నిర్ణయం శరాఘాతంలా మారింది.

ఒపెక్‌లో అంతర్గత వైరుధ్యాలతోపాటు గల్ఫ్ యుద్ధంలో యుఎఇ మౌలిక సదుపాయాలపై దాడులతో ఆ దేశంలో ఇరాన్ విధ్వంసం సృష్టించడం కూడా రాజు అల్ నహ్యాన్‌కు తీవ్ర ఆగ్రహం కలిగించింది. అదేవిధంగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంవల్ల కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చమురు ఎగుమతి సామర్థ్యం దెబ్బతిని దాని ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

## పదవీ విరమణ

(మొదటి పేజీ తరువాయి)

పీపుల్స్ పోలీసింగ్ అనేది ఓ నినాదంగా తీసుకువచ్చామని, దీనికి ఓ కారణం ఉందని, అంతకు ముందు సాగిన తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేసేందుకు అప్పటి వ్యవస్థలకు పోలీసులు సహకరించారనే అపప్రద తెలంగాణ పోలీసులపై ఉండేదన్నారు. దాంతో ప్రజలకు, పోలీసులకు మధ్య దూరం పెరిగిపోయిందన్నారు. ఈ అగాధాన్ని తగ్గించేందుకు ప్రజలే పోలీసులు, పోలీసులే ప్రజలు అన్న ఉద్దేశంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం తీసుకువచ్చారన్నారు. అయితే ఈ ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటే నేరస్థులతో కూడా ఫ్రెండ్లీగా ఉంటారా, ఇది సరైన విధానం కాదేమో అనే సూచనలు కూడా వచ్చాయన్నారు. దీంతో తాను డిజిపిగా బాధ్యతలు తీసుకున్నాక సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానానికి శ్రీకారం చూట్టామన్నారు. నూతన డిజిపి బాధ్యతలు చేపట్టనున్న సివి.ఆనంద్ మాట్లాడుతూ శివధర్‌రెడ్డి ఒక కఠినమైన అధికారిగా మాత్రమే కాకుండా, సిబ్బందికి మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. ప్రతి పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొని, సంస్థకు గౌరవాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యం గా రాష్ట్రంలో మావోయిస్టుల సమస్యను అరికట్టడంలో ఆయన ప్రత్యేక చొరవ తీసుకోవడం గమనార్హం అని అన్నారు. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ అకాడమీ అభివృద్ధికి శివధర్‌రెడ్డి విశేష కృషి చేశారన్నారు. శిక్షణలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, యువ పోలీసులకు నూతన దిశను చూపించారని, నేడు ఆయనకు వీడ్కోలు చెప్పడం బాధాకరం కానీ, ఆయన వారసత్వం ఎప్పటికీ కొనసాగుతుందన్నారు.

**డిజిపి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు :** పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి లక్డికాపూల్‌లోని డిజిపి కార్యాలయంలో సాంప్రదాయ పద్ధతుల్లో అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శకటంపై ఆయన ఉండగా వాహనాన్ని తాళ్లతో అధికారులు లాగి అభినందన లు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనపై పూల వర్షం కురిపించారు. 'తాను డిజిపిగా బాధ్యతలు చేపట్టి ఇప్పటికి ఏడు నెలలు పూర్తయ్యాయి. ఈ కాలంలో నాకు తెలంగాణ ప్రజల నుండి, అలాగే హోంగార్డుల నుండి ఐపిఎస్ అధికారుల వరకు పోలీస్ విభాగంలోని ప్రతి ఒక్కరి నుండి అపారమైన మద్దతు సహకారం లభించింది''అని శివధర్‌రెడ్డి భావోద్వేగమైన ట్వీట్ చేశారు.

### .రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డిజిపి శివధర్‌రెడ్డి

పదవీ విరమణ పొందిన బి.శివధర్ రెడ్డి, ఇకపై రాష్ట్ర భద్రతా సలహాదారుగా మూడు సంవత్సరాలపాటు సేవలందించనున్నారు. పోలీసింగ్, లా అండ్ ఆర్డర్, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, నార్కోటిక్స్, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రభుత్వానికి మార్గదర్శకత్వం అందించనున్నారు. ఈ మేరకు శివధర్‌రెడ్డిని రాష్ట్ర భద్రతా సలహదారుగా నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకానికి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు ఖరారు చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాతో సమానమైన స్థానం కల్పించడమే కాకుండా, నెలకు రూ.2.25 లక్షల స్థిర వేతనం, కార్యాలయ వసతి, గృహ అద్దె భత్యం, ప్రభుత్వ వాహనం వంటి సౌకర్యాలు కల్పించనుంది. అదనంగా, టిఎడిఎ, వైద్య రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఇక హోం శాఖ ఆధ్వర్యంలో ఒఎస్‌డి, ప్రైవేట్ సెక్రటరీ, పర్సనల్ అసిస్టెంట్, డ్రైవర్లు, కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక స్టాఫ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ ఖర్చులు హోం డిపార్ట్‌మెంట్ సాధారణ బడ్జెట్ నుంచి భరించ బడతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రాష్ట్ర భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ నియామకం కీలకంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

### నేడు నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించనున్న సివి ఆనంద్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణరాష్ట్ర నూతన డిజిపిగా సివి ఆనంద్ శుక్రవారం ఉదయం 11.05 గంటలకు లక్డికాపూల్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతారు.ఈ కార్యక్రమానికి పలువురు సినియర్ ఐపిఎస్ అధికారులు హజరవుతారు.

# హోర్ముజ్ అట్టడుగున మీకు జల సమాధే

- * ట్రంప్‌కు మొజ్తాబా ఖమేనీ హెచ్చరిక
- * అణు, క్షిపణి సామర్థ్యం మా జాతీయ ఆస్తి, కాపాడుకుంటాం
- *జలసంధి మూసే ఉంటుందని పరోక్ష ప్రకటన

**టెహ్రాన్:**ఇరాన్ చేసిన మూడు దశల చర్చల ప్రణాళికను అమెరికా తిరస్కరించడంతో ఇరాన్ సర్వాధినేత ఆయెతొల్లా మొజ్తాబా ఖమేనీ మళ్ళీ లిఖిత రూపంలో టీవీ తెరమీదకు వచ్చి ట్రంప్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. దీంతో మళ్ళీ పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్‌కు వాణిజ్య నౌకల రాకపోకలు జరగకుండా అనేక నెలలపాటు దీర్ఘకాలిక దిగ్బంధనం కొనసాగించేందుకు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మొజ్తాబా ఖమేనీ విడుదల చేసిన ఒక ప్రకటనను గురువారం ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రసారం చేసింది. ''ఎక్కడో వేల కిలోమీటర్ల దూరం నుండి వచ్చి ఇక్కడ కుట్రలకు పాల్పడేవారికి హోర్ముజ్ జలసంధి అట్టడుగు జలాల్లో మాత్రమే ఒకే ఒక్క సురక్షితమైన ప్రదేశం మిగిలి ఉంది, అది జలాలలో అట్టడుగున ఖాళీ ప్రదేశం, అది అమెరికా కోసమే'' అని అమెరికాను జల సమాధి చేస్తామని హెచ్చరిక చేశారు. హోర్ముజ్‌పై ఇరాన్ తన నియంత్రణ కొనసాగిస్తుందని, తమ నౌకలపై దిగ్బంధనం ఎత్తివేసేవరకూ జలసంధి మూసే ఉంటుందని ఆయన సంకేతాలు ఇచ్చారు. జలసంధిలో ప్రయాణించే నౌకల నుండి ఇరాన్ రెండు మిలియన్ డాలర్లు వంతున కొన్ని నౌకల నుండి సుంకాలు కూడా వసులు చేసినట్లు ఇటీవల వార్తాలు వచ్చాయి.

''ఇస్లామిక్ రిపబ్లిక్ తన అణు–క్షిపణి సామర్థ్యాలను కాపాడుకుంటుంది, అవి ఇరాన్ జాతీయ ఆస్తులు'' అని పేర్కొంటూ బెదిరింపులతో లొంగదీసుకోవాలనుకుంటున్న ట్రంప్‌కు యుద్ధబరి గీశారు. ''అమెరికా ప్రమేయం లేకుండా పర్షియన్ గల్ఫ్‌కు దేవుడి సహాయంతో, దైవబలంతో ఒక గొప్ప భవిష్యత్తు ఉంది, ప్రగతిమార్గంలో గల్ఫ్ ప్రయాణం చేస్తుంది, ప్రజల సౌభాగ్య,క్షేమాలకోసం సేవ కొనసాగుతుంది'' అని మొజ్తాబా త ప్రకటనలో పేర్కొన్నారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంత జలాలను శత్రువులు దుర్వినియోగం చేయకుండా అడ్డుకుంటామని, శత్రుత్వాన్ని అంతం చేస్తామని, ఈ ప్రాంతాన్ని కాపాడతామని పేర్కొన్నారు. హోర్ముజ్ నిర్వహణకు కొత్త నిబంధనలు, కొత్త నిర్వహణ ద్వారా ఈ జలాల్లో భవిష్యత్ రాకపోకలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఐతే గల్ఫ్ దేశాలు, జిసిసి దేశాలు హోర్ముజ్‌లో రవాణా ఉచితంగా ఉండాలని, అదే ప్రపంచ వాణిజ్యానికి సురక్షితమని కోరుకుంటున్నాయి.''హోర్ముజ్‌పై ఇరాన్‌కు పూర్తి పట్టు ఉంది, ఈ జలసంధి పూర్తిగా ఇరాన్ అధీనంలో ఉంది, అందువల్ల హోర్ముజ్‌లో అమెరికన్లు ఉండాల్సిన స్థానం జలాల అట్టడుగు భాగంలో మాత్రమే'' అని స్పష్టం చేశారు. ''హోర్ముజ్‌లోని గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాలలో మాకు ఇరుగు పొరుగు దేశాల స్నేహితులున్నారు, వారితో మా కష్టనష్టాలను పంచుకుంటాం, ఎక్కడో వేల కిలోమీటర్ల దూరం నుండి వచ్చి పర్షియన్ గల్ఫ్‌లో, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో కుట్రపూరితమైన చర్యలకు పాల్పడేవారికి హోర్ముజ్ జలాల అట్టడుగున తప్ప ఇంకెక్కడా వారికి ఎలాంటి స్థానం లేదు'' అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా చేసిన గగనతల దాడిలో మొజ్తాబా ఖమేనీ తండ్రి ఆయెతొల్లా అలీ ఖమేనీతోపపాటు మొజ్తాబా తల్లి,భార్య, సోదరి, బావ, మేనకోడలు అందరూ మరణించారు. ఈ దాడిలో మొజ్తాబా ప్రాణాలతో బయట పడి ఇంకా చికిత్స పొందుతున్నారు. ఇరాన్‌పై కొత్త సైనిక చర్యల గురించి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ సన్నద్ధమయ్యారని గురువారం ఆక్సియోస్ ప్రకటించిన నేపథ్యంలో ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టీవీ చదివి వినిపించింది.పూర్తిగా లొంగుబాటు ధోరణి ప్రదర్శించి అమెరికాకు భారీ రాయితీలు ఇచ్చేదిశగా ఆలోచించేవిధంగా ఇరాన్‌లో వరుస దాడులు చేసే ఒక శక్తిమంతమైన సంక్షిప్త ప్రణాళిక గురించి ట్రంప్‌కు సెంట్‌కామ్ అధిపతి సవివరంగా తెలియజేయనున్నారు.

## జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)



చేపట్టనున్న అత్యంత ప్రమాదకరమైన ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ (సర్) పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సాంబశివరావు కోరారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ద్వారా బెంగాల్, తమిళనాడు, కేరళలో లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించారని ఇక్కడ కూడా అదే చేయనున్నారని ఆయన హెచ్చరించారు.

**సహకార సంఘాల పాలక మండళ్లను నామినేట్ చేయడం తగదు**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకమండళ్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. సభ్యులంతా తమ సభ్యత్వ రుసుం ద్వారా పాలకమండళ్లు ఏర్పాటు చేసుకుని వాటిని వారే నిర్వహించుకుంటున్నారని, వీటిపై ప్రభుత్వానికి నియంత్రణ అధికారం తప్ప మరే అధికారాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సహకార సంఘాల పాలకమండళ్లను నామినేటెడ్ పద్ధతిలో ఎన్నుకోవడమనేది ప్రజాస్వామ్యానికి విరుద్దమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పునర్ నిర్మించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని సిపిఐ స్వాగతిస్తోందని సాంబశివరావు చెప్పారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.11 వేల కోట్లు ఖర్చుపెట్టిన నేపథ్యంలో దానిని అందుబాటులోకి తీసుకురావాలనుకోవడం హర్షణీయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సైతం మరమ్మత్తులు చేసి వినియోగంలో తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించడం మంచి పరిణమామం అన్నారు. ఆర్‌టిసిపై ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుని సమ్మెను ఉపసంహరింపజేయడం ద్వారా పెద్ద విపత్తును తప్పించిందని, ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను సైతం 100 రోజుల్లో పరిష్కారిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణను కూడా చేపట్టాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను సైతం సాధ్యమైనంత త్వరలో విడుదల చేసి వారిని ఆదుకోవాలని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు.

### 4న పెట్రో ఉత్పత్తుల కొరతపై రాష్ట్రవ్యాప్త నిరసనలు

రాష్ట్రంలో పెట్రో ఉత్పత్తుల కొరతను నిరసిస్తూ ఈ నెల 4వ తేదీన సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. తక్షణమే ధాన్యం కొనుగోళ్ల ను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 2వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో రాస్తారోకోలు నిర్వహించనున్నారని, ఈ రెండు కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**యుద్ధం పట్ల స్పందించకపోవడం దారుణం**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ కొనసాగిస్తున్న యుద్ధం పట్ల ప్రధాని మోదీ స్పందించకపోవడం వల్లే దేశ వ్యాప్తంగా చమురు కొరతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని సాంబశివరావు తెలిపారు. ఒక వేళ కొరత లేకపోతే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ఆయిల్ కంపెనీలు కృత్రిమ కొరత సృష్టిస్తే దానిని తక్షణమే కట్టడి చేయాల్న్నరు. దాదాపు 140 కోట్ల మంది ప్రజల ప్రతినిధిగా ఉన్న ప్రధాని తన మౌనం ద్వారా ఈ దేశ ప్రజలకు లాభం చేస్తున్నారో నష్టం చేస్తున్నారో తనను తాను ప్రశ్నించుకోవాలని సూచించారు. అమెరికాతో స్నేహం ఉండోచ్చు కానీ ఆత్మగౌరవాన్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు.

## 'మీ చట్టాలు సవరించండి'

(మొదటి పేజీ తరువాయి)

గర్భవిచ్ఛిత్తికి అత్యాచార బాధిత మైనర్ బాలికకు సుప్రీంకోర్టు అనుమతిని ఇచ్చిన విషయం తెలిసిందే. పిల్లలతో సహా అత్యాచార బాధితులపై, అలాగే వారి శరీరాలపై స్వయం ప్రతిపత్తి అంశంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్న తీర్పులో, 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకోవడానికి 15 ఏళ్ల బాలికకు అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వును రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగీలతో కూడిన ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ దశలో 30 వారాల గర్భాన్ని తొలగిస్తే ఆ బాలిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్ పేర్కొనడంతో సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'అత్యాచారం వంటి కారణాల వల్ల గర్భం దాల్చినప్పుడు, కాలపరిమితి ఉండకూడదని మీ చట్టాన్ని సవరించండి. చట్టం వ్యవస్థీకృతంగా మారుతున్న కాలానికి అనుగుణంగా ఉండాలి. అలాగే అటువంటి విచారణలు వారం రోజుల వ్యవధిలో పూర్తి అయ్యేలా చట్టాన్ని సవరించండి. విచారణ పూర్తి అయ్యే లోపు ఆ బిడ్డ ఆ వేదనను కూడా ఎందుకు అనుభవించాలి' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. అత్యాచారానికి సంబంధించిన పిటిషన్ అని గర్భవిచ్ఛిత్తికి అనుమతించనట్లయితే బాధితురాలికి జీవితాంతం మచ్చ, మానసిక క్షోభ మిగిలిపోతాయని కోర్టు తన తీవ్రమైన వ్యాఖ్యలలో పేర్కొంది. తల్లికి శాశ్వత వైకల్యం లేకపోతే గర్భవిచ్ఛిత్తి చేయాలని అది తెలిపింది. 'ఇది ఒక క్యూరేటివ్ పిటిషన్. అవాంఛిత గర్భాన్ని ఒక వ్యక్తిపై బలవంతంగా రుద్దలేం. ఆలోచించండి. ఆమె ఒక చిన్నారి. ఆమె ఇప్పుడు చదువుకోవాలి. కానీ మనం ఆమెను తల్లిని చేయాలనుకుంటున్నాం. దీని వల్ల ఆ బిడ్డ అనుభవించిన బాధను, అవమానాన్ని ఊహించండి' అని బెంచ్ వివరించింది. ఈ ఆరోగ్య సమస్యలల విషయంలో బాధితురాలి తల్లికి కౌన్సిలింగ్ ఇవ్వాలని ఎయిమ్స్‌ను కోరింది. వారు తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయం చేయాలని, అందుకే ఈ విషయంలో ఈ నిర్ణయం బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులదేనని కోర్టు స్పష్టంచేసింది. 'దత్తత కోసం పిల్లలు ఉన్నారు. ఈ దేశంలో మనకు సానుభూతి చాలా తక్కువ. వీధుల్లో దిక్కులేని, వదిలివేయబడిన పిల్లలు చాలా మంది ఉన్నారు. వారిపై మాఫియా దాడులు జరుగుతున్నాయి. మనం వారిని పట్టించుకోవాలి. ఇది 15 ఏళ్ల బాలికకు అవాంఛిత గర్భం' అని బెంచ్ తెలిపింది. విచారణ సందర్భంగా ఎయిమ్స్ డాక్టర్ కోర్టుకు వివరణ ఇచ్చారు. 'అది బిడ్డకు, పిండానికి మధ్య పోరాటం కాదని, బిడ్డకు, బిడ్డకు మధ్య పోరాటం' అని చెప్పారు. ఎయిమ్స్ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి క్యూరేటివ్ పిటిషన్ గురించి మాట్లాడుతూ గర్భవిచ్ఛిత్తి సాధ్యం కాదని అన్నారు. 'బిడ్డకు, ఆమె తల్లిదండ్రులకు అన్ని విషయాలు వివరించండి., ఆ తర్వాత వారు తమ అభిప్రాయాలను మార్చుకోవాలనుకున్నప్పుడు చూద్దాం' అని ధర్మాసనం పేర్కొంది. ఎయిమ్స్ దాఖలు చేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు కొట్టివేసింది. గర్భం ముదిరిన దశలో ఉందనో, పిండం సాధారణంగా ఉందనో కాకుండా ఇతర కారణాలతో అవాంఛిత గర్భాన్ని వైద్యపరంగా తొలగించడాన్ని తిరస్కరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముంబైపై సన్‌రైజర్స్ భారీ విజయం



**ముంబై :** సన్‌రైజర్స్ హైదరాబాద్ మరోసారి దుమ్మురేపింది. సొంతగడ్డలోనే కాదు.. ప్రత్యర్థి జట్లు వారి హోంగ్రౌండ్స్‌లో తమ ఎదుట రికార్డు లక్ష్యాలను నిలిపినా తమకు తిరుగులేదని మళ్లీ నిరూపించింది. ప్రఖ్యాత వాంఖెడే స్టేడియంలో ముంబై నిర్దేశించిన 244 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 76, 4 ఫోర్లు, 8 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (30 బంతుల్లో 65 నాటౌట్, 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (24 బంతుల్లో 45, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సలిల్ అరోరా (10 బంతుల్లో 30 నాటౌట్, 2 ఫోర్లు, సిక్స్) దంచికొట్టారు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ముంబై.. రియాన్ రికెల్టన్ (55 బంతుల్లో 123 నాటౌట్, 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ శతకానికి తోడు విల్ జాక్స్ (22 బంతుల్లో 46, 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 31, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో 20 ఓవర్లకు 243/5 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఇది ఆరో విజయం కాగా ముంబైకి ఆరో ఓటమి.

**మొదట ట్రావిషేక్.. ఆఖర్లో క్లాసెన్...** రికార్డు ఛేదనలో హైదరాబాద్‌కు ఓపెనింగ్ జోడీ 'ట్రావిషేక్' అదిరిపోయే ఆరంభాన్నిస్తే హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్‌రెడ్డి, సలిల్ అరోరా మెరుపులతో లక్ష్యాన్ని సన్‌రైజర్స్ మరో 8 బంతులుండగానే పూర్తిచేసింది. ఈ సీజన్లో ఫామ్లేమితో తంటాలు పడుతున్న హెడ్.. బౌల్ట్ బౌలింగ్‌లో మూడు సిక్సర్లతో టచ్‌లోకి వచ్చాడు. అక్కడ్నుంచి అతడి విధ్వంసం తారాస్థాయికి చేరింది. అవతలి ఎండ్‌లో అభిషేక్ సైతం బాదుడులో హెడ్‌తో పోటీపడటంతో పవర్‌ప్లేలోనే ఎస్‌ఆర్‌హెచ్ వికెట్లేమీ నష్టపోకుండా 92 రన్స్ చేసింది. 20 బంతుల్లోనే హెడ్ ఈ సీజన్లో తొలి హాఫ్ సెంచరీ నమోదుచేశాడు. 8 ఓవర్లకే 126/0గా ఉన్న హైదరాబాద్‌కు 9వ ఓవర్‌లో ఘజన్ఫర్ వరుస షాకులిచ్చి అభిషేక్, ఇషాన్‌ను పెవిలియన్‌కు పంపాడు. తర్వాత హార్ధిక్ బౌలింగ్‌లో హెడ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన క్లాసెన్.. నితీశ్ (21) అండతో ఆకాశమేహద్దుగా రెచ్చిపోయాడు. అశ్వని ఓవర్లో నాలుగు బౌండరీలు బాదిన అతడు.. ఘజన్ఫర్ బౌలింగ్‌లో సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తైంది. సన్‌రైజర్స్ గెలుపునకు 4 ఓవర్లలో 32 రన్స్ మాత్రమే అవసరమవగా నితీశ్‌ను బౌల్ట్ ఔట్ చేసినా ఆఖర్లో క్లాసెన్ జతగా అరోరా పని పూర్తిచేశాడు.

**జాక్స్, రికెల్టన్ వీరబాదుడు...**టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబైకి కొత్త ఓపెనింగ్ జోడీ జాక్స్, రికెల్టన్ ఆ జట్టుకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. పవర్ ప్లేలోనే వికెట్లేమీ నష్టపోకుండా 78 రన్స్ చేసిన ఈ ద్వయం 43 బంతుల్లోనే 93 రన్స్ జోడించింది. బౌలర్లు మారినా వీరి బాదుడులో మార్పు లేకపోవడంతో ముంబై దూకుడుగా ఆడింది. నితీశ్ తన మొదటి ఓవర్లోనే జాక్స్‌ను ఔట్ చేయగా సూర్యకుమార్ (5) సైతం విఫలమయ్యాడు. మరో ఎండ్‌లో 23 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన రికెల్టన్ ఆ తర్వాత జోరు పెంచాడు. నమన్ (22), హార్ధిక్ అతడికి అండగా నిలిచారు. 44 బంతుల్లో శతకం పూర్తిచేసిన రికెల్టన్ ఆ తర్వాత నెమ్మదించాడు. ఐపిఎల్‌లో అతడికి ఇదే తొలి శతకం. రికెల్టన్ జోరు తగ్గినా మరో ఎండ్‌లో హార్ధిక్ మెరుపులు మెరిపించాడు. అయితే అతడు నిష్క్రమించాక ముంబై పరుగుల వేటలో వెనుకబడింది.

**సంక్షిప్త స్కోర్లు... ముంబై:** 20 ఓవర్లలో 243/5 (రికెల్టన్ 123*, జాక్స్ 46, హింగె 2/54, మలింగ 1/29);

**హైదరాబాద్:** 18.4 ఓవర్లలో 249/4 (హెడ్ 76, క్లాసెన్ 65*, ఘజన్ఫర్ 2/51, హార్ధిక్ 1/39)

# భారత టెన్నిస్‌లో 'జెన్సీ' సంచలనం

## సానియామిర్జా 'ఆల్‌టైమ్ రికార్డు' బ్రేక్!



భారత టెన్నిస్‌లో కొత్త తార దూసుకొచ్చింది. మహిళల సింగిల్స్ టెన్నిస్‌లో జెన్సీ కనబర్ చరిత్రాత్మక విజయం సాధించింది. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళల టెన్నిస్‌లో దుమ్మురేపిన జెన్సీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా ప్రొఫెషన్ టెన్నిస్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అతి చిన్న వయస్కురాలిలైన భారతీయురాలిగా రికార్డు సంపాదించింది. 14 ఏళ్ల 5 నెలల వయసులోనే ఈ ఘనత సొంతం చేసుకున్న జెన్సీ లెజెండ్ సానియామిర్జా రికార్డు అధిగమించింది. 25 ఏళ్ల క్రితం సానియామిర్జా ఐటిఎఫ్‌డబ్ల్యులో క్వార్టర్ ఫైనల్ చేరి రికార్డు నెలకొల్పింది. అప్పటి నుంచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు అమె పేరిటే ఉంది. ఇన్నేళ్లుగా చెక్కుచెదరని సానియా రికార్డును జెన్సీ బద్ధలు కొట్టింది. రెండో అంతర్జాతీయ టోర్నమెంట్లోనే సత్తా చాటిన తను 16వ రౌండ్‌లో సందీప్తిసింగ్ రావును 6–3, 7–5తో ఓడించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. ఈ ఏడాది ఆరంభంలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్ అండర్ 14 టైటిల్ గెలుపొందిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించిన జెన్సీ ఇప్పుడు సానియాను అధిగమించడం విశేషం. టీనేజ్‌లోనే సంచలన విజయాలతో అబ్బురపరుస్తున్న ఈ అమ్మాయి టెన్నిస్‌లో భారత మరో ఆశాకిరణంగా ఎదుగుతోంది.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## దేశంలో ప్రథమ ఇనుము–ఉక్కు కర్మాగారం ఎక్కడ నెలకొల్పబడింది?



- 'ప్లాసీ యుద్ధం' వీరిరువురి మధ్య జరిగింది?
  ఆంగ్లేయులకు, సిరాజుదౌలాకు
- నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (NATO) ఏర్పడినది?
  1949
- బిస్మార్క్ ఈ దేశ ప్రధానమంత్రి?
  ప్రష్యా
- 'బక్సార్ యుద్ధం' జరిగిన సంవత్సరం?
  క్రీ.శ. 17
- బాలాజీ బాజీరావు ఎప్పుడు మరణించాడు?
  1761
- రక్తం గడ్డ కట్టిన తర్వాత లభించే ద్రవం
  సీరమ్
- యూజి ఈగ వీటిని సంహరిస్తుంది.
  పట్టు పురుగు
- పో' నది గల దేశం
  ఇటలీ
- నైవేలి (తమిళనాడు) దీనికి ప్రసిద్ధి
  లిగ్నైట్
- మొదటి ప్రపంచ యుద్ధంలో తటస్థంగా ఉన్న దేశం
  అమెరికా సంయుక్త రాష్ట్రాలు
- 'హసియెండా'లు అని పిలువబడే విశాల వ్యవసాయ క్షేత్రాలు యిందు కలవు.
  చిలీ
- నూర్జహాన్ చిన్ననాటి పేరేమిటి?
  మహ్రూల నిసా
- సునామీలు అధికంగా ఏర్పడే సముద్రం ?
  పసిఫిక్ మహాసముద్రం
- కంటి రెటీనాలో ఉండే ఏ వర్ణకం ఏర్పడటానికి విటమిన్‌ఎ అవసరం?
  రొడాప్సిన్
- కాంతి వక్రీభవనం జరిగినప్పుడు మార్పురానిది
  పౌనఃపున్యం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవీ విరమణ వయసు ఎంత?
  65 సంవత్సరాలు
- మొదటగా వృత్తాన్ని 360 డిగ్రీలుగా విభజించినవారు ఎవరు?
  హిప్పార్కస్
- నాదిర్‌షా తర్వాత ఆఫ్ఘనిస్థాన్ పాలకుడు ఎవరు?
  అహ్మద్ షా అబ్దాలీ
- మనదేశంలో ప్రథమ ఇనుము ఉక్కు కర్మాగారం ఇచట నెలకొల్పబడింది?
  జెమ్‌షెడ్పూర్
- ఆపిల్ తోటలకు పేర్గాంచిన రాష్ట్రము?
  హిమాచల్ ప్రదేశ్
- కిరసనాయిల్ నుండి .......పొందుతాము?
  పెట్రోలు
- మానవులు సముద్రంలో ఎంతవరకు సజీవంగా ఉండగలుగుతారు?
  200 మీ.
- ఏ ఆవరణంలో ఓజోన్ పొర ఉంటుంది?
  స్ట్రాటో
- భౌగోళిక విస్తీర్ణం, జనాభా పరంగా దేశంలో తెలంగాణ రాష్ట్ర స్థానం ఎంత?
  12
- రాష్ట్రానికి అత్యధిక పన్ను ఆదాయం దేనిద్వారా లభిస్తోంది?
  అమ్మకపు పన్ను
- ఏది మౌలిక పరిశ్రమ కాదు?
  కాగిత
- జహంగీర్ రాజాస్థానాన్ని సందర్శించిన ఆంగ్లేయ వర్తకుడు ఎవరు?



  సర్ థామస్ రో
- విద్యాహక్కు చట్టం ద్వారా ఉచిత నిర్బంధ విద్యను అందించవలసినవారి వయస్సు?
  6–14 సంవత్సరములు
- రక్తంలోని లవణాలను కావలసిన స్థాయిలో ఉంచునది?
  మూత్రపిండాలు
- ఏలేశ్వర విద్యాపీఠాన్ని నిర్వహించినవారు?
  ముగ్ధశివాచార్యుడు
- ఇండియాలో పేదరికం అంచనాలను ఎన్ని సం. లకు ఒకసారి లెక్కిస్తారు?
  5 సం.లు
- దేశంలో ఎక్కువ నీటిపారుదల సౌకర్యం గల భూమి ఏ రాష్ట్రంలో ఉంది?
  పంజాబ్
- ప్రపంచ 'ఓజోన్ దినం' ఎప్పుడు?
  సెప్టెంబరు 16
- భాగ్యనగరాన్ని స్థాపించినవారు ఎవరు?
  మహ్మద్ కులీకుతుబ్షా
- 'శిలాదిత్యుడు' అనే బిరుదు ఎవరికి ఉంది?
  హర్షవర్ధనుడు
- మొదటితరం కంప్యూటర్లలో వాడిన కీలక పదార్థం
  వ్యాక్యూమ్ ట్యూబ్స్
- ఆస్ట్రేలియాలోని ఎత్తయిన పర్వత శిఖరం?
  కొసియుస్కొ
- 'వెట్టి' కార్మిక నిషేధ చట్టాన్ని ఎప్పుడు చేశారు?
  1976
- హర్షుడిని ఓడించి 'పరమేశ్వర్' అనే బిరుదు పొందినవారు?
  రెండవ పులకేశి
- రాష్ట్ర గవర్నరుతో ఎవరు ప్రమాణ స్వీకారం చేయిస్తారు?
  హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- దేశంలో వాస్తవ కార్యనిర్వహణ అధికారి ఎవరు?
  ప్రధానమంత్రి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతినెలా జాతిని ఉద్దేశించి ప్రసంగించేందుకు 'ఆకాశవాణి'లో నిర్వహిస్తున్న కార్యక్రమం ఏది?
  మన్ కీ బాత్
- జాతీయ ఆదాయ గణన ఎప్పుడు ప్రారంభించారు?
  1954
- మూడో పానిపట్ యుద్ధంఎప్పుడు జరిగింది?
  1761
- శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు ఏ రంగానికి సంబంధించింది?
  శాస్త్ర సాంకేతికత
- తుంగభద్ర కృష్ణానదిలో ఏ జిల్లాలో కలుస్తుంది?
  కర్నూలు
- మొక్క ఇతర భాగాలకు వేరు నుంచి నీరు ప్రసరించే ప్రక్రియను ఏమంటారు?
  ద్రవోద్గమము
- ప్రపంచంలో ఎత్తైన రైలు మార్గం దీని గుండా పోవుచున్నది?
  ఆండీస్
- నగల వ్యాపారం వాడే త్రాసు
  ఎలక్ట్రానిక్ బాలన్సు

## వాడవాడనా కార్మికజెండా ఎగరాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపు



**ప్రజాపక్షం/కోదాడ :** ప్రపంచ కార్మికుల పండుగ మేడేను విజయవంతం చేయాలని, వాడ వాడనా కార్మిక జెండాలను ఎగురవేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం కోదాడలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యుసి హమాలీలతో మేడే కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఉదయం 9గంటల నుండి 10 గంటల వరకు బహిరంగసభ ఉంటుందని ఈ సభకు ముఖ్యఅతిధులుగా ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లుతో పాటు పార్టీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. సభకు కార్మికులు, కర్షకులు, రైతులు, మేధావులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌కె లతీఫ్, పోతురాజు సత్యనారాయణ, కాంపాటి నాగయ్య, భూక్య సైదాపాషానాయక్, శ్రీనివాస్, రమేష్, లింగయ్య, విద్యాచారి, శ్రీనివాస్, కమటం వెంకటరెడ్డి, సైదులు, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలు రద్దు చేసే కుట్రలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రపంచ కార్మికుల పండుగైన మేడేను కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. గురువారం సత్తుపల్లి మండలం రామానగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మేడే రోజున అమరవీరులు సాధించిన హక్కులు, చట్టాలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను విడగొట్టి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గం మెడపై కత్తి పెట్టి విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతోందని మండిపడ్డారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర సాగిస్తూ, గాంధీ పేరును 'జి రాంజీ'గా మార్చి రెండు సార్లు, ఐదుసార్లు ఫోటో తీయాలని కార్మికులను ఇబ్బంది పెడుతూ ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకు మోడీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 200 రోజుల పనిదినాలు కల్పించి రూ.600 కూలీ ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మంచినీరు, మెడికల్ కిట్, టెంట్ వంటి కనీస సౌకర్యాలు ప్రభుత్వం సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించాలని, ఈ పథకాన్ని కాపాడుకునేందుకు ఉపాధి హామీ కూలీలు మేడే ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని దండు పిలుపునిచ్చారు. కార్మికులు, కష్టజీవులు, పేదలు, కూలీలు, వ్యవసాయ కూలీలు అందరూ ఐక్యమై మేడే కార్యక్రమంలో అమరవీరులకు జోహార్లు అర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జగన్నాథం, ప్రభుదాసు, సుజాత, లక్ష్మి, జానకి, రమణ, రాములమ్మ, బూచమ్మ, పద్మ, అన్నపూర్ణ, వీరఎంకమ్మ, వరదానమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మే డే పోరాట స్ఫూర్తితో కార్మిక లోకం ఏకం కావాలి



## జిల్లావ్యాప్తంగా ఎర్రజెండా రెపరెపలాడాలి

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మే డే పోరాట స్ఫూర్తితో కార్మిక లోకం ఏకం కావాలని, జిల్లావ్యాప్తంగా ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్' లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 1న జిల్లాలోని కార్మిక క్షేత్రాలు, శ్రామిక అడ్డాలు, బస్తీలు, గ్రామాలు, పార్టీ మరియు యూనియన్ కార్యాలయాలతోపాటు సింగరేణి బొగ్గుగనుల పరిధిలో ఎర్రజెండాను ఎగురవేయాలని కోరారు. ఎనిమిది గంటల పనిదినం కోసం చికాగో నగర వీధుల్లో కార్మికులు చిందించిన రక్తం వృధా కాలేదని, ఆ పోరాట ఫలితమే నేడు కార్మికులు అనుభవిస్తున్న హక్కులని గుర్తు చేశారు. పెట్టుబడిదారీ వర్గాల అణచివేతను ఎదిరించి, శ్రమశక్తి విలువను ప్రపంచానికి చాటిచెప్పిన రోజు మే డే అని కొనియాడారు. గాలి, నీరు లేని చీకటి గనుల్లో పనిచేసే బొగ్గు గని కార్మికుల నుండి, ఎండనక వాననక రెక్కలు ముక్కలు చేసుకునే వ్యవసాయ కూలీల వరకు అందరికీ మేడే ఒక ఆత్మ గౌరవ ప్రతీక అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, యజమానులకు కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. కష్టజీవుల హక్కులను కాలరాసే ఏ శక్తినైనా ఎర్రజెండా ముందు తలవంచాల్సిందేనని హెచ్చరించారు. కార్మికుల మధ్య చీలికలు తెచ్చే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి, సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలోనూ, ప్రతి పని ప్రదేశంలోనూ మేడే వేడుకలను నిర్వహించి కార్మికులను చైతన్యపరచాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, కందుల భాస్కర్, గెడ్డాడు నగేష్, గౌనె మణి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంతవరకూ పోరు ఆగదు

## ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసూఫ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్రప్రభుత్వం కార్మికులకు నష్టం కల్గించే విధంగా ఏప్రిల్‌లో అమలులోకి తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేంతవరకూ పోరు నిర్వహిస్తామని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసూఫ్ అన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలు జరిగితే పని గంటలు పెరుగుతాయని, జీతాల పెంపు యాజమాన్యం దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందని, ఉద్యోగ భద్రత ఉండదన్నారు, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడే ఉత్సవాల్లో ప్రతిన బూనాలని కార్మికులకు పిలుపునిచ్చారు. వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలను మే మొదటి వారంలోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు, లేనియెడల అన్నికార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మడ్డి ఎల్లా గౌడ్, కవ్వంపల్లి స్వామి, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజ్, మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, పి.విజయలక్ష్మి, ఎం.ఎ.గౌస్ పాల్గొన్నారు.



## 'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కార్మిక హక్కుల చట్టాల రక్షణ కోసం మేడే కార్యక్రమంలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో లక్ష్మణాచారి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను విడగొట్టి నాలుగు లేదర్ కోడులుగా తీసుకొచ్చి దేశంలో కార్మిక వర్గం మెడ మీద కత్తి పెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు కుట్ర సాగిస్తూ మహాత్మా గాంధీ పేరును తీసేసి జి.రాంజీ పథకంగా పేరు మార్చి రెండుసార్లు 5 ఫోటో తీయాలని కార్మికులను ఇబ్బంది పెడుతూ ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకు మోదీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. 200 రోజులు పనులు పెంచి, 600 రూపాయల కూలీ ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, మంచి నీరు మెడికల్ కిట్టు టెంట్ ప్రభుత్వం సరఫరా చేయాలని, ఉపాధి కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు చెల్లించాలని, ఈ పథకాన్ని కాపాడుకునేందుకు ఉపాధి హామీ కూలీలు మేడే ఉద్యమస్ఫూర్తితో పోరాడాలని మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి తీసుకొచ్చి నల్ల చట్టాలు దేశ రైతాంగాన్ని దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అదాని, అంబానీలు కట్టబెట్టేందుకు చేసిన కుట్రలను రైతాంగం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి వెనక్కి కొట్టిన చరిత్ర ఉందని, కార్మికులు, కష్టజీవులు వ్యవసాయ కూలీలు ఏకమై మేడే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# పేదల సమస్యలపై పోరాడే యోధుడు తక్కళ్లపల్లి

## ఆత్మీయ అభినందన సభలో వక్తలు



**ప్రజాపక్షం/హనుమకొండ :** పేదల సమస్యలపై నిరంతరం పోరాడే యోధుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అని పలువురు వక్తలు కొనియాడారు. హనుమకొండ వికాస్ నగర్ కాలనీలో గురువారం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. మేడే సందర్భాన్ని పురస్కరించుకుని కాలనీలో ఏర్పాటు చేసిన ఈ అభినందన సభకు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి అధ్యక్షత వహించగా పలువురు కాలనీ ప్రముఖులు పాల్గొని శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్ల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో కమ్యూనిస్టులు ముందుంటారన్నారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడం అంటే త్యాగాలతో కూడుకున్న పని అన్నారు. అలాంటి పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన శ్రీనివాసరావు రాష్ట్ర సహాయకార్యదర్శి కావడం గర్వకారణం అన్నారు. శ్రీనివాసరావు విద్యార్థి దశలోనే ఎఐఎస్‌ఎఫ్‌లో చేరి సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తూ రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శిగా ఎదిగారని కొనియాడారు. పలువురు కాలనీ ప్రముఖులు మాట్లాడుతూ శ్రీనివాసరావు ఏ స్థాయిలో ఉన్నా తమ కాలనీ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, చైతన్య దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వికాస్ నగర్ కాలనీ అధ్యక్షులు పులి వీరారెడ్డి, పరపతి సంఘం అధ్యక్షులు ఎస్‌వి.పాపారావు, కాంగ్రెస్ నాయకులు బంక సంపత్, కాలనీ ప్రముఖులు బాసెట్టి మల్లయ్య, రాంచందర్, హరి కిషన్, విజయ్‌పాల్‌రెడ్డి, కుమారస్వామి, ఈశ్వరయ్య, ఎం.శేఖర్, లక్ష్మి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, ఎస్.కె.బాష్‌మియా, నాయకులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, తోట బిక్షపతి, ఎన్.రాజమౌళి, మోతె లింగారెడ్డి, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్సా రవిందర్, గుండె బద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొట్టెపాక రవి, ఆరెల్లి రవి ఆధ్వర్యంలో ప్రజానాట్యమండలి కళాకారులు తమ ఆటా, పాటలతో ఉత్తేజ పరిచారు.




## ఎస్ఎస్‌సి 2026 పరీక్ష ఫలితాలలో 'కివీ' ప్రభంజనం

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సి 2026 పరీక్షా ఫలితాలలో అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని కివి పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మరోసారి నెంబర్ వన్ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ దాసి సతీష్ మూర్తి ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో అత్యధిక మార్కులు సాధించిన పూల మనోజ్ఞ 579, రాచర్ల లక్ష్మి ప్రసన్న 578, పెయింటకర్ జశ్విత 575, శివ రాత్రి అశ్విన్ కుమార్ 568, బూర అనుదీప్ 566, బొల్లం యశ్వంత్ 554, బసవరాజు సహస్ర 553, ఆకుతోట మేఘన 552, క్షీరసాగర్ సాహితి 550, బోద్దని పావని 549, కోడం అరూప్యాంజలి 548, జడల వైశాలిని 547 మార్కులు 500కు పైగా మార్కులు 34 మంది విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో 99 లేదా 100 మార్కులు సాధించి అండర్ రైల్వే గేట్‌లోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ దాసిరంజని అధ్యాపక బృందం పూజారి మురళి కె.శ్రీధర్, బి.శాంతకుమారి, జి.రాకేష్, ఎం.రమేష్ బాబు, రజనీష్, ఇతర అధ్యాపక బృందం పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## పది ఫలితాలలో స్కూల్ టాప్ విద్యార్థులకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/వేలేరు :** వేలేరు మండలకేంద్రంలోని జిల్లాప్రజాపరిషత్ పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధింగా స్కూల్ టాపర్స్‌ను ప్రథమ ర్యాంక్ సాధించిన మురావత్ దివ్య,ద్వితీయ ర్యాంక్ సాధించిన మండల తెజస్విని,తృతీయ ర్యాంక్ సాధించిన జన్నారపు చంద్రికలను గురువారం వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి గ్రామపంచాయితీ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనే అర్హులైన ఉపాధ్యాయులు ఉండడమేకాకుండా, నాణ్యమైన విద్య ఉంటుందని, చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి,ఉపసర్పంచ్ కోడూరి శ్రీకర్,వార్డు సభ్యులు సురేష్, సునీల్, గ్రామపంచాయతీ కార్యదర్శి సంపత్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మండల టాపర్‌గా ఇందుకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** మండలంలోని నాగారం గ్రామానికి నివాసి, రజక కుటుంబానికి చెందిన ఉల్లెంగుల లత, భాస్కర్ కుమార్తె ఉల్లెంగుల ఇందు, ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)కు చెందిన విద్యార్థిని 2026 పదవ తరగతిలో 558/600 మార్కులు సాధించి, మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి రజక సంఘం ముద్దుబిడ్డ ఇందుకు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరు వీరన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆమెను ఘనంగా సన్మానించి, అభినందించారు. అనంతరం వీరన్న మాట్లాడుతూ, ఇందు పై చదువుల కోసం ముందుకుసాగాలంటే, తల్లిదండ్రుల సహకారం, రజక సంఘం ఆధ్వర్యంలో ఆమెను ముందు సాగేవిధంగా మేము బాధ్యత తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి, గవ్వల మల్లేష్, బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల రాజు, ఏదునూరి యాదగిరి (లీడర్) ఉల్లంగుల బిక్షపతి, ఏదునూరి సన్నీ, ఏదునూరి వీర గణేష్, దేవరకొండ అంజయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/ములుగు :** మంత్రి సీతక్క ఆదేశాలనుసారం ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించి ప్రభంజనాన్ని సృష్టించిన జడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్ మండల విద్యార్థినులు జె అంజలి 560, ఎం జయశ్రీ 556, ఆర్ శ్రీజ 553లను ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిడిశెట్టి కోటి శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామప్ప ట్రస్టు బోర్డు చర్మన్ మిల్కూరి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్ట విజయ్‌బాబు, బాబూ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, పాఠశాల చైర్మన్, నాయకులు ప్రవీణ్, శ్రీధర్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో గిరిజన గురుకులాల్లో 100% ఉత్తీర్ణత

ఆర్.సి.ఓ. పి. రత్నకుమారి

**ప్రజాపక్షం/గూడూరు :** పదవ తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు మరోసారి అద్భుత ప్రతిభను చాటాయి. జిల్లాలోని మహబూబాబాద్ దామరవంచ మరిపెడ (బాలుర) కొత్తగూడ కేసముద్రం (బాలికలు) గురుకుల పాఠశాల్లో చదువుతున్న మొత్తం 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై అందరూ ఉత్తీర్ణలై 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఈవిజయంపై స్పందించిన ఆర్‌సీఓ పి రత్నకుమారి మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య క్రమశిక్షణ ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఈ విశిష్ట ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.విద్యార్థుల పట్టుదల తల్లిదండ్రుల ప్రోత్సాహం గురువుల మార్గదర్శకత్వం కలిసి ఈ విజయానికి దోహదపడ్డాయని ఆమె అభిప్రాయపడ్డారు ఈసందర్భంగా ఉత్తీర్ణలైన విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాలలో ఈ విజయంతో జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

# 'కుర్చీ' కొట్లాట!



జనగామ మున్సిపాల్టీలో కుర్చీ కోసం బిఆర్ఎస్ పట్టు

ప్రతి సమావేశంలో ప్రజా సమస్యలు గాలికి

చివరకు సమావేశం వాయిదా

**ప్రజాపక్షం/జనగామ :** జనగామ మున్సిపాల్టీలో కౌన్సిలర్లు ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు. కుర్చీ కోసమే కొట్లాడుతున్నారు. పంథాలకు పోయి చివరకు సమావేశాన్ని సైతం వాయిదా వేస్తున్నారు. గతంలోనే ఇదే జరగగా గురువారం జరిగిన సాధారణ సమావేశంలోనూ ఇదే జరిగింది. బిఆర్ఎస్, కాంగ్రెస్ మద్య జరిగిన కుర్చీ కొట్లాటను చూసి చివరకు ఆయా శాఖల అధికారులు సైతం ముక్కున వేలేసుకున్న పరిస్థితి.

జనగామ మున్సిపాల్టీలో జరగాల్సిన జనరల్, సాదారణ సమావేశాలు కుర్చీ కొట్లాట మూలంగానే వాయిదా పడుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ రాలేదు. కాంగ్రెస్‌కు సిపిఎంతో కలిసి 13 స్థానాల్లో గెలుపొందగా బిఆర్ఎస్ 13 స్థానాల్లో గెలుపొందింది. నాలుగు చోట్ల స్వతంత్రులు గెలుపొందడంతో కాంగ్రెస్‌కు వైపు ఇద్దరు, బిఆర్ఎస్ వైపు ఇద్దరు వెళ్లారు. రెండు పార్టీలకు సెరి 15 సీట్లు రాగా చైర్మన్ ఎన్నికల్లో ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కోఅప్షన్ సభ్యుడిగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బిఆర్ఎస్ కోఅప్షన్ సభ్యుడిగా పేర్లు నమోదు చేసుకున్నారు. చైర్మన్ మొదటి రోజు వాయిదా పడగా రెండో సారి డ్రా పద్దతిలో చైర్మన్ కాంగ్రెస్‌కు, వైస్ చైర్మన్ బిఆర్ఎస్‌కు దక్కింది. అప్పటి నుండి ఇరు పార్టీలు నువ్వా.. నేనా అన్నట్లు వ్యవహరిస్తున్నాయి.

**కుర్చీ కోసం బిఆర్ఎస్ పట్టు**

మున్సిపల్ సమావేశాల సందర్భంగా చైర్మన్ పక్కనే వేధికపై వైస్ చైర్మన్‌కు కుర్చీ వేయాలని బిఆర్ఎస్ పట్టుబడుతుంది. కాంగ్రెస్ మాత్రం వేధికపై కుర్చీ వేసేది లేదంటుంది. అయితే గతంలో బిఆర్ఎస్ మున్సిపాల్టీలో అధికారంలో రావడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఆ పార్టీకి సంబందించిన వారే కావడంతో కుర్చీ వేసి కూర్చునే వారు.

ఇక్కడ చైర్మన్ కాంగ్రెస్, వైస్ చైర్మన్ బిఆర్ఎస్ కావడంతో కాంగ్రెస్ పట్టువిడవడం లేదు. తమకు వేదికపై కుర్చీ వేస్తేనే సమావేశాలు నిర్వయిస్తామన్నట్లు బిఆర్ఎస్ వ్యవహరిస్తుంది. గురువారం సాదారణ సమావేశం కాగా వైస్ చైర్మన్ బూష పర్వతాలు స్వయంగా తానే కుర్చీ తెచ్చి వేదికపై వేసుకున్న పరిస్థితి. దీనితో చైర్ పర్సన్ కడకంచి బాలమణి ఇది పద్ధతి కాదంటు కిందకు వెళ్లాలని నచ్చజెప్పినా వినలేదు. దీనితో ఇరు పార్టీల మధ్య గర్షన జరిగింది. చివరకు పోలీస్‌కు వచ్చి వైదికపై ఉన్న కుర్చీ తీసివేయడంతో పాటు నెంబర్ ప్లేట్ కింద పెట్టారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

కుర్చీ కోసం కాకుండా ఎజెండా సమస్యలపై చర్చించాలని చైర్ పర్సన్ కడకంచి బాలమణి సూచించిన బిఆర్ఎస్ సభ్యులు వినిపించుకోలేదు. దీనితో గందరగోళం నెలకొంది. చివరకు బిఆర్ఎస్ సభ్యుల నిరసన, సభా నిర్వహించకుండా అడ్డుకోవడం మూలంగా వాయిదా వేస్తున్నట్లు చైర్ పర్సన్ కడకంచి బాలమణి తెలిపారు.

**కుర్చీనా..సమస్యలా ?**

గత మూడు పర్యాయాలుగా కుర్చీ కోసమే బిఆర్ఎస్ సభ్యులు పట్టుబడుతుండడంతో పలు విమర్శలకు తావిస్తోంది. బైలా ప్రకారం చైర్మన్‌తో సమానంగా కుర్చీ వేసే అవకాశం లేదు. అయితే గత సాంప్రదాయం ప్రకారం వేయాలని డిమాండ్ చేస్తున్నారు. కుర్చీ కొట్లాట ఒకటైతే మున్సిపల్ ఎన్నికలు జరినప్పటి నుండి ఇప్పటి వరకు ప్రజా సమస్యలపై చర్చించింది లేదు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్‌కు కుర్చీ కొట్లాట కావాలా.. ప్రజా సమస్యలపై చర్చిస్తారా అన్నది ఇప్పుడు ప్రజల నుండి వస్తున్న ప్రశ్న. గురువారం జరిగిన సమావేశంలో సిపిఎంకు చెందిన సభ్యురాలు బూడిద గోపి కుర్చీ కొట్లాట వదలి ప్రజా సమస్యలపై చర్చించాలంటు డిమాండ్ చేశారు. గత మూడు పర్యాయాలుగా కుర్చీ కోసమే కొట్లాడడం, ప్రజా సమస్యల్ని నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ బహిష్కరించి వెళ్లారు. మున్సిపల్‌లో జరిగే ప్రతి సమావేశంలో ఇలానే జరిగితే చివరకు జనం వీరి కుర్చీలు లేకుండా చేసే అవకాశాలు కూడా రావొచ్చన్న చర్చ జరుగుతుంది.



## నెక్కొండలో మెరిసిన ప్రతిభ... ఆర్యవైశ్య సంఘం ఘన సత్కారం

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ మండలంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులను మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ధారం ప్రణవ్ కుమార్ 573/600 మార్కులు, వేములపల్లి తనుశ్రీ 506/600 మార్కులు సాధించి ప్రతిభ చాటడంతో సంఘ సభ్యులు విద్యార్థులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపల్లి శివకుమార్, దొడ్డ విజయ్, తాల్లూరి నర్సింహస్వామి, భూపతి వీరన్న(ఎల్ఐసి), మారం రాము, గోరంట్ల వెంకటనారాయణ, దేసూ లక్ష్మ ణ్, దొడ్డ నగేష్, నంగునూరి భాస్కర్, నంగునూరి కిష్టమూర్తి, నంగునూరి వెంకన్న, వేములపల్లి శ్రావణ్, దొడ్డ నాగేశ్వర్ రావు, చిదురాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థికి సన్మానం



**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపల్ రాజేశ్వరిసన్మానించారు. నర్సంపేట పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థిని బైరి యశస్విని 562మార్కులు సాధించిన ఈ సందర్భంగా బైరి యశస్విని పూలబొకె, శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచిత విద్య

మోషన్ కాలేజ్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** 2025–26 విద్యా సంవత్సరంలో ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంచి సువర్ణావకాశం. కోటా రాజస్థాన్ మోషన్ కాలేజ్ ఐఐటి, జెఇఇ, నీట్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు శుభవార్త తెలిపారు. ఐఐటి, మెడికల్ కోచింగ్‌కు దేశంలోనే అగ్రగామి సంస్థ అయినటువంటి కోటా రాజస్థాన్ మోషన్ ఐఐటి, జెఇఇ, నీట్ జూనియర్ కళాశాల హన్మకొండ నందు విద్యార్థులు అడ్మిషన్ పొంది, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మోషన్ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐఐటి, మెడికల్ సీట్లను సాధించడమే లక్ష్యంగా హన్మకొండలోని నయీమ్ నగర్‌లో కోటా రాజస్థాన్ నుండి ఏర్పడ్డ మోషన్ కాలేజీలో నిష్ణాతులైన అధ్యాపక బృందంతో విద్యార్థినీ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరుగుతుందన్నారు. అదేవిధంగా పదవ తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు మోషన్ కాలేజీలో ఉచితంగా అడ్మిషన్ ఇస్తామని తెలిపారు. పదవ తరగతిలో 570 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 560 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 75 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 550 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 50 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ, 500 మార్కులకు పైన సాధించిన విద్యార్థులకు 25 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ ఉంటుందని, ఈ మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు బంగారు పునాదులు వేసుకోవాలని వేణుగోపాల్ గౌడ్ విద్యార్థినీ, విద్యార్థులకు పిలుపునిచ్చారు. మిగితా వివరాల కోసం హన్మకొండ, నయీమ్ నగర్, సిఎంఆర్ షాపింగ్ మాల్ ఎదురు లైన్‌లోని మోషన్ కాలేజీలో గాని, కాలేజీ సెల్ నెంబర్ 9703000850/851లకు సంప్రదించాలని కోరారు.

## భవిష్యత్తులో ఉన్నత శిఖరాల అధిరోహణ

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ :** విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని తొమ్మిది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల బాలికలు, బాలుర విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. మడికొండ సాంఘిక



సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని కె. అలేఖ్య 571 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించగా, కలెక్టర్ ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పదో తరగతి ఫలితాలు, ఉత్తీర్ణత శాతం వంటి వివరాలను జిల్లా సమన్వయ అధికారి శ్రీమతి ఉమామహేశ్వరి మరియు పాఠశాలల ప్రిన్సిపాల్‌లు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ, ఇదే ఉత్సాహంతో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.
కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'టెన్త్' ఫలితాల్లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రభంజనం

మండల టాపర్‌గా సి.హెచ్ భరత్ కుమార్ (555/600)

500 పైచిలుకు మార్కులతో ఆరుగురు విద్యార్థుల ఘనత

పాఠశాల ఉత్తీర్ణత శాతం 86.2%

**ప్రజాపక్షం/వరంగల్ :** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాల పేరును మండల స్థాయిలో మారుమోగించారు.

**ప్రతిభ చాటిన విద్యార్థులు :** మొత్తం ఆరుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. **వారి వివరాలు :** సి.హెచ్ భరత్ కుమార్ : 555/600 (మండల టాపర్), చిట్టిమల్ల చందన శ్రీ : 530/600, పి.నాగచైతన్య 525/600, రామగిరి అక్షయ: 524/600, మండల కీర్తన: 520/600, సాత్విక అంజు: 503/600, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. మాధవి మాట్లాడుతూ.. ఈ ఏడాది మొత్తం 124 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందులో 107 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాల మొత్తం 86.2% ఉత్తీర్ణత శాతం నమోదు చేయడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

**కార్పొరేటర్ అభినందనలు :** ఈ సందర్భంగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి గారు పాఠశాలను సందర్శించి విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా రాణించడం సంతోషకరం. పాఠశాల అభివృద్ధికి నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఎలాంటి సమస్యలు ఉన్నా నా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాను అని హామీ ఇచ్చారు.

**స్కూల్ చైర్మన్ ప్రశంసలు :** పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ గారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో 86.2% ఉత్తీర్ణత రావడం ఉపాధ్యాయుల కఠోర శ్రమకు నిదర్శనమని కొనియాడారు. విద్యార్థులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల విజయాన్ని వేడుకగా జరుపుకున్నారు.

## పాఠశాలలో మౌలిక సదుపాయాలపై దృష్టి

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎస్ఎస్‌సి ఫలితాలపై సమీక్ష

**ప్రజాపక్షం/జనగామ :** పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాని జనగామ జిల్లా కలెక్టర్ సందీఫ్‌కుమార్ ఝా తెలిపారు. పదవ తరగతి ఫలితాలపై గురువారం ఆయన సమీక్షించారు. అంతకు ముందు విద్యాశాఖ కార్యక్రమాలపై రాష్ట్ర విద్యాశాఖ కమీషరన్ యోగితారాణా విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఇంటర్, పదవ తరగతిలో ఫేయిల్ అయిన ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మే 11వ తేదీ నుండి వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధిత ప్రజా ప్రతినిధులు,అధికారులతో శంకుస్థాపన చేయించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నాను. మరుగుదొడ్లు, మూత్ర శాలలు, విద్యుత్, తాగునీటి కొరత ఉన్న పాఠశాల్లో యుడిఐఎస్ఐ పోర్టల్ ప్రకారం తక్షణమే పనులు పూర్తి చేయాలన్నారు. కెజిబివిలో పది, ఇంటర్ సప్లమెంటరీ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యేలా రెమెడియల్ కోచింగ్ నిర్వయించాలన్నారు. వేసవి క్యాంప్‌లు నిర్వహించి సప్లిమెంటరీ కోచింగ్ ఇవ్వాలని సూచించారు. బడిబాట, పిటిఎం, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కింద విద్యార్థుల నమోదుకు విస్తృత ప్రచారం చేయాలని, బడిబాట ర్యాలీల ద్వారా అవగాహన చేపట్టాలన్నారు. డ్రాఫౌడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాఠశాల విద్యను బలోపేతం చేయాలన్నారు. విద్యాశాఖ శాఖ ఏడి శ్రీనివాస్‌తో పాటు పలువురు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ప్రభుత్వ బాలికల పాఠశాల సత్తా

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** పది ఫలితాల్లో ప్రభుత్వ బాలికల పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటింది, ఇందులో భాగంగా బుధవారం వెలువడిన పది ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు, విదార్థిని గరిగె రితిక 561, ఆరెందల అపూర్వ 559,మోటం అక్షిత్ 554,సాగర్ల సాయి ప్రదీప్తిక 553,ఎండి రింషా 552,మట్టి పావని 551,జక్కుల హర్శిణి 550 మార్కులు సాధించి సత్తా చాటారు. ఇదే కాకుండా 34 మంది విద్యార్థులు 500 పైగా,31 మంది విద్యార్థులు 450కి పైగా, 19 విద్యార్థులు 400 మార్కులకు పైగా సాధించారని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యనభ్యసించిన 84 మంది విద్యార్థినులకు గాను వంద శాతంతో ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మద్ది మధు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వెలువడిన పది ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల మండలంలోనే ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్య అందుతుందని అన్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చపుతున్నామని దీనికి పాఠశాల సాధించిన ఉత్తీర్ణత ఒక ఉదాహరణ అన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

## మేడిగడ్డ బ్యారేజీ పనులు వేగవంతం

బ్యారేజీ పురోగతి పనులను పరిశీలించిన

ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సిబ్బంది కోసం గతంలో సిఆర్పీఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ లక్ష్మీబ్యారేజి, అన్నారం సరస్వతి బ్యారేజీలను శుక్రవారం ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేడిగడ్డలో కొనసాగుతున్న బోర్ హోల్స్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. సిబ్బంది కోసం గతంలో సిఆర్పీఎఫ్ పోలీసులు ఉపయోగించిన షెడ్లను పరిశీలించి సిబ్బంది ఉండేందుకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం అన్నారంలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద అదనపు సిబ్బంది వసతి కొరకు గదులను పరిశీలించారు. అన్నారం ప్రాజెక్ట్ అప్ స్ట్రీమ్ ను పరిశీలించి బోర్ హోల్స్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సి రమేష్ కుమార్, సిఇ శ్రీనివాస్ గుప్తా, ఇఇలు తిరుపతిరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్‌గా ఆదర్శ పాఠశాల

రాష్ట స్థాయి మార్కులు 590తో సత్తా చాటిన మనోజ్ఞ


**ప్రజాపక్షం/కాటారం :** మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని అలిపిరెడ్డి మనోజ్ఞ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబర్చి 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది.
అదే విధంగా గౌతంకృష్ణ 582,ఆరాధ్య 577, సాయి చరణ్య 576, తరీష్ 576, యాష్నిక 575, చరణ్ 575, స్మిత574, హర్షవి 573, మాధుర్య 570, 550 మార్కులకు పైగా 15 మంది, 500లకుపైగా మార్కులు 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మనోజ్ఞ సాధించిన ఈ ఘనతతో పాఠశాలపై మరింత బాధ్యత పెరిగిందని పాఠశాల చైర్మెన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపల్ కృషిత అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థిని మనోఙ మాట్లాడుతూ పాఠవాలలో అందుతున్న క్రమశిక్షణతో చదివి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో కష్టపడి ఫలితాలు సాధించినట్లు మనోజ్ఞ తెలిపింది.
ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కాటారం ప్రధాన కూడలిలో బానసంచాలు పేల్చి స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు.మనోజ్ఞను జిల్లా విద్యాధికారి రాజేందర్ మండల విద్యాధికారిణి శ్రీదేవి పలువురు అభినందించారు.

"ధశర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న అనుపమ పరమేశ్వరన్"

రీల్

# మూడు రోజుల పాటు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : మండే ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం దక్షిణ కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో గురువారం నుంచి శనివారం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వచ్చే కొన్ని రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శనివారం, ఆదివారం వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ వంటి జిల్లాలకు కూడా వర్షాలు విస్తరించే అవకాశం ఉంది.




## రాజకీయ లబ్ధి కోసం వ్యతిరేకించడమే
# ప్రతిపక్షాల ధోరణిగా మారింది!

మే 10న తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ
పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ: కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేసినా, కొన్ని ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్ వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజలకు, ప్రాంతాలకు, దేశానికి నష్టం జరుగుతుందా అనే విషయాన్ని పట్టించుకోకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యతిరేకించడమే వారి ధోరణిగా మారిందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళల రిజర్వేషన్ అమలు చేయాలంటే డీలిమిటేషన్ కూడా అవసరమని అన్నారు. "1971లో దేశ జనాభా సు మారు 55 కోట్లుగా ఉండగా 543 లోక్‌సభ స్థానాలు గా నిర్ణయించారని, ప్రస్తుతం జనాభా 140 కోట్లకు పైగా పెరిగిందున సీట్ల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని, దీనిపై విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. కానీ కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు లోక్‌సభలో బిల్లును అడ్డుకున్నారు. అయితే వారు ప్రధాని మోదీని ఓడించామని భావిస్తున్నారని, కానీ వారు ఓడించింది మోదీని కాదని, దేశంలోని మహిళలను, దళితులను, గిరిజనులను, గతంలో కూడా రాజ్యసభలో బిల్లులు ఆమోదించి, లోక్‌సభలో అడ్డుకున్న సందర్భాలు ఉన్నాయని, ఈ విధమైన రాజకీయాలు సరికావన్నారు.



**దక్షిణ భారతదేశానికి న్యాయం జరిగే అవకాశాన్ని కూడా అడ్డుకున్నారు**

దక్షిణ భారతదేశానికి న్యాయం జరిగే అవకాశాన్ని కూడా అడ్డుకున్నారని మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో 129 లోక్‌సభ సీట్లు ఉన్నాయని, వాటిని 195కు పెంచే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 38, తెలంగాణలో 26, తమిళనాడులో 59, కర్ణాటకలో 42, కేరళలో 30 సీట్లు పెరిగే అవకాశం ఉండేదన్నారు. దళితులకు సుమారు 132 సీట్లు పెరిగే అవకాశం ఉందని, గిరిజనులకు 72 సీట్లు పెరిగే అవకాశం ఉండేదన్నారు. ఎస్‌సి మహిళలకు 44 సీట్లు, ఎస్‌టి మహిళలకు 24 సీట్లు పెరిగే అవకాశం ఉండేదని, కానీ ఈ అవకాశాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని, కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు క్షమించరన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ పని చేస్తున్నదని విమర్శించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.


**10న ప్రధాని తెలంగాణ పర్యటన**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 10న సాయంత్రం 4 గంటలకు తెలంగాణలో పర్యటించనున్నారని, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాని తెలంగాణ పర్యటన సందర్భంగా సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు, కొన్ని ప్రాజెక్టులను తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన ఒక పెద్ద టర్మినల్‌ను ప్రారంభించనున్నామని, ఇందులో పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్, ల్యూబ్రికెంట్స్ నిల్వతో పాటు సరఫరా సదుపాయాలు ఉంటాయన్నారు. సుమారు 1.6 లక్షల కిలోలీటర్ల సామర్థ్యంతో ఇది నిర్మించబడిందని, ఈ టర్మినల్ మల్కాపూర్ వద్ద సుమారు రూ.611 కోట్ల వ్యయంతో నిర్మించబడిందని, తెలంగాణ అంతటా ఇక్కడి నుండి సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిని కూడా ప్రధాన మంత్రి వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు.

# కార్మిక వర్గానికి సిఎం రేవంత్‌రెడ్డి మేడే శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రామికులే కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని, వారందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మికవర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తున్నదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని సిఎం ఒక సందేశంలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలుతో పాటు తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేశామన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పనిచేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.







# ట్రంప్ తిరస్కృతి (మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ అనుసరిస్తున్న కాల్పుల విరమణ పొడిగింపు చర్యలకు పుతిన్ మద్దతు ఇచ్చారు. ఈ విధానంపట్ల ఆయన హర్షం ప్రకటించారు. ఐతే పుతిన్–ట్రంప్ మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణపై అంతర్జాతీయ వ్యవహారాల్లో పుతిన్ సహాయకుడు యూరీ ఉషకోవ్ మీడియాతో మాట్లాడుతూ, గత ఏడాది ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు ఇద్దరి మధ్యా ఇప్పుడు 12వ సారి టెలిఫోన్ సంభాషణ జరిగిందని చెప్పారు. రష్యా అధ్యక్షుడి సహాయకుడు ద్మీత్రీ పెస్కోవ్ కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమాసియాలో ఎన్నో పరిణామాలు జరుగుతున్నాయని, ఒక్క ఫోన్‌కాల్‌తో ఎలాంటి మార్పులూ సంభవించబోవని ఆయన స్పష్టం చేశారు. ఉక్రేన్‌లో యుద్ధం, ఇరాన్ లో యుద్ధం, ఆర్థిక పరిస్థితులు, మేనెల తొమ్మిదో తేదీన రష్యాలో జరగబోయే రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవ దినోత్సవం,మాలిలో ఘర్షణలు వంటి అనేక అంశాల గురించి నాయకులు ఇద్దరు ఫోన్ సంభాషణల్లో చర్చించారని ద్మీత్రీ పెస్కోవ్ చెప్పారు. రెండో ప్రపంచయుద్ధంలో విజయం సాధించిన రష్యా మే తొమ్మిదో తేదీన విజయోత్సవ దినోత్సవం చేస్తుందని, ఈ సందర్భంగా ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటిస్తారని, ఐతే ఈ కాల్పుల విరమణ తేదీలను ఇంకా ప్రకటించలేదని చెప్పారు. పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధం సంభవిస్తే పశ్చిమాసియా అల్లకల్లోమవుతుందని, ప్రపంచ ఆర్థిక పరిస్థితి, సమస్యలు పరాకాష్టకు చేరతాయని ట్రంప్‌కు పుతిన్ హెచ్చరిక చేశారు. యుద్ధ పరిష్కారానికి రష్యా చేయవలసిన కృషి చేస్తుందని, సహాయం చేస్తామని పుతిన్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. ఇక మాలీలో తీవ్రవాదం,ఉగ్రవాదంపై రష్యా తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ట్రంప్‌కు పుతిన్ చెప్పారు. ఇప్పుడు మాలిలో ఉగ్రవాద సంస్థలు రష్యా సైన్యాన్ని దేశం నుండి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. రష్యా ఆర్థిక పరిస్థితులపై కూడా సంభాషణ జరిగింది. వ్యవస్థ మందగమనంలో ఉందని, ఆర్థిక స్థిరత్వ సాధనకు చర్యలు తీసుకోవాల్సి ఉందని పుతిన్ పేర్కొన్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com